సోమవారం
17-10-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 116
పేజీలు : 12, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అంగారం, శృంగారం మేళవింపు మఖ్దూం 12లో
పార్టీ కోసం ఆస్తులమ్మిన మహిళామణి లలితాదేవి
జీవితమంతా పోరాటమే...!

అమరావతే రాజధాని

- సీపీఐ జాతీయ మహాసభల్లో ముప్పాళ్ల తీర్మానం
- ఏకగ్రీవంగా ఆమోదించిన సభ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించాలి
- రాజధాని నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతినే కొనసాగించాలని భారత కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే రాజధాని నిర్మాణాన్ని చేపట్టాలని స్పష్టం చేసింది. మూడు రాజధానులను నిర్మించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిర్ద్వందంగా వ్యతిరేకించింది. మూడు రాజధానుల అంశం అనవసరంగా ప్రాంతీయ విభేధాలను సృష్టించేందుకు కారణమవుతోందని పేర్కొంది. ఈ మేరకు సీపీఐ జాతీయ మహాసభల్లో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. విజయవాడ నగరంలో ఈనెల 14వ తేదీ నుంచి జరుగుతున్న సీపీఐ 24వ జాతీయ మహాసభలలో ఆదివారం అమరావతి రాజధాని అంశం పై పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తీర్మానం పూర్తి పాఠం ఇలా ఉంది. రాష్ట్ర విభజన 2014లో జరిగిన సందర్భంగా అమరావతిని రాష్ట్ర రాజధానిగా శాసనసభలో ఏకగ్రీవ తీర్మానం ద్వారా అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. అప్పుడు అధికారంలో ఉన్న తెలుగుదేశం-బీజేపీ ప్రభుత్వం శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టగా, ప్రతిపక్ష పార్టీగా ఉన్న వైసీపీ కూడా సంపూర్ణ మద్దతును తెలిపింది. అమరావతి రాజధాని నిర్మాణానికి దాదాపు 34 వేల ఎకరాల భూములను ఆ ప్రాంత రైతాంగం త్యాగం చేసింది. ఎలాంటి నష్టపరిహారం ఆశించకుండానే రైతులు తమ భూములను

ప్రభుత్వానికి అప్పగించారు. ప్రపంచంలో ఇలాంటి రైతుల త్యాగం మునుపెన్నడూ జరగలేదు. అత్యంత విలువైన తమ వ్యవసాయ భూములలో కేవలం నాల్గవ వంతు మాత్రమే వారు తీసుకునేందుకు అంగీకరించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి 2017 అక్టోబరు 22న ప్రధాని నరేంద్ర మోదీ భూమి పూజ కూడా చేశారు. అప్పటినుంచి సుమారు రూ.10 వేల కోట్లకు పైగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం పూర్తి చేసింది. ఇందులో సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ, ఉద్యోగుల నివాస భవనాలు, రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ వంటి సౌకర్యాలు, వివిధ శాఖల ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు ఉన్నాయి. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం 2019లో వచ్చిన తర్వాత మూడు రాజధానుల బిల్లును ప్రవేశపెట్టి అమరావతి రాజధానిని విస్మరించింది. జగన్‌మోహన్ రెడ్డి చేసిన మూడు రాజధానుల ప్రకటనను అమరావతి రైతులు, మహిళలు వ్యతిరేకిస్తూ ఉద్యమాన్ని ప్రారంభించారు. దాదాపు 1100 రోజులకు పైగా

వారి ఉద్యమం మహోద్యమంగా సాగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వ ఈ వైఖరిని రాజధాని రైతాంగం

- మిగతా 2 లో

కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలపై

పోరాటాలు ఉధృతం

సీపీఐ జాతీయ మహాసభల్లో తీర్మానం ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో-గురుదాస్‌దాస్ గుప్తా నగర్, విజయవాడ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలను ఉధృతం చేయాలని సీపీఐ జాతీయ మహాసభలు నిర్ణయించాయి. అన్ని వ్యవస్థలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని, ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా అమ్మేస్తున్నదని విమర్శించింది. ఈ విధానాలు దేశ వినాశనానికి దారితీస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. సీపీఐ 24వ జాతీయ మహాసభలలో ఈ మేరకు ఆదివారం ఒక తీర్మానాన్ని ఆమోదించారు. ఈ తీర్మానాన్ని బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ జాతీయ నాయకుడు సీహెచ్ వెంకటాచలం ప్రవేశపెట్టారు. దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలు 1991లో ప్రారంభం కాగా అప్పటి నుంచే ప్రభుత్వరంగం దెబ్బతింటూ వస్తోంది. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విధానాలతో పాటు ప్రమాదకర సంస్కరణలు చేస్తూ వాటిని అత్యంత పటిష్టవంతంగా అమలు జరుపుతూ దేశ వినాశనానికి కారణమవుతోందని తీర్మానం పేర్కొంది. 2016 నుండి జీడీపీ క్రమంగా క్షీణిస్తూ వస్తోంది. 2017 నుండి జీఎస్టీ విధిస్తూ ప్రజానీకంపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపింది. కోవిడ్ కారణంగా విధించిన లాక్‌డౌన్ తీవ్ర ఆర్థిక సంక్షోభానికి దారితీసింది. కోట్లాదిమంది వలస కార్మికులు వందలాది మైళ్లు నడుచుకుంటూ ఇళ్లకు చేరాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించిందని తీర్మానం విమర్శించింది. కరోనా కారణంగా దేశంలో 40 లక్షల మంది మరణించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసిందని, అయితే కేంద్రప్రభుత్వం మాత్రం పది రెట్లు తగ్గించి లెక్కలు చూపిందని ఆక్షేపించింది. అతి ముఖ్యమైన ఆరోగ్యరంగానికి కేవలం రెండు శాతం నిధులు మాత్రమే కేటాయింపులు

చేస్తున్నదని విమర్శించింది. బ్యాంకు రుణాల ఎగవేత పెద్దఎత్తున జరుగుతోందని, దాంతో బ్యాంకులు తీవ్ర నష్టాల్లోకి దిగజారిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజాధనం దోపిడీకి ప్రభుత్వం అనుసంధానకర్తగా వ్యవహరిస్తుందని మండిపడింది. పదిశాతం ప్రజల చేతుల్లో 57 శాతం సంపద కేంద్రీకృతమైందని, దాంతో అసమానతలు తీవ్రంగా పెరిగిపోతున్నాయని పేర్కొంది. దాదాపు 80శాతం మంది ప్రజానీకానికి వారి ఆదాయంలో తరుగుదల కనిపిస్తుండగా, 98మంది కుబేరులు మల్టీమిలీయనీర్లుగా మారారు. అదానీ, అంబానీల ఆదాయం విపరీతంగా పెరిగింది. 19 నుండి 28 సంవత్సరాల మధ్య యువతలో నిరుద్యోగం 34 శాతంగా నమోదైంది. అగ్నిపథ్ పథకం ద్వారా నిరుద్యోగ యువత తీవ్ర నిరాశకు గురవుతోంది. ఎయిర్ ఇండియా సంస్థను టాటాలకు అత్యంత తక్కువ ధరకు విక్రయించారని, బీపీసీఎల్, సీసీఐ, షిప్పింగ్ కార్పొరేషన్,

- మిగతా 2 లో

ఆధునిక సోషలిస్టు దేశాన్ని నిర్మిద్దాం

చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) 20వ జాతీయ మహాసభలు ఆదివారం ప్రారంభమయ్యాయి. రాజధాని బీజింగ్‌లోని "గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్" భవనంలో ఈ సమావేశాలు జరుగుతున్నాయి. సీపీసీ19వ కేంద్ర కమిటీ తరపున జి జిన్‌పింగ్ నివేదికను సమర్పించారు.

2 లో

నూతన, శ్రేష్ఠమైన అభివృద్ధి వేగవంతం

చైనా కమ్యూనిస్టు పార్టీ 20వ జాతీయ మహాసభల్లో జిన్‌పింగ్

ప్రాంతాల మధ్య జగన్ చిచ్చు

- 3 రాజధానులపై వెనక్కి తగ్గాలి
- జనసేన నేతలు, కార్యకర్తలపై కేసులు తగదు
- అన్ని రంగాల్లో మోదీ విఫలం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

(విశాలాంధ్రబ్యూరో-గురుదాస్ దాస్‌గుప్తా ప్రాంగణం, విజయవాడ): నాడు ప్రతిపక్ష హోదాలో అమరావతి రాజధానికి మద్దతిచ్చిన వైసీపీ అధినేత వైఎస్ జగన్...అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. అమరావతే ఏకైక రాజధానిగా ఉండాలని సీపీఐ 24వ జాతీయ మహాసభల్లో చేసిన తీర్మానాన్ని ఆంధ్రప్రదేశ్‌తోపాటు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ప్రచారంలోకి తీసుకువెళతామన్నారు. ఇప్పటికైనా మూడు రాజధానుల పేరుతో ప్రాంతీయ విభేదాలు సృష్టించే విధానాలపై సీఎం జగన్ వెనక్కి తగ్గాలని డిమాండ్ చేశారు. విజయవాడ గురుదాస్ దాస్‌గుప్తా ప్రాంగణం(ఎస్ఎస్ కన్వెన్షన్) మీడియా పాయింట్ వద్ద ఆదివారం రామకృష్ణ మాట్లాడుతూ సీపీఐ జాతీయ మహాసభల్లో అమరావతే రాజధానిగా ఉండాలని తీర్మానించినట్లు చెప్పారు. సీపీఐ జాతీయ మహాసభల్లో భాగంగా ఈనెల 14వ తేదీన విజయవాడలో నిర్వహించిన మహాప్రదర్శన విజయవంతమైందని చెప్పారు. మొదటి రోజు జరిగిన ప్రతినిధుల సభకు వామపక్ష పార్టీల నేతలు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారన్నారు. అమరావతి రాజధానిపై సీఎం జగన్ మొదటి నుంచి మొండి వైఖరితో ఉన్నారని

విమర్శించారు. అధికారంలో ఉండి బాధ్యతాయుతంగా వ్యవహరించపోగా మూడు రాజధానుల పేరిట రాష్ట్రంలో ప్రాంతీయ విభేదాల్ని సృష్టిస్తున్నారని మండిపడ్డారు. మూడు రాజధానులకు మద్దతుగా విశాఖలో నిర్వహించిన గర్జనకు ఏ మాత్రం స్పందన లేదని, అధికార పార్టీ ఏర్పాటు చేసిన జేఏసీలో వైసీపీ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఆ పార్టీ శ్రేణులే ఉన్నారని, జగన్ భజన చేసేవారే హాజరయ్యారని విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న విశాఖ నగరంలో అలజడులు సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది సీఎం జగన్‌కు సరికాదని, పోలీసులను అడ్డుపెట్టుకుని బెదిరింపు ధోరణులకు పాల్పడటం తగదన్నారు. సీనియర్ మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు రాజధానిపై చేస్తున్న వ్యాఖ్యలు ఏ మాత్రం సముచితంగా లేవన్నారు. నాడు అమరావతి రాజధాని ప్రకటించిన సమయంలోను, రైతులకు భూములిచ్చిన సమయంలోనూ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. విశాఖలో జనసేన కార్యకర్తలపై హత్యాయత్నం, వివిధ సెక్షన్ల కింద కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా నిరసన తెలిపే హక్కు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాల్ని జగన్ ప్రభుత్వం అవలంబించడాన్ని రామకృష్ణ వ్యతిరేకించారు. ఇకనైనా ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టడం ఆపాలని, లేకుంటే ప్రత్యక్షంగా

- మిగతా 2 లో

దటీజ్ కమ్యూనిస్టు మినిస్టర్

ఓ రాష్ట్రానికి మంత్రి అంటే...ముందు వెనుక భద్రత... కలవాలంటే కనీసం అపాయింట్‌మెంట్ కావాలి...అందుకోసం మధ్యవర్తులతో మంతనాలు గట్రా... ఇవన్నీ చాలా ఉంటాయి. అక్కడదాకా ఎందుకు... మన డివిజన్ కార్పొరేటర్‌ను కలవాలంటేనే తల ప్రాణం తోకకొస్తుంది...ఆయనకున్న మందీ, మార్బలం, సదరు కార్పొరేటర్ కనబడగానే దండాలు... ఇలాంటి అట్టహాసాలన్నీ సర్వసాధారణం. అయితే ఇలాంటి హడావుడికి కమ్యూనిస్టు మంత్రులు దూరం. ఇది గతంలోనూ జరిగింది...ఇప్పుడూ కొనసాగుతోంది. ఎందుకంటే... కమ్యూనిస్టు మంత్రైనా, ముఖ్యమంత్రి అయినా సామాన్యుల్లో ఒకరిగానే ఉంటారు. ఈ తాజా ప్రస్తావన ఎందుకంటే... సీపీఐ 24వ జాతీయ మహాసభలు విజయవాడలో

- మిగతా 2 లో

నేడు కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక

- గాంధీయేతర నాయకుడికి పట్టం
- కాంగ్రెస్‌లో కొత్త రాజకీయం
- ఓటు వేయనున్న 9 వేల మందికి పైగా పీసీసీ ప్రతినిధులు

న్యూఢిల్లీ : ఇరవై నాలుగేళ్లకు పైగా కాలం తర్వాత కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి గాంధీయేతర నాయకుడిని ఎన్నుకునేందుకు సర్వం సిద్ధమయింది. ఏఐసీసీ అధ్యక్ష పదవికి సోమవారం జరిగే ఎన్నికల్లో పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున ఖర్గే, శశి థరూర్ మధ్య పోటీ నెలకొంది. రహస్య బ్యాలెట్‌లో పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు 9 వేల మందికి పైగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) ప్రతినిధులతో ఓటర్ల జాబితాను ఏర్పాటు చేశారు. పార్టీ 137 ఏళ్ల చరిత్రలో ఆరవసారి అధ్యక్ష పదవికి జరుగుతున్న పోటీలో తమ నాయకుడిని ఎన్నుకునేందుకు న్యూఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయం వద్ద ఓటింగ్ నిర్వహించనున్నారు. అలాగే దేశవ్యాప్తంగా 65 కి పైగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయం వద్ద పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఓటు వేస్తారని భావిస్తున్నారు. ఇక కర్ణాటకకు చెందిన బళ్లారిలోని సంగనకల్లులో 'భారత్ జోడో యాత్ర' శిబిరం వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో రాహుల్ గాంధీతో పాటు యాత్రలో పాల్గొంటున్న దాదాపు 40 మంది పీసీసీ ప్రతినిధులు తమ ఓటు వేస్తారు. ఈ ఎన్నికల ఫలితం అక్టోబర్ 19న వెల్లడికానుంది. కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో అభ్యర్థిగా ఉన్న శశి థరూర్ తనను తాను మార్పు అభ్యర్థిగా చెబుతున్నప్పటికీ గాంధీలతో

- మిగతా 2 లో

విశాఖలో మళ్లీ ఉద్రిక్తత

- పవన్ కల్యాణ్‌కు పోలీసుల నోటీసు
- ర్యాలీలు, సభలకు అనుమతి లేదని వెల్లడి
- జనసేన కార్యకర్తల అరెస్ట్
- పోలీసుల తీరుపై మండిపడ్డ పవన్
- జనవాణి వాయిదా వేసినట్లు ప్రకటన

విశాలాంధ్రబ్యూరో-విశాఖపట్నం: జనసేన అధినేత పవన్ కల్యాణ్ విశాఖ పర్యటనలో ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. జనవాణి పేరుతో పవన్ కల్యాణ్ ప్రజల సమస్యల పై అర్జీలను స్వీకరించే కార్యక్రమాన్ని విశాఖ పోర్టు కళావాణి స్టేడియంలో ఆదివారం నిర్వహించ తలపెట్టారు. అయితే శనివారం ఎయిర్ పోర్టు వద్ద జరిగిన సంఘటన లపై 28 మంది జనసేన నేతలపై సెక్షన్ 147, 148, 149, 341, 307,

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నేడు మనీశ్ సిసోడియా అరెస్టు?

న్యూఢిల్లీ: ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) మళ్లీ సమన్లు పంపింది. సోమవారం ఉదయం 11 గంటలకు ఆయన సీబీఐ ఎదుట హాజరు కావలసి ఉంటుంది. తాను హాజరవుతాననీ, దర్యాప్తునకు సంపూర్ణంగా సహకరిస్తానని సిసోడియా అంటున్నారు. కానీ సోమవారం సిసోడియా సీబీఐ ఎదుట హాజరైనప్పుడే ఆయనను అరెస్టు చేసే అవకాశం మెండుగా కనిపిస్తోంది. సీబీఐ సమన్లు అందిన వెంటనే ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నాయకుడు సౌరభ్ భరద్వాజ్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సిసోడియాను అరెస్టు చేయవచ్చునని బలమైన అనుమానం వ్యక్తం చేశారు. ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త ఆబ్కారీ విధానంలో ఏదో కుంభకోణం జరిగిందన్న కారణంగా సీబీఐ దాడులు చేసింది.



ఇదివరకే సిసోడియా ఇంటి మీద దాడి చేసి సీబీఐ 11 గంటలపాటు ప్రశ్నించింది. ఈ దాడుల్లో తనకు వ్యతిరేకంగా ఏ ఆధారమూ లభించలేదని సిసోడియా అంటున్నారు. గుజరాత్ శాసనసభకు త్వరలో జరగనున్న ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేయాలని తలపెట్టింది. కాంగ్రెస్ పోటీ చేసినప్పటికీ గుజరాత్‌లో బీజేపీకి ప్రధాన ప్రత్యర్థి ఆమ్ ఆద్మీ పార్టీయేనన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

ఇరాన్ జైలులో భారీ అగ్నిప్రమాదం

జైలులో ఎక్కువగా రాజకీయ ఖైదీలే..!

టెహ్రాన్: ఇరాన్ రాజధాని టెహ్రాన్ జైలులో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. జైలులోని గార్డులు, కొందరు ఖైదీల మధ్య ఘర్షణ జరిగిన అనంతరం మంటలు చెలరేగినట్లుగా తెలుస్తున్నది. ఈ ప్రమాదంలో జరిగిన ప్రాణనష్టంపై సరైన సమాచారం ఇంకా అందలేదు. అగ్నిప్రమాదం సమయంలో కాల్పుల శబ్దం కూడా వినిపించినట్లుగా తెలుస్తోంది. అగ్నిప్రమాదం అనంతరం నిరసనకారులు ఈవిన్ జైలు వైపుగా వెళ్లడం ఇరాన్ మానవ హక్కుల సంఘాలు విడుదల చేసిన వీడియోల్లో కనిపిస్తున్నది. ఇరాన్ భద్రతా దళాలు జైలు సమీపంలో భారీగా మోహరించారు. ఈ జైలులో రాజకీయ ఖైదీలు ఎక్కువగా ఉన్నారు. 22 ఏళ్ల కుర్దిష్ యువతి మహ్సా అమిని పోలీసుల చేతిలో హత్యకు గురైన అనంతరం ఇరాన్‌లో నిరసనలు జోరందుకున్నాయి. గత నెల రోజులుగా జరుగుతున్న నిరసన ప్రదర్శనల్లో ఇప్పటి వరకు 200 మందికి పైగా ఆందోళనకారులు మరణించారు. 1,100 మందికి పైగా గాయపడ్డారు.

మెక్సికోలో కాల్పులు 12 మంది మృతి

మెక్సికో: మెక్సికోలోని ఓ బార్‌లో ఆదివారం జరిగిన కాల్పుల్లో 12 మంది మృతి చెందారు. మృతుల్లో ఆరుగురు మహిళలు ఉన్నారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. గ్వానాజువాటోలోని ఇరాపుయాటోలోని బార్‌లో జరిగిన ఈ కాల్పుల్లో ముగ్గురు గాయపడ్డారు. కాల్పులకు గల కారణాలు తెలియరాలేదు. గత నెల రోజుల్లో మెక్సికోలో ఇలాంటి ఘటన జరుగడం ఇది రెండవసారి. నైరుతి మెక్సికోలో నెల రోజుల కిందట జరిగిన కాల్పుల ఘటనలో మేయర్ సహా.. 12 మంది ప్రాణాలు కోల్పోయారు.

హవానాలో కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల సమావేశం

హవానా: క్యూబా రాజధాని హవానా వేదికగా, అక్టోబర్ 27-29, తేదీలలో అంతర్జాతీయ కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల (ఐఎమ్‌సీడబ్ల్యుపీ) 22వ అంతర్జాతీయ సమావేశం జరుగనుంది. సోషలిజం రక్షణ లక్ష్యంగా శాంతి,పర్యావరణం, కార్మికుల హక్కులు కోసం పోరాడుతున్న క్యూబా ప్రజలకు ఐఎమ్‌సీడబ్ల్యుపీ సంఘీభావం ప్రకటించింది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగే సామాజిక, ప్రజా ఉద్యమాలకు తమ తోడ్పాటు ప్రకటించింది. పెట్టుబడిదారీ విధానాలు, ఫాసిజం ధోరణులతో ప్రపంచం ప్రస్తుతం యుద్ధ ముప్పును ఎదుర్కొంటోందని శాంతి, సామరస్యం, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఐఎమ్‌సీడబ్ల్యుపీ సూచించింది. 21వ ఐఎమ్‌సీడబ్ల్యుపీ సమావేశం 2019లో టర్కీలోని ఇజ్మీర్‌లో జరిగింది. కరోనా మహమ్మారి సంక్షోభం కారణంగా డిసెంబర్ 2021లో ప్రత్యేక టెలికాన్ఫరెన్స్ జరిగింది.

ప్రాంతాల మధ్య జగన్ చిచ్చు

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. బీజేపీ నేత సోము వీర్రాజు చేస్తున్న వ్యాఖ్యల్ని రామకృష్ణ తీవ్రంగా తప్పుపట్టారు. ఎనిమిదేళ్ల మోదీ పాలనలో దేశానికి ఏమి చేశారని ప్రశ్నించారు. రైతుల సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. కార్పొరేట్, దోపిడీదారులకు అడ్డగోలుగా మోదీ సహకరిస్తున్నారని మండిపడ్డారు. ఏపీకి మోదీ పదేపదే అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. బీజేపీకి అధికారం ఇస్తే పోలవరం పూర్తి చేస్తామని సోము వీర్రాజు చేసిన వ్యాఖ్యలు ఉత్తరకుమార ప్రగల్భాలుగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. పోలవరం కట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదని, కడపలో స్టీలు ప్లాంట్ నిర్మించలేదని, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వలేదని విమర్శించారు. మోదీ, జగన్ కలిసి ప్రభుత్వ రంగ సంస్థలు, పోర్టులను ప్రైవేట్‌పరం చేస్తున్నారని రామకృష్ణ మండిపడ్డారు.

హిందీని రుద్దే ప్రయత్నాలు ఆపేయండి: సీఎం స్టాలిన్ లేఖ

చెన్నై: హిందీ భాష విషయంలో కేంద్ర ప్రభుత్వంపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. తాజాగా, ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఓ లేఖ రాశారు. 'దేశంలో హిందీ మాట్లాడేవారి కన్నా మాట్లాడని వారే ఎక్కువ మంది ఉన్నారు. ప్రతి భాషకు ప్రత్యేకత ఉంది. ప్రజలందరిపైనా హిందీ భాషను రుద్దాలని అనుకోవడం సరికాదు. ఇది సాధ్యంకానిది. ఈ తీరు హిందీ మాట్లాడని వారిలో అనేక అంశాల్లో ప్రతికూలంగా మారుతుంది' అని స్టాలిన్ విమర్శించారు. 'తమిళనాడుకే కాదు మాతృభాషను గౌరవించే, దానికి విలువ ఇచ్చే ఏ రాష్ట్రానికీ సమ్మతం కాదు. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ ప్రకారం విద్య, ఉద్యోగం వంటి వాటిల్లో అన్ని భాషలనూ ప్రోత్సహించాలి' అని చెప్పారు. హిందీని ప్రజలపై రుద్దాలని చేస్తున్న ప్రయత్నాలను ఆపేయాలని ఆయన కోరారు. వివిధ భాషలు మాట్లాడే ప్రజల మధ్య ఉన్న సోదర భావం 'ఒకే దేశం' పేరిట హిందీ భాష విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల నాశనం అవుతుందని పేర్కొన్నారు.

అమరావతే రాజధాని

(మొదటిపేజీ తరువాయి)

తీవ్రంగా నిరసిస్తోంది. రైతుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. ఈ ఉద్యమానికి విశేష ప్రజా స్పందన లభిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసినప్పటికీ అమరావతి రాజధాని నిర్మాణం పట్ల కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. శంకుస్థాపన సమయంలో గంగాజలాన్ని సైతం మోదీ తెచ్చిన విషయం విదితమే. ఇలాంటి పరిస్థితుల్లో అమరావతిలో రాజధాని నిర్మాణ పనులను ప్రారంభించే బాధ్యతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే తీసుకోవాలని సీపీఐ డిమాండ్ చేస్తోంది. మూడు రాజధానుల ఏర్పాటు అంశాన్ని సీపీఐ జాతీయ మహాసభలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. అనవసరంగా ప్రజల మధ్య ప్రాంతీయ విభేదాలు నెలకొనేందుకు ప్రభుత్వం చేస్తున్న ఈ తప్పుడు నిర్ణయం కారణమవుతుందని మహాసభ ఆందోళన వ్యక్తం చేసింది.

పోరాటాలు ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

బీఈఎంఎల్, నీలాచల్ ఇస్పాత్ నిగమ్, విమానాశ్రయాలు, ఓడరేవులను విక్రయాలకు పెడుతోంది. ఎల్ఐసీలో పెట్టుబడులను ఉపసంహరించుకుంటోంది. రెండు ప్రైవేటు రంగ బ్యాంకులను ప్రైవేటీకరిస్తోందని ఆ తీర్మానం విమర్శించింది. 41 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను కార్పొరేషన్లుగా మార్చి వాటి ప్రైవేటీకరణకు మార్గాలను సులభతరం చేసుకుంటోందని, రక్షణ రంగంలో కొన్ని విభాగాలను ప్రైవేటీకరిస్తోందని, ఇది దేశ భద్రతకు తీవ్ర ముప్పు కల్గించే అంశమని ఆందోళన వెలిబుచ్చింది. నిత్యావసర ధరలు ఆకాశన్నంటుతున్నాయని, ద్రవ్యోల్బణం విపరీతంగా పెరుగుతోందని పేర్కొంది. వినాశనానికి దారితీస్తున్న ఆర్థిక విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, పెట్టుబడుల ఉపసంహరణను వెనక్కి తీసుకోవాలని మహాసభ ఆ తీర్మానంలో డిమాండ్ చేసింది.

దటీజ్ కమ్యూనిస్ట్ మినిస్టర్

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతున్నాయి. ఈ మహాసభలకు కేరళ రెవెన్యూ మంత్రి కె.రాజన్ హాజరయ్యారు. మహాసభల వేదికకు ఎదురుగా ఓ టీ దుకాణం ఉంది. కేరళమంత్రి రాజన్ అతి సామాన్యుడిలా ఆ దుకాణానికి వెళ్లి టీ ఆర్డర్ చేసి, తాగేశారు. అనంతరం డబ్బులు ఇవ్వబోతుండగా సీపీఐ ప్రతినిధి ఒకరు దీనిని చూసి 'ఆయన ఎవరనుకున్నావ్... కేరళ మంత్రి... ఆయన దగ్గరే డబ్బులు తీసుకుంటావా' అని మందలిచినట్టు మాట్లాడారు. ఆంధ్రాలో మంత్రుల హడావుడి చూశాం...కానీ ఓ రాష్ట్రానికి మంత్రి అయి ఉండీ, అతి సామాన్యుడిలా టీ తాగేందుకు బయటకు వచ్చిన నిరాడంబరతను చూసి దుకాణ యజమాని షాక్ తిన్నాడు. షాక్ నుంచి తేరుకుని 'డబ్బులు వద్దు సార్' అంటూ మర్యాద ఇచ్చే ప్రయత్నం చేశాడు. మంత్రి దాన్ని సున్నితంగా తిరస్కరించి డబ్బులు ఇచ్చి అక్కడ నుంచి కదిలేందుకు యత్నించారు.

విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు ఆయనతో సెల్ఫీలు దిగేందుకు హడావుడి చేశారు. దటీజ్ కమ్యూనిస్ట్ మినిస్టర్.

ఆధునిక సోషలిస్టు దేశాన్ని నిర్మిద్దాం

బీజింగ్ : చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) 20వ జాతీయ మహాసభలు ఆదివారం ప్రారంభమయ్యాయి. రాజధాని బీజింగ్‌లోని "గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్" భవనంలో ఈ సమావేశాలు జరుగుతున్నాయి. సీపీసీ19వ కేంద్ర కమిటీ తరపున జి జిన్‌పింగ్ నివేదికను సమర్పించారు. ఈ ప్రసంగంలో ఆయన చైనా అభివృద్ధి, ప్రజా సంక్షేమం మెరుగుదల, జీవన నాణ్యత పెంపుదల ప్రాధాన్యతాంశాలుగా పేర్కొన్నారు. అందమైన చైనా నిర్మాణానికి పిలుపునిచ్చారు. తైవాన్ సమస్య గురించీ ప్రస్తావించారు. మానవ విలువలు పెంచుకోవాలని, ఇతర దేశాల ప్రజలతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకోవాలనీ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు.

"అన్ని విధాలుగా ఆధునిక సోషలిస్టు దేశం నిర్మాణం కోసం మనం అత్యంత శ్రేష్టమైన అభివృద్ధిని కొనసాగించాలి, ఇందుకు తప్పనిసరిగా ప్రప్రథమ ప్రాధాన్యతనివ్వాలి" అని జిన్‌పింగ్ అన్నారు. సరికొత్త అభివృద్ధి విధానాన్ని తీసుకురావడంలో, అత్యంత శ్రేష్టమైన అభివృద్ధి దిశగా ముందుకెళ్ళడంలో చైనా మరింత వేగం పెంచుతుందని చెప్పారు. అన్ని రంగాల్లో సరికొత్త అభివృద్ధితత్వాన్ని పూర్తిస్థాయిలో విశ్వసనీయంగా వర్తింపచేయాలి. సోషలిస్టు మార్కెట్ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి సంస్కరణలు కొనసాగించాలి. అత్యున్నత ప్రమాణాలను పెంపొందించాలి. దేశీయ ఆర్థిక వ్యవస్థ మీద మరింత దృష్టి పెంచుతూ సరికొత్త అభివృద్ధి పంథాను పరుగులు తీయించేందుకు వేగంగా చర్యలు తీసుకోవాలి. జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాల మధ్య సానుకూలమైన సహకారం ఉండాలి అని జిన్‌పింగ్ అన్నారు. స్థూల ఆర్థిక వ్యవస్థ నిర్మాణ సంస్కరణలను విస్తరించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు దేశీయ డిమాండ్ పెంపుదలకు చైనా వ్యూహాన్ని అమలు చేస్తుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో అగ్రభాగాన ఉండేలా దేశీయ ఆర్థిక వ్యవస్థ క్రియాశీలత, విశ్వసనీయతను పెంచేందుకు చర్యలు తీసుకుంటుంది. ఆధునిక ఆర్థిక వ్యవస్థ నిర్మాణం దిశగా దేశం వేగంగా ముందుకెళుతుందని, అత్యున్నత ప్రమాణాలతో కూడిన సోషలిస్టు మార్కెట్ ఎకానమీ నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటుందని జిన్‌పింగ్ స్పష్టం చేశారు. "వనరుల కేటాయింపులో మార్కెట్ నిర్ణయాత్మక పాత్ర పోషించేలా మనం పనిచేయాలి, అందులో ప్రభుత్వం తన పాత్రను అత్యుత్తమంగా నిర్వహించాలి" అన్నారు. ఆధునిక, సరికొత్త పారిశ్రామికీకరణ చర్యలతో పారిశ్రామిక వ్యవస్థనూ ఆధునీకరించాలి. తయారీ, ఉత్పత్తి నాణ్యత, అంతరిక్షం, రవాణా, సైబర్‌స్పేస్, డిజిటల్ అభివృద్ధిలో చైనా శక్తిని పెంచుకోవాలి.

దేశవ్యాప్తంగా గ్రామీణ పునరుత్తేజం కోసం చైనా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యతను కొనసాగిస్తుందని, దారిద్ర్య నిర్మూలనలో విజయ పరంపరను కొనసాగిస్తుందని, ఆహార భద్రత చర్యలను పటిష్టం చేస్తుందని వివరించారు. ప్రాంతీయాభివృద్ధి వ్యూహాన్ని, ప్రధాన ప్రాంతీయ వ్యూహాలను, నూతన పట్టణీకరణ వ్యూహాన్ని చైనా సమన్వయంతో అమలు చేస్తుందన్నారు. బెల్ట్ అండ్ రోడ్ విషయంలోనూ అత్యంత నాణ్యమైన అభివృద్ధిని పెంపొందిస్తుందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు చైనా ప్రాధాన్యతనిస్తోందన్నారు.

ప్రజా సంక్షేమం మెరుగుదలకు ప్రతిజ్ఞ

ప్రజా సంక్షేమం మెరుగుదల, జీవన నాణ్యత పెంపుదలకు కృషి చేస్తామని జిన్‌పింగ్ ప్రతిజ్ఞ చేశారు. "ఈ దేశం ప్రజలది. దేశమంటే ప్రజలు. పీపుల్స్ రిపబ్లిక్ నిర్మాణం, అభివృద్ధి పోరాటంలో ప్రజలను సీపీసీ ముందుండి నడిపిస్తోంది. వారి మద్దతుతోనే ఈ పోరాటం కొనసాగుతోంది" అన్నారు. ప్రజా లబ్దే పాలన ప్రాథమిక సూత్రమన్న జిన్‌పింగ్ ప్రజా సంక్షేమం కోసం కృషి చేయడం పార్టీ కట్టుబాటులో కీలకాంశం. ఆదాయ పంపిణీ వ్యవస్థను చైనా మరింత మెరుగుపరుస్తుందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీసీ కఠినంగా శ్రమిస్తోందన్నారు. ప్రజారోగ్యం, సామాజిక భద్రతా వ్యవస్థను మరింత పెంపొందిస్తున్నామన్నారు. ఉద్యోగాలు లేనివారి కనీస అవసరాలను తీర్చేందుకు చైనా మరిన్ని చర్యలు తీసుకుంటుందన్నారు.

మంచి మానవ సమాజం కోసం అంకితమవుదాం

ప్రపంచ మానవులంతా కలసిమెలసి ఉండే అందమైన మంచి మానవ సమాజం కోసం, అందుకు అవసరమైన మానవ విలువల పెంపుదల కోసం చైనా అంకితమవుతుందని జిన్‌పింగ్ చెప్పారు. భాగస్వామ్య భవిష్యత్తుతో కూడిన మానవ సమాజాన్ని రూపొందించుకోవాలన్నారు. ప్రపంచ శాంతి, ఉమ్మడి అభివృద్ధి కోరుకునే తమ విదేశాంగ విధానాలకు చైనా ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. మానవ సమాజం కనీవినీ ఎరుగని సవాళ్ళను ఎదుర్కొంటోందన్న ఆయన శాంతి, అభివృద్ధి, నిజాయితీ, న్యాయం, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ లాంటి మానవతా విలువలను పంచుకోవాలని ఇతర దేశాలన్నింటికీ జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. పరస్పర అవగాహనను పెంపొందించుకోవాలని, ఇతర దేశాల ప్రజలతో సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకోవాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయంగా ఎదురవుతున్న అన్ని రకాల సవాళ్ళను ఎదుర్కొనేందుకు మనమంతా ఒక్క శక్తిగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆధిపత్యం, అధికార రాజకీయాలు, ప్రచ్ఛన్న యుద్ధ మనస్తత్వం, ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం, ద్వంద ప్రమాణాలను ఏ రూపంలో ఉన్నా చైనా గట్టిగా వ్యతిరేకిస్తుందన్నారు. అంతర్జాతీయ సంబంధాల నిర్వహణలో ప్రాతిపదిక ప్రమాణాలను అనుసరిస్తుందని, అంతర్జాతీయ న్యాయాన్ని కాపాడేందుకు కృషి చేస్తుందని చెప్పారు. ఇతర దేశాలతో స్నేహసహకారాలు శాంతియుత సహజీవనానికి చైనా ఐదు సూత్రాలకు కట్టుబడి ఉందని వివరించారు.

దేశ పునరేకీకరణకు దృఢ నిశ్చయం

ఈ నూతన యుగంలో తైవాన్ సమస్య పరిష్కారం కోసం చైనా కమ్యూనిస్టు పార్టీ సమగ్ర విధానాన్ని అవలంబిస్తుందని జిన్‌పింగ్ చెప్పారు. దేశ పునరేకీకరణకు దృఢ నిశ్చయంతో ముందుకెళతామన్నారు. "తైవాన్ సమస్య పరిష్కారం చైనీయులకు సంబంధించిన అంశం. దీనిని తప్పనిసరిగా వారే పరిష్కరించుకుంటారు" అని పేర్కొన్నారు. "శాంతియుతంగా పునరేకీకరణకు పూర్తి నిజాయితీతో చేయదగిన కృషిని మనం కొనసాగిద్దాం. కానీ, బలప్రయోగం చేయబోమని మనం ఎప్పుడూ హామీనివ్వలేదు. అవసరమైనపక్షంలో ఎలాంటి చర్యలకైనా దిగుతాం. బయటి వ్యక్తుల జోక్యం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. కొద్దిమంది వేర్పాటువాదులు తైవాన్ స్వాతంత్ర్యాన్ని కోరుతున్నారు. వారి వేర్పాటువాద చర్యలు మన తైవాన్ దేశీయులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్నవే" అని జిన్‌పింగ్ అన్నారు. చైనా పునరేకీకరణ, చైనా జాతి పునరుత్తేజం దిశగా చరిత్ర పునరావృతమవుతుందన్నారు. "మనదేశ సంపూర్ణ పునరేకీకరణ తప్పనిసరిగా వాస్తవరూపం దాల్చుతుంది. ఆ విషయంలో ఎలాంటి సందేహం అవసరం లేదు. అది జరిగి తీరుతుంది" అని జిన్ అన్నారు. మన తైవాన్ దేశీయులను మనం ఎప్పుడూ గౌరవిస్తున్నాం, వారి గురించి శ్రద్ధ తీసుకుంటున్నాం. వారి ప్రయోజనాల కోసం పని చేస్తున్నాం అని జిన్‌పింగ్ వివరించారు. ఆర్థిక, సాంస్కృతిక మార్పిడి, సహకారం పెంపుదల కొనసాగుతుందని చెప్పారు. చైనా సంస్కృతి పెంపొందించేందుకు, సన్నిహిత సంబంధాల విస్తరణకు రెండువైపులా ప్రజలు కలసి పనిచేసేలా ప్రోత్సహిస్తామన్నారు.

బలహీన భారతమే 'కాషాయ' లక్ష్యం: రాహుల్

న్యూఢిల్లీ: బలహీన భారతమే ఆర్ఎస్ఎస్-బీజేపీ లక్ష్యమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. దేశాన్ని బలహీనపరిచే చర్యలను కాషాయ వర్గం ఇంకెంత కాలం కొనసాగిస్తుందని ఆయన ప్రశ్నించారు. వాస్తవ పరిస్థితుల నుంచి ప్రజల దృష్టిని మళ్లిస్తూ పబ్బం గడుపుకోవాలని చూస్తోందని వ్యాఖ్యానించారు. ప్రపంచ ఆకలి సూచీలో భారత్ 107వ స్థానంలో నిలవడాన్ని దుయ్యబట్టారు. 'భారత్‌లో ఆకలి పెరగడం కాదు.. ఇతర దేశాల ప్రజలకు ఆకలే ఉండదు' అని హిందీలో ట్వీట్ చేశారు. 121 దేశాల్లో భారత్ 107వ ర్యాంకు పొందగా స్కోరు 29.1గా ఉంది. పౌష్టికాహార లోపం దేశంలో తీవ్రంగా ఉంది. ఆసియా దేశాల్లో భారత్ దిగువన ఆఫ్ఘన్ ఒక్కటే ఉన్నది. పక్కదేశాలైన పాకిస్తాన్ (99), బంగ్లదేశ్ (84), నేపాల్ (81), శ్రీలంక (64) మెరుగైన స్థానాల్లో నిలిచాయి. 2021లో భారత్ ర్యాంకు 101 కాగా 2020లో 94స్థానంలో నిలిచింది.

డిజిటల్ బ్యాంకింగ్‌తో స్థిరమైన వృద్ధి: మోదీ



న్యూఢిల్లీ: ఫోన్ బ్యాంకింగ్ నుంచి డిజిటల్ బ్యాంకింగ్‌లోకి మారేందుకు బీజేపీ ప్రభుత్వం చేసిన యత్నాల కారణంగానే భారత్ స్థిరమైన ఆర్థిక వృద్ధిని సాధించిందని ప్రధాని మోదీ తెలిపారు. 75 డిజిటల్ బ్యాంకింగ్ యూనిట్లను (డీబీయూ)లను జాతికి అంకితం చేశారు. అనంతరం మోదీ మాట్లాడుతూ.. దేశ ఆర్థిక పురోగతి బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతంతో ముడిపడి ఉంటుందన్నారు. సుపరిపాలన, మెరుగైన సేవల పంపిణీకి బ్యాంకింగ్ రంగం మాధ్యమంగా మారిందన్నారు. అలాగే ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) లీకేజీలను అరికట్టడానికి, పారదర్శకతను తీసుకురావడానికి సహాయపడిందన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు డీబీటీ ద్వారా రూ.25 లక్షల కోట్లను బదిలీ చేసిందని, పీఎం కిసాన్ పథకం కింద మరో విడత సోమవారం బదిలీ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువచేస్తాయని, ఆర్థిక సహకారాన్ని అందిస్తాయన్నారు. యూపీఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫోన్‌బ్యాంకింగ్ కింద బ్యాంకులు ఎవరికి రుణాలు ఇవ్వాలి, వాటికి సంబంధించిన నిబంధనలు, షరతులు మాత్రమే వెల్లడించేవన్నారు. 2022-23 కేంద్రబడ్జెట్‌లో భాగంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. భారతస్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల సందర్భంగా దేశంలోని 75 జిల్లాల్లో 75 డీబీయూలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ డీబీయూలు ప్రజలకు సేవింగ్స్ ఖాతా తెరవడంతో పాటు బ్యాలెన్స్ చెక్, పాస్ బుక్ ప్రింటింగ్, క్రెడిట్-డెబిట్ కార్డుల కోసం దరఖాస్తులు, అకౌంట్ స్టేట్మెంట్, పన్నులు చెల్లించడం, బిల్లులు చెల్లించడం వంటి సేవలను అందించనున్నాయి. దీంతోపాటు డీబీయూలు ఏడాది పొడవున బ్యాంకింగ్ సేవలను అందిస్తాయి. తక్కువ ఖర్చుతో సేవలు పొందే సౌకర్యాన్ని కల్పించనున్నాయి. ఇవి డిజిటల్ ఫైనాన్షియల్ లిటరేసీని వ్యాప్తి చేయడంతో పాటు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించనున్నాయి.

హిందీలో వైద్యవిద్యతో సానుకూల మార్పు : మోదీ

దేశంలో సానుకూలంగా భారీ మార్పునకు హిందీలో వైద్యవిద్య దోహదమవుతుందని ప్రధాని మోదీ అన్నారు. మాతృభాషలో విద్యను లక్షలాది మంది విద్యార్థులు అభ్యసించగలుగుతారని, తద్వారా వారి కోసం నూతన అవకాశాల ద్వారాలు తెరుచుకుంటాయని చెప్పారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో హోంమంత్రి అమిత్‌షా ఆదివారం హిందీలో ఎంబీబీఎస్ కోర్సును ప్రారంభించిన క్రమంలో మోదీ స్పందించారు. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం హిందీలో అనువదించిన మూడు పాఠ్యపుస్తకాలను అమిత్‌షా ఆవిష్కరించారు. ఈ రోజు చరిత్రాత్మకమని ఆయన అన్నారు. హిందీలో ఎంబీబీఎస్ విద్యను అందించే దేశంలోని మొదటి రాష్ట్రంగా మధ్యప్రదేశ్ నిలిచింది.

నేడు కాంగ్రెస్ 'అధ్యక్ష' ఎన్నిక

(మొదటిపేజీ తరువాయి)

అత్యంత సన్నిహితమైన నాయకుడిగా, సీనియర్ నాయకుల మద్దతు కలిగిన మల్లికార్జున ఖర్గే పార్టీ ఇష్టమైన అభ్యర్థిగా పరిగణనలో ఉన్నారు. ప్రచార సమయంలో థరూర్ అనేక అంశాలను లేవనెత్తినప్పటికీ, అభ్యర్థులు ఇద్దరి పట్ల గాంధీలు తటస్థంగా ఉన్నారని, అధికారిక అభ్యర్థి ఎవరూ లేరని ప్రస్తుత నాయకత్వం స్పష్టం చేసింది. ఎన్నికల ప్రాముఖ్యత గురించి అడిగిన ప్రశ్నకు, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేశ్ మాట్లాడుతూ అటువంటి స్థానాల కోసం ఏకాభిప్రాయాన్ని రూపొందించే కాంగ్రెస్ నమూనాను తాను ఎప్పుడూ నమ్ముతానని పీటీఐకి చెప్పారు. నెహ్రూ అనంతర కాలంలో ఈ విధానానికి అత్యంత ప్రసిద్ధ అభ్యాసకుడు కె.కామరాజ్ అని ఆయన తెలిపారు. 'మేము ఎన్నికల రోజుకు చేరుకునే కొద్దీ ఈ నమ్మకం మరింత బలపడింది. దీనికి కారణాలు చాలా స్పష్టంగా ఉన్నాయి' అని జైరాం రమేశ్ అన్నారు. 'సంస్థాగత ఎన్నికలు వాస్తవానికి సంస్థను ఏ విధంగానూ బలపరుస్తాయని నాకు అస్సలు నమ్మకం లేదు. అవి వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగపడతాయి. కానీ సామూహిక స్ఫూర్తిని నిర్మించడంలో వాటి విలువ సందేహాస్పదంగా ఉంది' అని తెలిపారు. అయినప్పటికీ, ఎన్నికలు జరుగుతున్నాయనే వాస్తవం కొంత ముఖ్యమైనదని ఆయన అన్నారు. 'కానీ కాంగ్రెస్‌కు, భారత రాజకీయాలకు కూడా పరివర్తన కలిగించే చారిత్రాత్మక భారత్ జోడో యాత్ర కంటే తక్కువగా సంస్థాగత ప్రాముఖ్యతను నేను భావిస్తున్నాను' అని జైరాం రమేశ్ చెప్పారు. పార్టీ వివిధ ప్రధాన కార్యాలయాలలో పీసీసీ ప్రతినిధులతో ఇద్దరు అభ్యర్థులు తమ సమావేశాల సందర్భంగా పార్టీ కోసం కార్యాచరణ గురించి విస్తృతంగా ప్రచారం చేసినప్పటికీ, థరూర్ శిబిరం అనేక ఫిర్యాదులు, వాదనలు కూడా చేసింది. ప్రచారాలలో వైరుధ్యం చాలా స్పష్టంగా ఉంది. ఖర్గే ప్రచారంలో భాగంగా ఆయన సందర్శించిన రాష్ట్ర ప్రధాన కార్యాలయాలలో అనేక మంది సీనియర్ నాయకులు, పీసీసీ అధ్యక్షులు, అగ్ర నాయకులు ఆయనను స్వాగతించడం కనిపించింది. అయితే థరూర్‌కు యువ పీసీసీ ప్రతినిధులు ఎక్కువగా స్వాగతం పలికారు. థరూర్ తన ప్రచారంలో మార్పునకు అభ్యర్థి అని నొక్కి చెప్పారు. పార్టీలోని యువకులు, దిగువ స్థాయి ప్రజలు తనకు మద్దతు ఇస్తున్నారని, సీనియర్లు తన ప్రత్యర్థికి మద్దతు ఇస్తున్నారని కూడా ఆయన పేర్కొన్నారు. ఖర్గే, తన అనుభవాన్ని, దశాబ్దాలుగా సంస్థాగత హోదాల్లోకి వెళ్లడం, అందరినీ తన వెంట తీసుకెళ్లగల సామర్థ్యాన్ని ప్రదర్శించారు. పార్టీలో గాంధీలకు ప్రత్యేక స్థానం ఉందని ఇద్దరు నాయకులు ఉద్ఘాటించారు. ఖర్గే మాట్లాడుతూ వారి 'మార్గనిర్దేశం', సూచనలు తీసుకుంటానని చెప్పారు. గాంధీ కుటుంబంలోని డీఎన్ఏ పార్టీ రక్తంలో కలిసిపోయిందని, కాంగ్రెస్ అధ్యక్షులెవరూ వారికి దూరంగా ఉండి పని చేయలేరని థరూర్ స్పష్టం చేశారు. 2000వ సంవత్సరంలో సోనియా గాంధీ చేతిలో జితేంద్ర ప్రసాద ఘోర పరాజయం పాలైనప్పుడు పార్టీ అత్యున్నత పదవికి చివరి ఎన్నికల పోటీ జరిగింది. అలాగే సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా పార్టీ అధ్యక్ష పదవికి పోటీలో ఉండకూడదని నిర్ణయించుకోవడంతో గాంధీయేతర వ్యక్తి 24 ఏళ్ల తర్వాత నాయకత్వ బాధ్యతలు చేపట్టనున్నారు. కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలు రహస్య ఓటింగ్ ద్వారా జరుగుతాయని, ఎవరు ఎవరికి ఓటు వేశారో ఎవరికీ తెలియదని కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల మండలి చైర్మన్ మధుసూదన్ మిస్త్రీ అన్నారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, ఓట్లు ఎలా వేయాలో కూడా విలేకరులకు ప్రదర్శించారు. సీల్ చేసిన బాక్సులను ఢిల్లీకి తరలించి, ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచి ఢిల్లీలో తెరుస్తామని చెప్పారు.

ఇద్దరిదీ భిన్నమైన రాజకీయ ప్రయాణం

ఖర్గే, థరూర్ భిన్నమైన ప్రవర్తనను కలిగి ఉండటమే కాకుండా సమానమైన భిన్నమైన రాజకీయ ప్రయాణాన్ని కలిగి ఉన్నారు. ఒక వైపు, 80 ఏళ్ల ఖర్గే, అట్టడుగు నుంచి వచ్చిన రాజకీయ నాయకుడు, గాంధీ కుటుంబానికి కరడుగట్టిన విధేయుడు. మరోవైపు, 66 ఏళ్ల థరూర్... తన మనసులోని మాటను బయటపెట్టే సున్నితమైన నాయకుడు. ఐక్యరాజ్యసమితిలో సుదీర్ఘకాలం పని చేసిన తర్వాత 2009లో కాంగ్రెస్‌లో చేరారు. ఖర్గే బీదర్ జిల్లాలోని వరవట్టిలో ఒక పేద కుటుంబంలో జన్మించారు. ఆయన గుల్బర్గాలో పాఠశాల, న్యాయ విద్యను అభ్యసించారు. ఇక థరూర్ లండన్‌లో జన్మించారు. అలాగే ఒక అసాధారణ విద్యా నేపథ్యం ఉంది. కేరళలోని నాయర్ వర్గానికి చెందిన థరూర్... ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కళాశాల, మసాచుసెట్స్‌లోని ఫ్లెచర్ స్కూల్ ఆఫ్ లా అండ్ డిప్లొమసీతో సహా భారతదేశంలోని ప్రధాన విద్యాసంస్థల్లో చదువుకున్నారు. 1978లో ఫ్లెచర్ స్కూల్ ఆఫ్ లా అండ్ డిప్లొమసీ నుంచి ఆయన పీహెచ్‌డీ పూర్తి చేశారు. వరుసగా తొమ్మిది సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయిన ఖర్గే, రాజకీయాల్లో 50 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న నాయకుడు. ఆయన సొంత జిల్లా గుల్బర్గా, ఇప్పుడు కల్బుర్గిలో నాయకుడు.

విశాఖలో మళ్లీ ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

324 ,325, 427, 188 కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరిలో కొంతమందిని అరెస్ట్ చేశారు. మరోపక్క జనవాణి కార్యక్రమాన్ని రద్దు చేయాలని, సెక్షన్ 30 అమలులో ఉందని పవన్ కళ్యాణ్ కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. దీంతో ఆదివారమంతా నగరంలో మళ్లీ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శనివారం సాయంత్రం పవన్ కళ్యాణ్ కి స్వాగతం పలికేందుకు పెద్ద ఎత్తున జనసేన కార్యకర్తలు తరలిరావడం, అదే సమయానికి విశాఖ గర్జనలో పాల్గొన్న మంత్రులు తిరుగు ప్రయాణానికి ఎయిర్ పోర్టుకు చేరుకోగా, కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు మంత్రుల బృందంపై దాడికి యత్నించారు. ఈ ఘటనలో మంత్రి రోజా డ్రైవర్ గాయపడినట్టు తెలిసింది. కాగా పవన్ కల్యాణ్ శనివారం రాత్రి బస చేసేందుకు నోవోటెల్ హోటల్‌లో దిగారు. అక్కడికి భారీగా క జన సేన కార్యకర్తలు చేరుకోవడంతో పాటు పోలీసులు కూడా భారీగా మోహరించారు. ఈ నేపథ్యంలో రాత్రి హెూటల్ వద్ద జనసేన నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని జనసేన నాయకులు తెలిపారు. కాగా ఆదివారం ఉదయం జనవాణి వేదిక ద్వారం వద్ద పవన్ గో బాక్ అంటూ కొందరు వ్యక్తుల నిరసన తెలిపారు. వేదిక వద్దకు, పవన్ కల్యాణ్ బస చేసిన హెూటల్ లోనికి జనసేన నాయకులు, కార్యకర్తలను వెళ్లనీయకుండా పోలీసులు భారీగా మోహరించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పెద్ద ఎత్తున జనసేన నాయకులను, కార్యకర్తలను పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ నేపథ్యంలో పోలీసుల తీరును నిరసిస్తూ పవన్ కల్యాణ్ హోటల్ లోనే ఉండిపోయారు.

మావారిని విడుదల చేయాలి: పవన్

జనవాణి కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్టు పవన్ కల్యాణ్ తెలిపారు. నోవోటెల్ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా పని చేస్తే ప్రజలు తమ జనవాణి కి ఎందుకు వస్తారని ప్రశ్నించారు. ఉత్తరాంధ్ర పర్యటనను మూడునెలల ముందే ఖరారుచేశామని, తమ పార్టీ కార్యక్రమాలు ఎలా చేసుకోవాలో వైసీపీ చెబుతుందా అని ప్రశ్నించారు. వైసీపీ మూడు రాజధానుల గర్జన కార్యక్రమానికి ముందే తమ ప్రోగ్రాం ఖరారు చేశామని, ప్రభుత్వంతో పోటీ తమకెందుకని, ఎన్నికల సమయంలోనే పోటీ ఉంటుందన్నారు. కడుపు కాలినోడు, అన్యాయం జరిగినోళ్లు గర్జిస్తారు కానీ, అధికారంలో ఉన్న మీరు గర్జించడం ఏంటని వైసీపీ నాయకులను ప్రశ్నించారు. జనవాణి కార్యక్రమాన్ని తమ నాయకులు లేకుండా నిర్వహించబోమని, వాళ్లు బయటకు వచ్చే వరకు వేచి ఉంటామని, ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిన నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యే లు చేతిలో ఉంచుకొని ప్రజాసమస్య లు పక్కన బెట్టి ఎంతసేపూ బూతులు మాట్లాడుతూ వైసీపీ నేతలు కాలయాపన చేయడం వల్లనే జన వాణి పెట్టాల్సి వచ్చిందన్నారు. మా నాన్న పోలీస్ కానిస్టేబుల్ అని అందుకే వారంటే నాకు అభిమానమని పవన్ చెప్పారు. పోలీసులు పైనున్న రాజకీయనాయకుల ఆర్డర్స్ ఫాలో అవుతారని, మీరు సవ్యంగా పనిచేసే వారైతే, వైయస్ వివేకానంద రెడ్డిని హత్య కేసును ఎందుకు ఛేదించ లేకపోయారని ప్రశ్నించారు. ఏపీ పోలీసుల మీద నమ్మకం లేదన్న జగన్ కింద మీరు పని చేస్తున్నారని గుర్తుంచుకోవాలని పోలీసులకు హితవు పలికారు. గంజాయి స్మగ్లర్లును, వారిని వెంటేసు కొచ్చే రాజకీయ నేతలను వదిలేసి, ప్రజాస్వామ్యయుతం గా జనవాణి జరిపే మమ్మల్ని వేధిస్తున్నారా అంటూ ప్రశ్నించారు. ఈ పర్యటన లో తమకు అసలు అమరావతి లేదా మూడు రాజధానుల మీద ఎజెండానే లేదన్నారు. అసలు 2014 లోనే విశాఖ రాజధాని అంటే సరిపోయేదని, అధికార వికేంద్రీకరణ కోరుకుంటే... ముందు ప్రభుత్వం లోని 26 మంత్రులు, 5 గురు ఉప ముఖ్యమంత్రులు ఉన్నారు కదా వీరికి అధికారం ఎందుకు పంచకుండా మొత్తం అధికారం అంతా ఒకరి దగ్గరే ఎందుకు పెట్టుకున్నారని పవన్ ప్రశ్నించారు. అరెస్ట్ చేసిన మా నాయకులను భేషరతుగా విడుదల చేసే వరకూ జనవాణి నిలుపుదల చేస్తున్నామని, ఒకవేళ వదలక పోతే మా కార్యాచరణ ఏంటో తెలియ జేస్తామని పవన్ చెప్పారు. తమ శ్రేణులపై ఏకంగా 307 సెక్షన్ పెట్టారని హత్యాయత్నం చేసిన వాళ్లపై పెట్టాల్సిన కేసులు ఇవన్నారు. భవిష్యత్తు లో అన్నీ తెలియజేస్తామని అన్నీ సిద్ధపడే రాజకీయ రంగం లోకి దిగామన్నారు. ప్రజాస్వామ్యం కోసం చనిపోవడానికి సిద్ధమని, కోడి కత్తి కేసు లానే నిన్నటి విశాఖ ఘటన చూస్తున్నా మన్నారు. వారిని వారే పొడిపించుకున్నట్టు నిన్నటి దాడి జరిగి ఉండొచ్చునన్నారు. ఉత్తరాంధ్ర లో శాంతి ఉండకూడదనేదే వైసీపీ వ్యూహమని, తాను వచ్చే సమయానికి మంత్రులు ఎయిర్ పోర్ట్ కు రావడం వెనుక స్కెచ్ ఉందని భావిస్తున్నామని, ప్రజా ఉద్యమాలను వైసీపీ తట్టుకోలేదన్నారు.

సెక్షన్ 30 అమలులో ఉంది...

విశాఖ నగరంలో ర్యాలీలు, సభలకు అనుమతి లేదని ఈస్ట్ ఏసీపీ హర్షిత చంద్ర తెలిపారు. నగరంలో శాంతి భద్రతల దృష్ట్యా సెక్షన్ 30ని అమలు చేస్తున్నామని, అందుకే పవన్ కల్యాణ్ కి నోటీస్ ఇచ్చి నగరంలో ర్యాలీలు, సభలు పెట్టవద్దని తెలియజేశామని చెప్పారు. ఆదివారం మధ్యాహ్నం పవన్ కల్యాణ్ మీడియా సమావేశం సమయంలో ఏసీపీ అక్కడకు చేరుకుని సెక్షన్ 30 నోటీసులు అందజేశారు.

మూడు రాజధానులు వద్దన్న వారికి

విశాఖ గర్జనే సమాధానం: బొత్స

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ ప్రజలు మూడు రాజధానులు కోరుకోవడం లేదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్న వాళ్లకు విజయవంతమైన విశాఖ గర్జనే సమాధానమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విశాఖ గర్జన విజయవంతం కావడంతో జేఏసీ నాయకులు, మరో మంత్రి గుడివాడ అమర్నాథ్‌తో కలిసి ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బొత్స మాట్లాడుతూ, మూడు రాజధానులు తప్పుబడుతున్న వారికి ఈ గర్జన కనువిప్పు కలిగిస్తుందన్నారు. ఇప్పటికైనా మనసు మార్చుకోవాలని విశాఖ ప్రజలు చేస్తున్న వార్నింగ్ ఇది అని అన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీలు క్షుద్ర రాజకీయాలు చేస్తూ, విశాఖ ప్రజల ఆకాంక్షలను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. వారికి చెందిన ఎల్లో మీడియా తప్పుడు రాతలు రాస్తూ ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను దెబ్బ తీస్తున్నాయని చెప్పారు. అవసరమైతే బ్యాలట్ నిర్వహించాలని ఎల్లో మీడియాకు బొత్స సూచించారు. పవన్ కళ్యాణ్‌కు రాజకీయ నాయకుడి లక్షణాలు లేవని, సిద్ధాంతాలు లేవని అసలు అది రాజకీయ పార్టీ కాదని, అది ఒక సెలబ్రిటీకి చెందిన సంస్థ అని దుయ్య బట్టారు. విశాఖ ఒక ఆదాయ వనరు అని, భవిష్యత్తులో ప్రభుత్వాలకు స్థిరమైన బడ్జెట్ అందించే ప్రాంతమని, కొద్దిపాటి వ్యయంతో విశాఖను సుందర రాజధానిగా తీర్చిదిద్దుకోవచ్చునని మంత్రి బొత్స అన్నారు.

త్వరలోనే కార్యాచరణ: అమర్నాథ్

మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ, విశాఖ గర్జన పెద్ద విజయంగా భావిస్తున్నామని అన్నారు. మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, ఉపాధ్యాయులు, సాధారణ పౌరులు రోడ్డెక్కి తమ ఆకాంక్షలను తెలియజేశారని అన్నారు.

విశాఖను రాజధానిగా చేసుకునేందుకు త్వరలోనే కార్యాచరణను ప్రకటిస్తామని ఆయన చెప్పారు. జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ లజపతిరాయ్ మాట్లాడుతూ, మూడు రాజధానుల ఉద్యమం అంతంకాదిది, ఆరంభం అని అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాంత అభివృద్ధిని తాము అడ్డుకోవడం, లేదని ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని అర్థం చేసుకుని తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ధర్మ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో అలజడికి పవన్ యత్నం: అంబటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇది జనసేన కాదు... బాబు సేన అని, హింసను ప్రేరేపించే ఏ పార్టీ కూడా బాగుపడలేదని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖలో అలజడి సృష్టించేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలకు పాల్పడినా విశాఖకు రాజధాని వచ్చి తీరుతుందని పునరుద్ఘాటించారు. చంద్రబాబు వద్ద ప్యాకేజీలు తీసుకుని పవన్ కుట్రకు పాల్పడుతున్నారన్నారు. చంద్రబాబుకు పవన్ మూడు రోజుల కాల్‌షీటు ఇచ్చారని ఎద్దేవా చేశారు. దానిలో భాగంగానే చంద్రబాబు వాణిని వినిపించేందుకు విశాఖ వచ్చి అలజడి సృష్టించారన్నారు. ఎయిర్‌పోర్టు వద్ద మంత్రులపై దాడులు చేయించారని మండిపడ్డారు. మంత్రులపై దాడులు చేస్తే అరెస్టులు చేయకుండా సన్మానిస్తారా? అని ప్రశ్నించారు. హింసను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు. చంద్రబాబుకు ప్రజల్లోకి వెళ్లే ధైర్యం లేదని, చంద్రాబుకు బానిసగా పవన్ మారిపోయారని విమర్శించారు. అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతోనే సీఎం జగన్ మూడు రాజధానుల ప్రతిపాదనలు తీసుకొచ్చారన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్యం అందించండి

ఆత్మీయ సమావేశంలో ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గిరిజనులకు సామాజిక చైతన్యం కల్పించి, వారికి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు కోరారు. తన చాంబర్‌లో ఆదివారం వివిధ విభాగాల్లో పనిచేస్తున్న గిరిజన ప్రభుత్వ వైద్యులతో ఆయన ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో సమస్యల పరిష్కారానికి కమిషన్ నిరంతరం సహాయపడుతుందని, వైద్యులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడైనా కమిషన్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. గిరిజన సమాజాన్ని మేల్కొల్పాల్సిన అవసరం, ఆర్థిక, రాజకీయ, సామాజిక అసమానతలు తొలగిపోయేలా చూడాల్సిన బాధ్యత విద్యావంతులైన గిరిజనులందరిపై ఉందన్నారు. వైద్యారోగ్యశాఖ ముఖ్య

ఉన్న 40 వేల మంది గిరిజన ఉద్యోగులు 32 లక్షల మంది గిరిజనుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు.

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయినా, ప్రభుత్వ యంత్రాంగంలో సమన్వయం లేకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో గిరిజనాభివృద్ధి జరగలేదన్నారు. శాఖాపరమైన కార్యదర్శి రవిచంద్ర మాట్లాడుతూ, వైద్యులు వెలిబుచ్చిన సమస్యలు, పదోన్నతులపై వివరణ ఇచ్చారు. ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్, కొర్రా రామలక్ష్మీ, ఎస్టీ కమిషన్ సెక్రటరీ సతీష్, డాక్టర్ బాలునాయక్ వివిధ జిల్లాల నుంచి వచ్చిన గిరిజన వైద్యులు పాల్గొన్నారు.

బీజేపీ ఆటలు సాగవు: మంత్రి హరీష్‌రావు

విశాలాంధ్ర-హైదరాబాద్: పోరాటాల గడ్డ నల్గొండలో బీజేపీ ఆటలు సాగవని, మునుగోడులో బీజేపీ అబద్ధాలతో గెలవాలనుకుంటే అది మూర్ఖత్వమే అవుతుందని తెలంగాణ వైద్యఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రధాని రైతులకు ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు నెరవేరలేదని చివరకు ప్రధాని క్షమాపణ చెప్పి ఏడాది గడుస్తున్నా రైతులకు చేసిందేమీ లేదన్నారు. ప్రధాని హామీలు అమలు కావడం లేదనే విషయాన్ని గుర్తించిన బీజేపీ నేతలు... మునుగోడులో అసత్యాలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. దుబ్బాక, హుజురాబాద్, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన హామీలకు అంతులేదని, వాటిలో ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. మేము రూ.2016ల పెన్షన్ అన్నామని ఇచ్చిన మాట ప్రకారం ఇచ్చామని, దమ్ముంటే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 3 వేల పెన్షన్ ఇచ్చి ఇక్కడ మాట్లాడాలని సవాల్ విసిరారు. పీఎం మోదీ సొంత రాష్ట్రంలో పెన్షన్ రూ.750లు ఇవ్వడం లేదు ఇక్కడ 3 వేలు ఇస్తామంటే ఎలా నమ్ముతారన్నారు. ఇపుడు రాజగోపాల్ రెడ్డి 3 వేల పెన్షన్ అని మళ్లీ మోసం చేస్తున్నాడని ఆరోపించారు. వీళ్లు చెప్పే మాటలు ప్రధాని మోదీతో చెప్పించాలని, రాజగోపాల్ రెడ్డికి బీజేపీలో చేరగానే అబద్ధాలు బాగా వంటబట్టాయన్నారు. కోమటి రెడ్డి బ్రదర్స్‌కు ప్రభుత్వ పరంగా అవకాశాలు వచ్చినా ప్రజలకు ఏమీ చేయలేక పోయారని మండిపడ్డారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రుల ప్రచారం గురించి మాట్లాడుతున్న బీజేపీ నేతలు... మునుగోడుకు అమిత్ షాను ఎందుకు తెచ్చారో ముందు చెప్పాలన్నారు. ఈ సమావేశంలో మంత్రి టి.హరీష్ రావు, మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి, పియూసీ చైర్మన్ ఏ జీవన్ రెడ్డి, ఎంపీ ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి 'సిత్రాంగ్' ముప్పు

పెనుతుపానుగా మారే అవకాశం

ఒడిశా, బెంగాల్, తెలంగాణపైనా ప్రభావం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఉత్తర అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం మంగళవారం ఏర్పడనుందని, ఇది క్రమేపి బలపడి 20వ తేదీకి అల్పపీడనంగా మారుతుందని విశాఖపట్నం వాతావరణ కేంద్రం తెలిపింది. అనంతరం తీవ్ర వాయుగుండంగా మారి ఆంధ్రప్రదేశ్ దిశగా పయనించనున్నదని అధికారులు అంచనా వేశారు. దీనికి 'సిత్రాంగ్'గా నామకరణం చేస్తామని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది పెను తుపానుగా మారితే ఏపీతో పాటు ఒడిశా, పశ్చిమ బెంగాల్, తెలంగాణ రాష్ట్రాలపై ప్రభావం ఉంటుందని అధికారులు తెలిపారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, వరదలు సంభవించవచ్చునని వాతా వరణ శాఖ హెచ్చరించింది. తుపాను ప్రభావిత రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ సూచించింది. రెండు వారాలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రమంతటా అతలాకుతలమైంది. వరద ముంపు నుంచి అనంతపురం తేరుకోలేదు. ఇప్పుడు పెనుతుపాను సంభవించే సూచనలతో ప్రజలు భయపడుతున్నారు. మొన్నటి వరకు పోలవరం నిర్వాసిత ముంపు గ్రామాల్లో వరదలు ఇబ్బంది పెట్టాయి. ప్రస్తుతం రిజర్వాయర్లన్నీ నిండికుండలను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా పంటలు నీట మునిగాయి. రహదారులకు గుంటలు పడి రవాణా స్తంభించిపోయింది.ఇదిలావుంటే, తుపానుకు 'సిత్రాంగ్' అనే పేరును థాయిలాండ్ సూచించింది. వారి భాషలో సిత్రాంగ్ అంటే 'వదలనిది' అని అర్థం.

గ్రంథాలయంతో బ్రౌన్ కీర్తి అజరామరం: జస్టిస్ బండారు

విశాలాంధ్ర-కడప: తెలుగుభాషా సాహిత్యాలకు ఎనలేని కృషిచేసిన సీపీ బ్రౌన్ స్మారకంగా గ్రంథాలయ నిర్మాణం చేసి బ్రౌన్ కీర్తిని అజరామరం చేసిన మహోన్నతవ్యక్తి డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బండారు శ్యాంసుందర్ అన్నారు. ఆదివారం జానమద్ది సాహితీ పీఠం అధ్వర్యంలో డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి 98వ జయంతి, దశమ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో నిర్వహించారు. ముందుగా అతిథులు డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం 2022కు గాను ప్రసిద్ధ సాహితీవేత్త డా॥ జీవీ పూర్ణచందు, అక్షర పల్లకి సాహితీ సంస్థ నిర్వాహకులు ఎం.శ్రీనివాస ఆచార్యలకు జానమద్ది పురస్కారాలను బహూకరించారు. పీఠం కార్యదర్శి జానమద్ది యామిని నివేదికను సమర్పించారు. ముఖ్య అతిథిగా వచ్చిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బండారు శ్యాంసుందర్ మాట్లాడుతూ జానమద్ది రచయితగా సాహితీసేవ చేస్తూనే మరోవైపు బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధికి తుదిశ్వాస వరకు అవిరళంగా కృషి చేశారన్నారు. గ్రంథాలయ కీర్తిని దశదిశలా వ్యాపింపజేశారన్నారు. హనుమచ్ఛాస్త్రి చేసిన సేవలను స్మరించుకుంటూ వారి కుటుంబ సభ్యులు ఏటా సాహిత్య, గ్రంథాలయ సేవకులను జానమద్ది స్మారక పురస్కారంతో గౌరవించడం అభినందనీయమన్నారు. పురస్కార గ్రహీతలను అభినందించారు. సభాధ్యక్షుడు, యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి డా॥ ఎన్.ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ సీపీ బ్రౌన్ అనామకంగా ఉన్న ప్రజాకవి వేమనను వెలుగులోకి తెచ్చి విశ్వకవిని చేశాడని, అలాంటి బ్రౌన్ మహాశయుని బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణంతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా

చేసిన ఘనత జానమద్ది హనుమచ్ఛాస్త్రికి దక్కుతుందన్నారు. బ్రౌన్ గ్రంథాలయం ఉన్నంతకాలం హనుమచ్ఛాస్త్రి జీవించే ఉంటారని పేర్కొన్నారు. గౌరవ అతిథి, యోగి వేమన విశ్వవిద్యాలయం కులసచివులు ఆచార్య దుర్భాక విజయ రాఘవ ప్రసాద్ మాట్లాడుతూ బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణానికి జానమద్ది ఎంతో కృషి చేశారని, ఆయన సేవలను విశ్వవిద్యాలయం నిరంతరం స్మరించుకుంటూనే ఉంటుందని అన్నారు. ప్రత్యేక అతిథి, నగర మునిసిపల్ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యాలకు బ్రౌన్ గ్రంథాలయం నిలయంగా ఉండి, ఎంతోమంది పరిశోధకులకు, సాహితీప్రియులకు, సాహితీవేత్తలకు సేవలందిస్తూ ఉందంటే అది జానమద్ది కృషి ఫలితమేనని అన్నారు. పురస్కార గ్రహీత డా॥ జీవీ పూర్ణచందు మాట్లాడుతూ జానమద్ది హనుమచ్ఛాస్త్రి గొప్ప సాహితీవేత్త అని, గ్రంథాలయ నిర్మాతగా చరిత్రలో సుస్థిరస్థానం సంపాదించుకున్నారని, అలాంటి మహనీయుని పురస్కారాన్ని అందుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. మరో పురస్కార గ్రహీత ఎం.శ్రీనివాస ఆచార్య మాట్లాడుతూ జానమద్దితో తన పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకొని పురస్కారాన్ని స్వీకరించడం హర్షణీయమన్నారు. జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయ భాస్కర్ సభా సమన్వయం చేశారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బాధ్యులు డా॥ మూల మల్లికార్జున రెడ్డి, జానమద్ది కుటుంబ సభ్యులు, సుబ్బారెడ్డి, జింకా సుబ్రమణ్యం, గానుగపెంట హనుమంతరావు, కొత్తపల్లె రామాంజనేయులు, యలమర్తి మధుసూదన, కొండూరు జనార్ధన రాజు, డా॥ వెల్లాల వేంకటేశ్వరాచారి, మొగలిచెండు సురేశ్, పుత్తా పుల్లారెడ్డి, డా॥ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతులకే పట్టం కడదాం

ఎస్టీయూ, యూటీఎఫ్ నేతల పిలుపు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై అవగాహన కలిగిఉండి, వాటి పరిష్కా రానికి అను నిత్యం పాటుపడుతున్న ఉద్యమనేతలు కత్తి నరసింహా రెడ్డి, పోతుల నాగరాజును పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీలుగా గెలిపించుకోవాలని ఎస్టీయూ, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు మల్లు రఘునాథరెడ్డి, బి.లక్ష్మీరాజ పిలుపునిచ్చారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఫ్యాప్టో చైర్మన్‌గా, జేఏసీ కో-చైర్మన్ గా పనిచేసిన విశేష అనుభవంతో పాటు, విద్యారంగంలోనే తన జీవితాన్ని గడుపుతున్న కత్తి నరసింహారెడ్డి వంటి నేతను మరో మారు ఆదరించాలన్నారు. ఉపాధ్యాయ ఉద్యమాలలో పాల్గొం టున్న పోతుల నాగరాజును గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిపించా లన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు మాట్లాడుతూ, సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసే ఉద్యమ సంఘాల నుంచి వచ్చిన తమను ఆదరించాలని కోరారు.

సమావేశంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు సుబ్రమణ్యంరాజు, విజయకుమార్, రమణా రెడ్డి, హరిప్రసాద్, జీసీటీఏ రాయలసీమ జోన్ అధ్యక్షుడు వెంకట క్రిష్టారెడ్డి, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు నాగసుబ్బారెడ్డి, చంద్ర శేఖర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు రాజేంద్రప్రసాద్, ఎలక్ట్రిసిటీ, ఎల్ఐసీ, మెడికల్ ఎంప్లాయిస్, యువజన, బీసీ , ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

భూకుంభకోణంపై సిట్ నివేదికలు బయటపెట్టాలి: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ భూముల కుంభకోణంపై సిట్ నివేదికలను బయటపెట్టాలని, భూకుంభకోణంలో మంత్రి ధర్మాన ప్రసాదరావుతో సహా కొంత మంది రాజకీయ నాయకులపై వస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం వాస్తవాలు వెల్లడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు విశాఖ భూముల కుంభకోణంపై సిట్ వేసిందని, వైసీపీ అధికారంలోకి వచ్చాక మరో సిట్ వేసిందని గుర్తుచేశారు. ఇంత వరకు ఆ రెండు సిట్‌ల నివేదికలు బయట పెట్టలేదన్నారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల భూమి అన్యాక్రాంత మైందని, ఈ భూముల కుంభకోణంలో అధికార, ప్రతిపక్ష పార్టీ పెద్దలందరూ భాగస్వాములేననీ, అందుకే నివేదికలు బయటకు రానివ్వకుండా సహకరించుకుంటున్నారని విమర్శించారు. డి-ఫామ్ పట్టా భూములకు ఎంత రక్షణ ఉందో ఎక్స్ సర్వీసు మెన్స్‌కు కేటాయించే భూములకు అన్ని నిబంధనలూ ఉన్నాయని, అయినప్పటికీ మంత్రి సిఫార్సుతో ఎన్‌ఓసీలు ఇచ్చి భూముల అమ్మకాలు, కొనుగోళ్లు జరిగాయని, దీనిపై మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆరోపణలు ఎదుర్కొంటున్నారన్నారు. చాలా చోట్ల మంత్రులు, ఎమ్మెల్యేలు బినామీలతో భూములు అక్రమంగా స్వాధీనం చేసుకుంటు న్నారని, వారికి అధికారులు వెన్నుదన్నుగా నిలుస్తున్నారనీ, ఈ భూములన్నింటినీ తిరిగి పేదలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వమే అసైన్డ్ భూముల నిబంధనలకు తూట్లు పొడుస్తూ చట్టాలు చేస్తోందని విమర్శించారు.

సంక్షేమ పథకాలు పునరుద్ధరించండి

ఏపీ జేఏసీ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ప్రభుత్వ పథకాలు పునరుద్ధరించాలని అమరావతి జేఏసీ నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, వైవీ రావు డిమాండ్ చేశారు. విజయవాడలో ఆదివారం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. సుమారు 50వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కోస్ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. సీఈఎంఎస్ ద్వారా జీతాలు తీసుకుంటున్నందున కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు సంక్షేమ పథకాలు రద్దు చేశారని, వెంటనే వాటిని పునరుద్ధరించాలని అన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నిత్యావసర వస్తువుల ధరల కనుగుణంగా కనీస వేతనం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, అందరికీ టైమ్ స్కేల్ వర్తింపజేయాలని కోరారు. ఏపీ జేఏసీ గుంటూరు జిల్లా చైర్మన్ కె.సంగీతరావు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ చైర్మన్ కె.సుమన్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.శివకుమారి, వైస్ చైర్మన్ ఎ.సురేష్, దివాకర్ పాల్గొన్నారు.

నేడు సీఎం నంద్యాల జిల్లా పర్యటన

వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ నగదు ఖాతాల్లో జమ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ రెండో విడత ప్రారంభంలో భాగంగా సీఎం జగన్ సోమవారం నంద్యాల జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9.00 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి బయల్దేరి 10.15 గంటలకు ఆళ్లగడ్డ చేరుకుంటారు. 10.45 నుంచి 12.10 గంటలకు వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు, అనంతరం వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ నగదు బదిలీని బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమచేస్తారు. మధ్యాహ్నం 12.35కు అక్కడి నుంచి బయలుదేరి 2.15 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

2024 వరకూ సోము వీర్రాజే

బీజేపీ జాతీయ నేత ప్రకాష్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే పార్లమెంట్ ఎన్నికల వరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సోము వీర్రాజు కొనసాగుతారని ఆ పార్టీ జాతీయ నేత ప్రకాష్ స్పష్టం చేశారు. ముఖ్య నేతల సమావేశం ఆదివారం విజయవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నవంబర్ నుంచి జిల్లాల వారీగా నాయకులకు శిక్షణ ఇస్తామన్నారు. డిసెంబర్‌లో పదిహేను రోజుల పాటు అన్ని జిల్లాల్లో పాదయాత్రలు చేసే అవకాశముందని, వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యక్రమాలు రూపొందించనున్నట్లు చెప్పారు. రాష్ట్రానికి మోదీ చేసిన సాయం, జగన్ చేసిన మోసం అంశాల వారీగా ప్రజలకు వివరించాలని పిలుపు నిచ్చారు. 2024 ఎన్నికల్లో బీజేపీ, జనసేన కలిసి విజయం సాధించే దిశగా పని చేయాలని సూచించారు.

అగ్రశ్రేణి అభ్యుదయ రచయిత అనిసెట్టి

సాహితి

డా॥ పి.వి.సుబ్బారావు
సెల్: 9849177594

అనిసెట్టి అభ్యుదయ కవిగా, అభ్యుదయ కవితా ఉద్యమ సారథిగా ప్రసిద్ధులు. శ్రీశ్రీ చెప్పినట్లు "అనిసెట్టి, ఆరుద్రలు అభ్యుదయ కవితా ఉద్యమానికి అఆ లు. అభ్యుదయ కవుల ఆశయం సమ సమాజ స్థాపన, శిష్లా, శ్రీశ్రీల ప్రభావంతో అనిసెట్టి, ఆయన మిత్రులు కుందుర్తి, రెంటాల, ఏల్చూరి, బెల్లంకొండ రామదాసు వంటి వారి కవితా దృక్పథం అభ్యుదయం వైపుకు మళ్లింది. అనిసెట్టి బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన అగ్నివీణ అభ్యుదయ కవితా ఉద్యమంలో ప్రసిద్ధమైన కావ్యం. శాస్త్రీయ మానవతా వాద దృక్పథంతో 'బిచ్చగాళ్ల పదాలు' రాశాడు. ప్రయోగాత్మక నాటక రచయితగా గాలి మేడలు, మావూరు నాటకాలు రచించాడు. తెలుగులో తొలి మూకాభినయం ఆయన, 'శాంతి'. తొలి నృత్య మూకాభినయం ఆయన 'రిక్షావాలా', 'చరమాంకం', చెప్పుక్రింద పూలు, బ్రతుకు భయం వంటి ప్రసిద్ధ నాటికలు రాశారు. అట్టడుగు ప్రజల జీవిత చిత్రీకరణ లక్ష్యంతో 'అనిసెట్టి కథలు' వచ్చాయి.

అణు సంగీతం(1945), నవభారతి(1948), పృథ్వీగీతం(1946), జ్వాలానృత్యం(1948) వంటి నిర్దిష్ట సంఘటనాత్మక కవితలు రాశారు. 'కాంతులు, కత్తులు' పేరిట వివిధ పత్రికల్లో ఆయన రాసిన వ్యాసాలు విమర్శకుల మెప్పు పొందాయి. సినీ రచయితగా ప్రసిద్ధమైన సినీ గీతాలు రాసి సినీ ప్రేక్షకుల మెప్పు పొందారు. ఆయన రేడియో నాటికలు వస్తు వైవిధ్యంతో శ్రోతల మన్ననలు అందుకున్నాయి. ఆయన రచనలు అందుబాటులో లేనందున అజ్ఞాత కవిగా మిగిలిపోయాడు. అనిసెట్టి 1943 లో తెనాలిలో తాపీ ధర్మారావుగారి అధ్యక్షతన జరిగిన అభ్యుదయ రచయితల సంఘం ప్రథమ మహాసభల నుండి 1947 లో పి.వి.రాజమన్నార్‌గారి అధ్యక్షతన మద్రాసులో జరిగిన చతుర్థ మహాసభల వరకు అ.ర.సం కార్యవర్గ సభ్యుడిగా క్రియాశీలంగా వ్యవహరించి అ.ర.సం ప్రగతికి కృషి చేశాడు. 1955 లో కె.వి.రమణారెడ్డి నిర్వహణలో విజయవాడలో జరిగిన అ.ర.సం పునరుద్ధరణ మహాసభలకు 'అనిసెట్టి, తుమ్మల పూర్తిగా సహకరించారని' కె.వి.రమణారెడ్డి పేర్కొన్నారు.

అనిసెట్టి సుబ్బారావు అక్టోబరు 23వ తేదీన 1922లో నరసరావుపేటలో సంపన్న కుటుంబంలో జన్మించాడు. ఆయన తల్లిదండ్రులు ఆదిలక్ష్మమ్మ, కోట్లింగం. ఆయన పాఠశాల విద్యాభ్యాసం నరసరావుపేట మున్సిపల్ పాఠశాలలో సాగింది. కుందుర్తి, బెల్లంకొండ రామదాసు, మాచిరాజు దేవీప్రసాదుగార్లు ఆయన సహాధ్యాయులు. ఏల్చూరి సుబ్రహ్మణ్యం, స్వామీ కేశవతీర్థలు ఆయన సీనియర్ విద్యార్థులు. ఆ పాఠశాలలో ప్రముఖ భావకవి నాయని సుబ్బారావు ,చరిత్ర ఉపాధ్యాయుడిగా ఉండేవాడు. ఆయన పరిచయంతో తొలి రోజుల్లో అనిసెట్టి భావ కవిత్వం రాశాడు. అవి అచ్చయిన దాఖలాలు లేవు. ఆయన 1941 లో గుంటూరు ఏ.సి.కళాశాల నుండి ఆంగ్ల సాహిత్యం ప్రధానాంశంగా పట్టభద్రుడయ్యాడు. 1942 ఆగస్టు 8 వ తేదీన గుంటూరులో క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొని అరెస్టయి జైలు కెళ్లాడు. 1943 లో మద్రాసు లా కళాశాలలో చేరాడు. బెంగాలీ విప్లవకారుడు రతన్‌కుమార్ ఛటర్జీకి ఆశ్రయమిచ్చి, బెంగాలీ కరపత్రాలను అనువాదం చేశాడు. ఈ విషయం శ్రీరంగం నారాయణబాబు అవకతవక వల్ల బయటపడినందునే అనిసెట్టిని పోలీసులు అరెస్ట్ చేసి రెండేళ్లు జైలు శిక్ష విధించి రాయవెల్లూరు జైల్లో బంధించారు, అందువల్ల అప్పటికే నిశ్చయమైన అనిసెట్టి పెళ్లి రెండేళ్లపాటు వాయిదా పడింది.

అనిసెట్టి మామగారు అప్పట్లో రాజమండ్రిలో కోర్టు మేజిస్ట్రేటుగా ఉండేవారు. ఆయన తండ్రి, మామ ఇద్దరూ తమ పలుకుబడిని ఉపయోగించి

అనిసెట్టికి జైలు శిక్షాకాలం పూర్తికాక ముందే విడిపించే ప్రయత్నం చేశారు. అయితే అధికారులు అనిసెట్టి కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలతో తెగతెంపులు చేసుకోవాలన్న ఆంక్షలతో ప్రలోభపెట్టారు. సిద్ధాంతాలకు అంకితమైన వ్యక్తిగా అందుకు ససేమిరా అంగీకరించలేదు. అనిసెట్టి జైలు నుండి విడుదలైన తర్వాత 1945 జూన్ 6 వ తేదీన ఆయన వివాహం గతంలో నిశ్చయమైన లక్ష్మీదేవితోనే జరిగింది. ఆయన వివాహ సందర్భంగా నయాగరా కవులైన కుందుర్తి, ఏల్చూరి, బెల్లంకొండ రామదాసు 1941 నుండి 1944 వరకు రాసిన వచన కవితల సంకలనం 'నయాగరా' పేరిట అచ్చువేసి అనిసెట్టి దంపతులకు అంకితమిచ్చారు. అనిసెట్టి 1941 నుండి 1947 వరకు వివిధ పత్రికల్లో ప్రచురించిన కవితా ఖండికల్లో కొన్నింటిని అగ్నివీణ' కవితా సంపుటిగా (1949) ప్రచురించాడు. దాంతో పాటు సోమసుందర్ వజ్రాయుధం, ఆరుద్ర త్వమేవాహమ్, దాశరథి అగ్నిధార కవితా సంపుటాలు 1949 లో ప్రచురించబడ్డాయి. శ్రీశ్రీ మహా ప్రస్థానం(1950) పుట్టపర్తి పురోగమనం (1951) వచ్చాయి.

అనిసెట్టి ప్రేరణతో రెంటాల సంఘర్షణ (1956), కె.వి.రమణారెడ్డి భువన ఘోష(1956), గంగినేని ఉదయిని(1950), రెంటాల సర్పయాగం(1957) కుందుర్తి తెలంగాణ (1957), శ్లిష్టా విష్ణు ధనువు వంటి అభ్యుదయ కవితా సంకలనాలు వచ్చాయి. ఈ కవితా సంపుటాల ఆధారంగా డా॥సి.నారాయణ రెడ్డి అభ్యుదయ కవితా లక్షణాలుగా 1. వర్గ సంఘర్షణ, 2. విప్లవ ప్రబోధం, 3. యుద్ధ విముఖత- శాంతి కాముకత, 4. వీరగాథా కథనం, 5. సమ సమాజ నిర్మాణం వంటి ఐదు లక్షణాలను పేర్కొన్నాడు. నారాయణరెడ్డిగారి అభ్యుదయ కవితా లక్షణాల వర్గీకరణం సమంజసంగా ఉంది. ఆయన చెప్పిన లక్షణాల్లో 'వీరగాథా కథనం' తప్ప మిగిలిన లక్షణాలన్నీ అనిసెట్టి కవిత్వంలో ఉన్నాయి. నారాయణరెడ్డిగారు చెప్పని కార్మిక, కర్షక ప్రబోధం, మానవతా దృష్టి వంటి లక్షణాలు కూడా అనిసెట్టి కవిత్వంలో ఉన్నాయి. అనిసెట్టి కవిత్వంలో అభ్యుదయ కవితా లక్షణాలను విశ్లేషిద్దాం.

1.వర్గ సంఘర్షణ: వర్గ పోరాటానికి కార్మిక కర్షకాళిని ప్రేరేపించడం ద్వారా సమ సమాజం సిద్ధిస్తుందని అనిసెట్టి ఆశయం. అగ్నివీణకు పీఠిక లాంటి కవితలో "నరబలిలో చిరపీడనలో/ గుడిలో యంత్రపు దోపిడీలో/ హతులౌపతితుల ప్రాణ జ్వాలలతో/ లోకపు చీకటి కన్ను తెరుస్తూ/ నూత్న మానవునికూపిరిపోస్తూ/ సమ ధర్మం స్థాపిస్తానంటాడు. నరబలిలో హతులైన వాళ్లు/, చిరకాలపు పీడనలో యంత్రపు దోపిడీలో పతితులైన వాళ్ల ప్రాణజ్వాలలతో లోకపు చీకటిని పారదోలుతానంటాడు. అసత్యాహింసల ద్వేషిస్తూ సమధర్మం స్థాపిస్తానంటాడు. ఆయనదృష్టిలో పమధర్మం సమ సమాజమే. సమాజపు అట్టడుగున పడి నలుగుతన్న అధోజగత్సహోదరులకూ, వారికి అండగా నిలిచిన అజ్ఞాత వీరులకు అభినందన సందేశమే అగ్నివీణ సంగీతమంటాడు.

అగ్నివీణలో "వచ్చాను వచ్చాను వ్యాస సంతతి వాణ్ణి" ఖండికలో సమ సమాజ స్థాపనకు ప్రళయ రుద్రునిలా విజృంభిస్తూ "పగిలించి రణభేరి పద్మ వ్యూహము త్రెంచి/ శివమెత్తి విస్ఫులింగములు చిమ్ముతూ లేచి/ ఈ జగతిలో నూత్నజగతిని పెకలిస్తాను" అంటాడు. సమసమాజస్థాపనను అడ్డుకొనే 'ఫ్యూడల్‌వ్యవస్థ మీద తిరుగుబాటుచేసి యుద్ధ భేరీని మోగించి విస్ఫులింగాలు చిమ్ముతానంటాడు. ఈ జగతిలో నూత్నజగతి' అనిసెట్టిదృష్టిలో నవసమాజమే.

వర్గ పోరాటానికి కూడులేని, గూడు లేని దీనులైన సోదరులను పురికొల్పుతూ "లేవరా! లేవరా! కూడు లేని సోదరా!/ లోకపు సిరిసంపదలకు మనకూ హక్కుందిరా!/ లోకపు సౌందర్యానికి మనకూ హక్కుందిరా!"- అంటాడు. లోకంలో ప్రజలంతా సమానమే. సమాజంలో గాలి, నీరు, భూమి అందరివి. కానీ సంఘంలో కొందరు స్వార్థపరులైన ధనిక స్వాములు అక్రమంగా, అన్యాయంగా గుత్తాధిపత్యాన్ని చెలాయిస్తున్నారు. తినడానికి తిండి లేని సోదరులతో కవి మమేకమై లోకపు సిరిసంపదలపై, లోకపు సౌందర్యంపై మనకూ హక్కుందని తిరుగుబాటు చేయమని ప్రేరేపిస్తాడు.

2. వీరావేశం- విప్లవ ప్రబోధం: అనిసెట్టి పారతంత్ర్యం ఛేదనకు, స్వాతంత్ర్య సాధనకు వీరావేశంతో విప్లవ ప్రబోధ గీతం రాశాడు. శత్రువులైన బ్రిటీషు వారిని తరిమికొట్టేందుకు, పురాదాస్యాన్ని పోగొట్టేందుకు "పుడమి నిండా నీ నెత్తురు/ పుష్కలమ్ముగ చిమ్మరా/ పురాదాస్య పరాభవము/ పూర్తిగా కడిగేయరా!"- భరతమాత దాస్య విముక్తికి రక్తాన్ని చిందించమని ప్రబోధించాడు. పురాదాస్య పరాభవాన్ని రక్తంతో కడిగేయమని వీరావేశంతో పలికాడు. ప్రజల హక్కులను హరించి బందీలుగా చేస్తున్న బందిఖానాలను బ్రద్దలు కొట్టమని వీరావేశంతో "ఉక్కు బందిఖానాలను/ ముక్కలు చేయాలిరా!/ గడియసేపు మాలమాపి/ గత కాలము మార్చరా!/ అంటాడు. పామరుల శిరస్సులతో బంతులాడే పాలకులను ప్రగతి చక్ర ఘట్టనతో సంహరించమంటాడు.

3. యుద్ధ విముఖత- శాంతి కాముకత: శాంతి కాముకుడైన అనిసెట్టి యుద్ధాలను నిరసించాడు. యుద్ధం వల్ల జరిగే అపార నష్టాన్ని, వ్యయాన్ని ధనపు మూల్యంతో లెక్కకట్టలేమని మేధావులు పేర్కొన్నారు. సంపన్న దేశాలు కోట్లాది రూపాయలు వెచ్చించి అణుబాంబులు తయారుచేస్తున్నాయి. న్యూట్రాన్ బాంబుల వంటివి మనిషిని హింసించి చంపుతాయి. 1945 వ సంవత్సరం ఆగస్టు 6 వ తేదీన అమెరికా, జపాన్ నగరాలైన హిరోషిమా, నాగసాకీ పట్టణాల జన శ్రేణులపై అణుబాంబులను పేల్చింది. ఎవ్వరికీ తెలియకుండా అమెరికా రహస్య పాటవ పరీక్షగా ప్రయోగించిన అణు బాంబుల వల్ల లక్షలాది ప్రజలు, అమాయకపు శిశువులు దారుణ మారణ కాండకు బలైపోయారు. ఎందరో శాశ్వత వికలాంగులయ్యారు. ఈ బీభత్స కాండ ప్రజలందరినీ కదిలించింది. తెలుగు కవుల్లో హృదయ సౌకుమార్యం గల శాంతి కాముకుడైన అనిసెట్టి మాత్రమే ఆర్ద్ర హృదయంతో స్పందించి 1945 అక్టోబరు ప్రతిభ మాసపత్రికలో 'అణువు-బాంబు' పేరిట సుదీర్ఘ కవితను రాశాడు. తర్వాత అణు సంగీతంగా మార్చి కల్పన కవితా సంకలనంలో (1953) చేర్చాడు. ఈ కవితా ఖండికను సోమసుందర్ ప్రశంసిస్తూ "హిరోషిమా నాగసాకి సంఘటనతో చలించిన అనిసెట్టి ఒక్కడే 'అణు సంగీతం' ఆలాపించాడు. ఆంగ్ల కవయిత్రి ఎడిత్‌సిట్‌వెల్ "ది అటామిక్ ఏజ్" అనే కవిత రచించింది. ఆ దారుణ మారణకాండపై ప్రత్యక్షంగా రచింపబడినవనేనెరిగినంత వరకు ఇవే చిరస్మరణీయమైనవి" అన్నాడు.

అనిసెట్టి అణుబాంబులను ప్రయోగించే వారిని నిశితంగా నిలదీసి ప్రశ్నిస్తూ "మానవుడా! నీకు హక్కులేదు/ మానవాభ్యుదయచరిత్రను కళంకితం చేయబోకని" హెచ్చరించాడు. "గుప్పెట ఇమిడే బాంబుతో గుప్పెడు బూడిద చేయడమని" బాంబులను ప్రయోగించే మానవుణ్ణి వేడుకున్నాడు. శాంతి కాముకుడైన అనిసెట్టి అభ్యుదయరచయితలందరిలో శాంతి ప్రియత్వానికి అగ్ర తాంబూలమిచ్చాడు. స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలతో మమేకం చెంది"నేను గూడ!నేనుగూడా నడుస్తాను/ శాంతికొరకు జగతిదాస్యముక్తి కొరకు/ శత్రుసేన తుత్తినియలు చేసేందుకు/ నేను గూడా నడుస్తాను" అంటాడు. అనిసెట్టి శాంతి ప్రియత్వం దాస్యాన్ని భరించడం కాదు. దాస్యాన్ని ఛేదించి పారతంత్ర్యాన్ని పటాపంచలు చేసిన పిదప శాంతిని నెలకొల్పడం ఆయన ధ్యేయం. ఆయన శాంతి మూకాభినయం ప్రాంతీయభాషలైన తమిళం, కన్నడం, మలయాళంతో పాటు ఇంగ్లీషు, రష్యా, చైనా వంటి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టింది.

4. గతనిరాసం (చారిత్రక దృక్పథం): అభ్యుదయ కవి గతాన్ని గుడ్డిగా విశ్వసించడు. ఆలోచనాత్మకంగా అవలోకిస్తాడు. విమర్శనాత్మకంగా విశ్లేషిస్తాడు. చరిత్రగతిలో హఠాత్పరిణామాన్ని అంగీకరించడు. సామాజిక ప్రయోజనం లేని గత చరిత్రల గమనాన్ని అభ్యుదయ కవులు నిరసించారు. అవి కేవలం శుద్ధ చరిత్రలు. మనకున్న చరిత్రలు దాదాపు ఇటువంటివే "సమాజంలో వ్యక్తుల కన్నా సమాజానికే ప్రాధాన్యం ఉండాలని" ఎమిలీబరన్స్ చెప్పారు. ఇంతవరకు నడిచిన గత చరిత్రంతా వర్గపోరాటాల చరిత్రేనని మార్క్స్, ఏంగెల్స్‌లు అభిప్రాయపడ్డారు. అభ్యుదయ కవులంతా గత చరిత్ర గమనాన్ని తీవ్రంగా గర్హించారు. శ్రీశ్రీ దేశ చరిత్రలు ఖండికలో "నరజాతి చరిత్ర సమస్తం/ పరపీడన పరాయణత్వం/ గతమంతా తడిసె రక్తమున/ కాకుంటే కన్నీళులతో" అంటాడు. యుద్ధాల్లో రక్త ప్రవాహాన్ని, కన్నీటిమయ గాథలను శ్రీశ్రీ నిరసించాడు. అనిసెట్టి కూడా గత చరిత్ర గమనాన్ని నిరసిస్తూ "నరజాతి చరిత్ర క్రిక్కిరిసిన/ ప్రళయ సమర సంఘర్షణ/ జారిన వీరుల రక్తం/ అరని వనితల దుఃఖం"- అంటాడు. గత చరిత్రలో యుద్ధాల్లో జారి ప్రవహిస్తున్న వీరులరక్తం, వీరులమరణంతో ఆరని దుఃఖాగ్నితో అలమటిస్తున్న రాణుల స్థితి, మానవతా దృక్పథంతో ఆలోచిస్తే మనసులు ద్రవించి పోతాయని అనిసెట్టి గత చరిత్ర గమనాన్ని నిరసించాడు. దాశరథి కూడా గత చరిత్ర తీరును నిశితంగా నిరసించాడు.

అనిసెట్టి కార్మిక కర్షక ప్రబోధం ద్వారా వారిని వర్గ పోరాటానికి పురికొల్పి 'సమ సమాజ స్థాపనకు ప్రేరేపించాడు. అభ్యుదయ కవితా లక్షణాలన్నీ అనిసెట్టి కవిత్వంలో పుష్కలంగా ఉన్నాయి. అభ్యుదయ కవితా ఉద్యమంలో అనిసెట్టి నిర్వహించిన పాత్రను గూర్చి ఆరుద్ర వివరిస్తూ "అభ్యుదయ కవితా ఉద్యమంలో నిస్వార్థంగా పాల్గొన్న కవి. ప్రజాశక్తి, అభ్యుదయ పత్రికల్లో చురుగ్గా పని చేశాడు. అనిసెట్టి భావాలు సంపూర్ణంగా సామ్యవాద సిద్ధాంత భూయిష్ఠాలు " అన్నాడు. అనిసెట్టి 1979 డిసెంబరు 27 వ తేదీన మరణించినా, సాహితీ ప్రియుల హృదయాల్లో ఆయన చిరస్మరణీయులు. ఆయన శత జయంతి సందర్భంగా ఆయనకిదే నివాళి.

వ్యాస రచయిత అనిసెట్టి సాహితీ పరిశోధకులు

పెకలించండి

-డా॥తక్కోలు మాచిరెడ్డి

ఫాసిజం
జాతి మత తంత్ర మార్గాది
దురహంకార భూమిలో
హింసతో పెంచబడ్డ
ఎముకల చెట్టు
పుర్రెలు కాసే
ఎముకల చెట్టు
-ఫాసిజం
పెకలించండి దీన్ని
కూకటి వేళ్లతో
పెకలించండి!

ఇంకా చల్లారని ఆకలి చావులు..

ఎటు పోతున్నది ఈ ప్రపంచం నేడు
నాలుగు మెతుకులు కరువవుతుంటే
పిడికెడు అన్నం కోసం ప్రాణాలు విలవిలలాడె
గొప్పలు సృష్టించినా మనిషి దౌర్భాగ్యపు జీవనం..

శృతి తప్పుతున్న మానవత్వపు వీణలు
గుడి గంటల మ్రోగే ఆకలి ప్రేగుల అరుపులు
ప్రార్థన స్థలాల బయట వినిపించే ఆకలి కేకలు
కనిపించని దేవుళ్లు సమాధానం ఏమీ చెప్పరు..

ఆహారం కోసం విలవిలలాడే దేశాలు
పట్టెడన్నము దొరక్క పసిప్రాణాలు గాలిలో కలిసే
కుబేరులు పెరుగుతున్న ప్రపంచంలో
కూటికోసం ఎన్నో ప్రాణులు బలి అయ్యే..

ఎక్కడ లోపం ఎక్కడ నష్టం?
జరుగుతున్న నష్టానికి కారణమేంటి

అభివృద్ధి పథంలో ఆకాశపు శోధనలు
అడుగునపడ్డ అభాగ్యుడి ఆహారపు దారుల్లో..

తిన్నది అరగక అవస్థలు పడే జనాలు కొందరు
పిడికెడు మెతుకులు దొరకని నిర్భాగ్యులు ఎందరో
ఖాళీ కడుపుతో నిమిషాలలో వదిలే పసిప్రాణాలు..

ఈ చరిత్ర ఏ సిరా చుక్కలు చూపిస్తున్నాయి

ప్రపంచీకరణలో అర్ధాయుష్షు రోజులు గడుపుతూ
దీర్ఘాయుష్షు కోసం వైద్యశాస్త్రం కృషి చేస్తుంటే
తిండిగింజల కోసం మొహంవాచిన దేశాల అవస్థలు..

రాకెటులా దూసుకెళ్తున్న విజ్ఞానపు ఆనవాళ్లు
సమస్త సృష్టిపై పెత్తనం చేస్తున్న మానవుడు
అయినా ఆకలి చావులు ఇంకా చూడండి
ప్రగతిపథంలో తిరోగమనం ఈ చావులు..

ఆకలి కేకలు కావవి
కడుపు మండిన ప్రేగులు విలపించే విషాద గీతాలు
అయ్యో పాపం అంటున్న పెద్దన్న పాత్రలు
అభాగ్యుడికి దొరకడం లేదు పిడికెడు మెతుకులు..

పరిష్కారానికి మార్గాలు ఎక్కడ కనిపిస్తాయి
కాలే కడుపుకు పండుగ ఎప్పుడు వస్తుంది
విందు భోజనం లేకున్నా కడుపు నిండేవరకు చాలు
తృప్తిగా నాలుగు మెతుకులు కోసం ఎదురుచూపులు..

కొప్పుల ప్రసాద్, 9885066235

విలక్షణ 'అనంత కథా' విందు!

గ్రంథ సమీక్ష

అనంతపురం జిల్లా రచయిత్రుల కథా సంకలనం 'ముంగారు మొలకలు' నిజంగా బంగారు మొలకలే! ఇందులోని చాలామంది రచయిత్రులు మహిళా సమస్యలను వివిధ కోణాలలో స్పృశించి పాఠకులకు ఒక 'ఎరుక'ను కలిగించే ప్రయత్నం చేశారు. 'పల్లె వెలుగు' కథ పల్లెకు పట్టణానికి తేడా చెరిగిపోతోందనీ చెబుతూ మహిళా ప్రయాణికులకు కలుగుతున్న ఇబ్బందుల్ని కనీసం ఆర్టీసీ సిబ్బంది గాని, తోటి ప్రయాణికులు గాని పట్టించుకోకపోవడం కళ్ళకు కట్టినట్టుగా చూపింది. నగరాల్లో ఉండే సామాజిక బాధ్యతారాహిత్యం పల్లెలకు సోకిన విషయం సునిశితంగా చెప్పారు రచయిత్రి. సంకలనంలోని మొట్ట మొదటి కథ 'ముసుగుతీసిన హేతువు' సులక్షణమైన కథ. ప్రాణం మీదికి వస్తే తప్ప మనిషి- తోటి మనిషి ఉనికిని గుర్తించడని విలక్షణంగా చెప్పడంతో పాటు మూఢనమ్మకాల జాడ్యాన్ని వదిలించుకోమని చక్కగా సూచించారు కథకురాలు. కథ ముగింపులో చలి, వర్షం బాధల నుంచి తప్పించుకోవడానికి మృతదేహానికి కప్పిన దుప్పట్లో తాను ముడుచుకుని పడుకున్నానని గ్రహించి సదరు నాయకుడు విస్తుపోతాడు. పాఠకుడు కూడా విస్తుపోయే అద్భుతమైన కొసమెరుపు.

మొత్తంగా పాతిక కథలతో వెలువడిన ఈ సంకలనంలో - సాధారణ మహిళ ఎదుర్కొనే కపట ప్రేమలు, కాలు జారడాలు, అనుమానాలు, అవమానాలు వగయిరా విషయాలన్నింటినీ రచయిత్రులు తమ కథలలో చక్కగా మనసుకు హత్తుకునేలా పొందుపరిచారు. ఈ కోవకు చెందినదే 'మనసున మనసై' !

'ఆటపట్టు' కథ నడక బాగుంది. క్రీడాకారుల ఎంపికలో తీసుకోవలసిన జాగ్రత్తలు చక్కగా చెప్పారు.. క్లైమాక్స్‌లో మాత్రం ఫలానా వర్గాల వారిని మాత్రమే ఎంపిక చేయాలనడం కన్నా ప్రతిభ ఉన్న వారిని ఎంపిక చేయాలని ఉంటే ఇంకా బాగుండేది అనిపించింది. బతుకుపై ఆశ పెంచుకోవాలని చెప్పే కథ 'బ్రతుకుపోరు'.

'మెరవణి' కూడా గొప్ప భావోద్వేగంతో నడిచిన కథ. 'సాబువ్వ' కథలో వరిబువ్వ కోసం పేదవర్గాల వారు అలమటించడం - పిల్లల ప్రాణాలు ఆ అన్నం కోసం ఆరాటపడటం చాలా సహజంగా చెప్పారు రచయిత్రి. అంతటితో ఊరుకోకుండా ఆ బువ్వలో పోషకాలు ఏవి దొరకవని రెండు పాత్రలతో చెప్పించడం బాగుంది. పాతకాలానికి పోవడం మంచిది అనిపించటం కొసమెరుపు. 'బ్రతుకు బరువు' వృద్ధుల బాధలకు అద్దం పట్టింది. ఆస్తి తప్ప అమ్మ వద్దు అనుకునే పిల్లలకు - చెంప దెబ్బ కొట్టినట్లుగా మనవరాలు చేసిన పరిష్కారం చాలా బాగుంది. అంశం ఇదే అయినా చిట్టచివరి కథ 'రానిక నీ కోసం' విషాదాంతంగా ముగిసి గుండె మెలిపెడుతుంది.

'పరిణీత' యవ్వన వికారాలకు మంచి మందు. అందులో మధు పాత్రలా కుటుంబసభ్యులు ఓర్పు, నేర్పు ప్రదర్శించాల్సిన అవసరం ఉంది అని నొక్కిచెప్పిందీ కథ. 'బహుమతి' కథ టీనేజ్ బాలికలలోని అనవసర భయాందోళనలను, వసతి గృహాల్లో వారు ఎదుర్కొనే సమస్యలను తేటతెల్లం చేసింది.

'ధైర్యం' కథ కూడా మంచి సందేశాన్ని ఇస్తుంది. శ్రేయోభిలాషుల ముసుగులో వృద్ధులు సైతం ఆడపిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలిగిస్తారో చెబుతూనే వారిని ఎలా కట్టడి చేయాలో ఈ కథ చక్కగా వెల్లడించింది. ఇందులో రాజేశ్వరి క్యారెక్టర్ ఉన్నతంగా నిర్మితమైంది. కాలేజీలలో ఇలాంటి ప్రిన్సిపాళ్లు ఉంటే చాలా మంది అమాయక బాలికలు బతికి బట్టకడతారు.

'నారాయణమ్మవ్వ' కథ కూడా 'పరోపకారార్థం ఇదం శరీరం' అన్న భారతీయ నానుడికి దర్పణం పడుతూ సాగింది. 'అమ్మకో గూడు' మంచి కథ. పెద్దవాళ్ల ఇష్టాయిష్టాలను మన కోణంలో పరిష్కరించడం కాక వారు కోరుకున్న విధంగా చేయడం వారికి సంతృప్తి కలిగిస్తుంది అని చెప్పిన తీరు చాలా బాగుంది. ఆ తరంవారిని వారికి నచ్చినట్టు బతకనీయడమే వారికి మనం చేసే సేవ అన్న పరమార్థం అందులో ఇమిడి వుంది.

భాషాభిమానం గురించి చెప్పిన 'అపరాధం' కథ ఆద్యంతం ఆకట్టుకుంది. మద్రాసి తెలుగువాళ్ళలో ఉన్న మాతృభాషపై మమకారం మనకు లేకపోవడం నిజంగా దౌర్భాగ్యమైన విషయం.

సాహితీవేత్తలనిపించుకునే మృగాళ్ళ ప్రవర్తనకు అద్దం పడుతుంది 'రైటింగ్ కౌచ్' కథ. అదే సమయంలో ఇలాంటి వాళ్ల నుంచి ఎలా బయటపడాలి అన్న ఆలోచన కూడా ఈ కథ కలిగిస్తుంది.

'వరాహ మూర్తి' కథలో అనంతపురం జిల్లాలో పందుల బెడద ఇబ్బందులు హాస్య పూరితంగా చెప్పారు రచయిత్రి. హాస్యం వెనక రాజకీయ నాయకుల చేతిలో తాము తరచూ మోసపోతున్న విషాదం కూడా ఈ కథలో ధ్వనిస్తుంది.

చిన్న కథ అనిపించినా 'కాకి' చాలా బాగుంది. వర్ణవివక్షతో ప్రారంభించి దిక్కులేని వృద్ధుల వరకు దీన్ని నడిపించడం సూక్ష్మంలో మోక్షం అనిపించింది. 'అమ్మమ్మ మనసు' ఒక చక్కని లక్ష్యంతో సాగి చదువరులకు మంచి కథ చదివామన్న సంతృప్తికలిగిస్తుంది.

'రుణచిత్రం' చదువరులను కన్నీరు పెట్టించిన కథ. అనంతపురం రైతుల కష్టాలను ఏకరువు పెడుతూనే ప్రభుత్వ విధానాలను ఎండ కట్టడంలో మంచి నైపుణ్యం చూపించారు రచయిత్రి. 'ధృతరాష్ట్ర కౌగిలి' కూడా రాయలసీమ రైతుల దుర్భిక్షానికి కారణాలను వెతికే ప్రయత్నం చేయడం గమనార్హం.

'భూల్ భులయ్యా' సాధారణ అంశానికి అసాధారణ నడకను అద్ది ఆకర్షణీయం చేశారు రచయిత్రి. ఇందులో కథలన్నీ చక్కగా ఏర్చి కూర్చి సంకలించిన సంకలనకర్తలకు, రచయిత్రులకు అభినందనలు. చివరిలో రచయిత్రుల క్లుప్త పరిచయం ఇవ్వడం చాలా బాగుంది.

-చంద్ర ప్రతాప్ కంతేటి, 8008143507



ముంగారు మొలకలు
అనంతపురం జిల్లా మహిళా కథకుల కథలు
పేజీలు : 223, వెల : రూ. 250/-,
ప్రతులకు : ఎం ప్రగతి, 1-4-193,
జానకిరామ నగర్, అనంతపురం - 515004,
ఫోన్ : 94407 98008

గాంధీ కుటుంబం సలహాతో తప్పేంటి?

కాంగ్రెస్ అధ్యక్ష అభ్యర్థి మల్లికార్జున్ ఖర్గే

బెంగళూరు: కాంగ్రెస్ పార్టీకి తాను అధ్యక్షుడిగా ఎన్నికైతే... పార్టీని నడిపించడంలో గాంధీ కుటుంబం సలహాలు తీసుకోవడంలో ఏమాత్రం సిగ్గుపడబోనని పార్టీ సీనియర్ నాయకుడు మల్లికార్జున్ ఖర్గే ఇక్కడ ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. అక్టోబర్ 17న పార్టీ అత్యున్నత పదవికి జరిగే ఎన్నికల్లో తానే 'ప్రతినిధుల అభ్యర్థి' అని ఖర్గే పేర్కొన్నారు. ఖర్గే ఏఐసీసీ అధ్యక్షుడయ్యాక గాంధీ కుటుంబానికి రిమోట్ కంట్రోల్‌గా ఉంటారని బీజేపీ ప్రచారం చేయడంపై ఆయన స్పందిస్తూ... 'ఇంకేమీ చెప్పాల్సిన పనిలేదు కాబట్టి ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారు...బీజేపీ ఇలాంటి ప్రచారానికి పాల్పడితే ఇతరులు దానిని అనుసరిస్తారు' అన్నారు. సోనియాగాంధీ 20 ఏళ్లుగా పార్టీలో పనిచేశారు... రాహుల్ గాంధీ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు... పార్టీ ఎదుగుదలకు తమ సత్తా చాటారని ప్రశంసించారు.

జవహర్‌లాల్ నెహ్రూ నుంచి ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, సోనియాగాంధీ వరకు ఈ దేశం కోసం నెహ్రూ-గాంధీ కుటుంబం ఎనలేని సేవలందించిందని, త్యాగాలు చేసిందని కొనియాడారు. కాంగ్రెస్ కొన్ని ఎన్నికలలో ఓడిపోయినందున, గాంధీలకు వ్యతిరేకంగా మాట్లాడటం సరికాదన్నారు. వారు ఈ దేశానికి ఎంతో మేలు చేశారని, వారి సలహా పార్టీకి ప్రయోజనం చేకూరుస్తుంది కాబట్టి తాను కచ్చితంగా వారి సలహా, మద్దతు తీసుకుంటానని ఖర్గే పేర్కొన్నారు. ఇందులో సిగ్గు పడాల్సిందేమీ లేదన్నారు. పార్టీ బలోపేతానికి మీడియా సలహా వల్ల ఏదైనా ప్రయోజనం తాను స్వీకరిస్తానని తెలిపారు. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖర్గే ఆదివారం కొందరు రాష్ట్ర కాంగ్రెస్ నేతలను కలుసుకుని మీడియాతో మాట్లాడారు. అధ్యక్ష ఎన్నికల్లో ఆయన తిరువనంతపురం ఎంపీ శశిథరూర్‌తో పోటీ పడుతున్నారు. అక్టోబరు 19న ఫలితాలు వెలువడనున్నాయి. ఎన్నికలలో తన ప్రత్యర్థి థరూర్‌పై లేదా అతని ప్రచారంపై ప్రత్యక్ష వ్యాఖ్యలు చేయడానికి ఖర్గే ఇష్టపడలేదు. ప్రతి ఒక్కరికీ వారి యోగ్యత గురించి మాట్లాడే హక్కు ఉందన్నారు. అధ్యక్షుడ్ని అయ్యేందుకు మద్దతునివ్వాల్సిందిగా కోరుతూ... పార్టీలో అట్టడుగు స్థాయితో తన సంబంధాలను ప్రముఖంగా ప్రస్తావిస్తున్నట్లు చెప్పారు. 'నేను ఎలాంటి వివాదాల్లోకి రాకూడదనుకుంటున్నాను, అతను (థరూర్) తన ఆలోచనలు చెబుతున్నాడు... అతని ఆలోచనలపై నేను చర్చలు చేయకూడదనుకుంటున్నా... నేను నా ఆలోచనలను పంచుకుంటున్నాను. ఇది మా పార్టీ లేదా కుటుంబ విషయం. అతను కోరుకున్నది చెప్పే హక్కు ఆయనకు అలాగే నాకు కూడా ఉంది... ఇది అంతర్గత స్నేహపూర్వక పోరాటం" అని ఖర్గే పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి తమలో ఎవరూ పోటీ చేయరని గాంధీ కుటుంబం తేల్చిచెప్పడంతో, పార్టీకి తన సుదీర్ఘ సేవలను దృష్టిలో ఉంచుకుని వివిధ రాష్ట్రాల సీనియర్ నాయకులు, నాయకులు, ప్రతినిధులు తనను పోటీ చేయవలసిందిగా కోరారని చెప్పారు.

ఖర్గేతోనే కాంగ్రెస్ సురక్షితం
పార్టీ నాయకుడు మనీశ్ తివారి

న్యూదిల్లీ: కాంగ్రెస్‌కు 'సురక్షితమైన చేతులు' అవసరమని, పార్టీని నడిపించడానికి మల్లికార్జున్ ఖర్గే సరైన వ్యక్తి అని లోక్‌సభ సభ్యుడు మనీశ్ తివారీ తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఖర్గేను తన ఎంపికగా సమర్థిస్తూ అన్నారు. తివారీ, తన లోక్‌సభ సహచరుడు శశి థరూర్‌తో కలిసి ఆగస్టు 2020లో జి-23 అనే అసమ్మతి గ్రూపు అంతర్గత సంస్కరణల కోసం ఒత్తిడి తేవాలని పార్టీ అధినేత్రి సోనియా గాంధీకి రాసిన లేఖపై సంతకం చేసిన విషయం తెలిసిందే. అయితే శశి థరూర్, మల్లికార్జున ఖర్గే మధ్య పార్టీ అధ్యక్ష పదవికి పోటీ నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పంజాబ్‌కు చెందిన ఈ లోక్‌సభ సభ్యుడు ఏఎన్ఐ వార్తా సంస్థకు ఇచ్చిన తన ఇంటర్వ్యూ వీడియోను కూడా పంచుకున్నారు. ఇందులో ఖర్గే క్రింది స్థాయి నుంచి ఎదిగారని, విద్యార్థుల విభాగంతో సహా పార్టీ వివిధ స్థాయిలలో పని చేశారని చెప్పారు. 'మీరు అన్ని వాస్తవాలను ఉంచి, నిష్పాక్షికంగా విశ్లేషిస్తే, ఖర్గే జీ కాంగ్రెస్ పార్టీకి 50 సంవత్సరాలు సేవ చేశారు. ఈ తరుణంలో కాంగ్రెస్‌కు సురక్షితమైన చేతులు, స్థిరమైన వ్యక్తిత్వం అవసరం. అది మల్లికార్జున్ ఖర్గే జీ రూపంలో ఉంటుంది. యువజన కాంగ్రెస్, బ్లాక్ కమిటీలు లేదా జిల్లాల్లో పని చేసిన వారికి సంస్థాగత సవాళ్లపై మంచి అవగాహన ఉంటుందని నా అభిప్రాయం' అని తివారి అన్నారు.

బ్యాలెట్ పత్రంలో
గందరగోళం తొలగించండి
థరూర్ వర్గం వినతి

న్యూదిల్లీ: కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల పోలింగ్ బ్యాలెట్ పత్రం విషయంలో గందరగోళానికి దారి తీసే పరిస్థితిని అభ్యర్థిగా పోటీ చేస్తున్న శశి థరూర్ వర్గం ఆ పార్టీ కేంద్ర ఎన్నికల మండలి చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లింది. సీరియల్ నంబర్ '1'లో మల్లికార్జున్ ఖర్గే, '2'లో థరూర్ ఉన్న బ్యాలెట్ పత్రం పై తమకు నచ్చిన పేరుకు వ్యతిరేకంగా '1' అని పీసీసీ ప్రతినిధులను గుర్తు పెట్టమని కోరుతూ ఆదేశించిన నేపథ్యంలో థరూర్ వర్గం ఈ విషయాన్ని లేవనెత్తినట్లు ఆ వర్గాలు ఆదివారం తెలిపాయి. దీంతో ఇప్పుడు '1'కి బదులుగా ఇష్టపడే అభ్యర్థి పేరుకు వ్యతిరేకంగా గుర్తించడం అంగీకరించబడుతుందని పార్టీ కేంద్ర ఎన్నికల మండలి చైర్మన్ మధుసూదన్ మిస్త్రీ తెలియజేసినట్లు ఆ వర్గాలు తెలిపాయి. శనివారం జారీ చేసిన పోలింగ్ సూచనలలో పీసీసీ సభ్యులు 'బ్యాలెట్ పత్రం పై అభ్యర్థి పేరుకు వ్యతిరేకంగా '1' అని గుర్తు పెడతారని, బ్యాలెట్ బాక్స్‌లో ఉంచడానికి బ్యాలెట్ పేపర్‌ను మడపెడతారని మిస్త్రీ చెప్పారు. బ్యాలెట్ పేపర్‌లో సీరియల్ నంబర్ 1లో ఖర్గే, సీరియల్ నంబర్ 2లో థరూర్ అని ఉన్నందున అభ్యర్థి పేరు ముందు '1' అని రాస్తే థరూర్‌కు ప్రతికూలత ఏర్పడుతుందని, ఓటర్లు గందరగోళానికి గురవుతారని థరూర్ బృందం మిస్త్రీతో ఈ విషయాన్ని ప్రస్తావించింది. కాగా పార్టీ రాజ్యాంగం ప్రకారం... ఇష్టపడే అభ్యర్థి పేరు ముందు '1' అని గుర్తు పెట్టాలని ఉందన్న విషయాన్ని ఉదహరించారు. అయితే, ఇది ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది అభ్యర్థులు ఉన్న సందర్భాల్లో మాత్రమే ఉద్దేశించిందని, ప్రాధాన్యతలు ఇవ్వవలసి ఉందని థరూర్ బృందం సూచించింది. చివరగా, ఆదివారం మధ్యాహ్నం మిస్త్రీ... థరూర్ బృందానికి '1'కి బదులుగా గుర్తు పెట్టవలసి ఉంటుందని తెలియజేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఓటర్లు తాము ఓటు వేయాలనుకునే అభ్యర్థి పేరు ముందు గడిలో గుర్తు పెట్టాలని, మరేదైనా గుర్తు పెట్టడం లేదా సంఖ్య రాసినా ఓటు చెల్లదని మిస్త్రీ కార్యాలయం నుంచి ప్రతినిధులకు సందేశం వచ్చింది. తాజాగా రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్... ఖర్గేకు ఆఫీసు బేరర్లు బహిరంగంగా మద్దతు తెలిపే అంశాన్ని కూడా వారు లేవనెత్తారు. కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలు రహస్య ఓటింగ్ ద్వారా జరుగుతాయని, ఎవరు ఎవరికి ఓటు వేశారో ఎవరికీ తెలియదని మిస్త్రీ గత వారం చెప్పారు. సోమవారం పార్టీ అధ్యక్ష ఎన్నికల పోలింగ్, బుధవారం లెక్కింపు నిర్వహిస్తారు.

హిందీలో ఎంబీబీఎస్ పాఠ్యపుస్తకాలు
విడుదల చేసిన అమిత్ షా

భోపాల్: హిందీ భాషలో వైద్య విద్యను అందించేందుకు మధ్య ప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో భాగంగా ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం హిందీలో మూడు పాఠ్య పుస్తకాలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం విడుదల చేశారు. హిందీలో ఎంబీబీఎస్ (బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్, బ్యాచిలర్ ఆఫ్ సర్జరీ) కోర్సును ప్రారంభించిన దేశంలో మధ్యప్రదేశ్ మొదటి రాష్ట్రంగా అవతరించింది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం హిందీలో మెడికల్ బయోకెమిస్ట్రీ, అనాటమీ, మెడికల్ ఫిజియాలజీ సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలను ఆవిష్కరించిన సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ చరిత్రలో ఇది ఒక ముఖ్యమైన రోజు అని తెలిపారు. దేశంలోని మరో ఎనిమిది భాషల్లో సాంకేతిక, వైద్య విద్యను ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోందని అన్నారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా హిందీలో ఎంబీబీఎస్ కోర్సును ప్రారంభించామని, త్వరలో ఇతర భాషల్లోనూ దీన్ని ప్రారంభిస్తామని చెప్పారు. ఇప్పుడు దేశంలోని విద్యార్థులకు ఆంగ్ల భాష తెలియదనే న్యూనతాభావం ఉండదని, వారు తమ సొంత భాషపై గర్వంగా చదువుకోవచ్చునని కేంద్ర మంత్రి అన్నారు. అంతకుముందు దేశంలో 387 వైద్య కళాశాలల్లో మొత్తం 51 వేల సీట్లు ఉన్నాయని చెప్పారు. ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో 596 కళాశాలలు ఉన్నాయి. అదనంగా 89 వేల సీట్లు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, వైద్య విద్యాశాఖ మంత్రి విశ్వాస్ సారంగ్ పాల్గొన్నారు. అదేవిధంగా ఇతర జాతీయ స్థాయి విద్యా సంస్థల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని ఆయన చెప్పారు. ఈ పాఠ్యపుస్తకాల్లో సాంకేతిక పదాలు ఆంగ్లంలో ఉచ్ఛరించే విధంగా హిందీలో వ్రాయబడి ఉన్నాయని, 'కిడ్నీ'ని కిడ్నీ అని మాత్రమే వ్రాసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. ఆంగ్లం పై అవగాహన లేకపోవడంతో వైద్య విద్యను పొందలేకపోయిన గ్రామీణ ప్రాంత విద్యార్థులు వెనుకబడి ఉండరని, హిందీలో ఎంబీబీఎస్ కోర్సును అభ్యసించగలరని ముఖ్యమంత్రి చెప్పారు.

గుజరాత్ పైనే బీజేపీ గురి

- అధికారం నిలబెట్టుకునేందుకు అన్ని యత్నాలు
- జిల్లా ఇన్‌ఛార్జ్‌లుగా ఇతర రాష్ట్రాల నాయకులు

న్యూదిల్లీ: గుజరాత్ రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో కాషాయ పార్టీ ఆ రాష్ట్రంలో ముమ్మర కసరత్తు ప్రారంభించింది. ఎలాగైనా అధికారాన్ని తిరిగి నిలబెట్టుకునే విషయంపై బీజేపీ గురి పెట్టింది. వివిధ రాష్ట్రాలకు చెందిన తన జాతీయ ఆఫీస్ బేరర్లు, అనుభవజ్ఞులైన ఎన్నికల నిర్వాహకులను ఎంపిక చేసి, ఒక్కొక్కరికి ఒక్కో జిల్లాను కేటాయించడం ద్వారా గుజరాత్‌లోని అసెంబ్లీ స్థానాల్లో సూక్ష్మ నిర్వహణ కోసం బీజేపీ వెళుతున్నట్లు ఆదివారం ఆ వర్గాలు తెలిపాయి. పొరుగున ఉన్న రాజస్థాన్, మధ్యప్రదేశ్ వారితో పాటు బీజేపీ కేంద్ర నాయకత్వం గుజరాత్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించడానికి ఉత్తరప్రదేశ్‌కు చెందిన నాయకులకు కూడా బాధ్యతలు అప్పగించిందని పార్టీ వర్గాలు పీటీఐకి వివరించాయి. 'ఈ నాయకులు అనుభవజ్ఞులైన ఎన్నికల నిర్వాహకులు. తమకు కేటాయించిన సీట్లపై తమ అభిప్రాయాన్ని పార్టీ కేంద్ర నాయకత్వంతో పంచుకోవడంతో పాటు స్థానిక నేతలతో కూడా సమన్వయం చేసుకుంటారు' అని తెలిపాయి. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డేకు వడోదర, ఛోటా ఉదయ్‌పూర్ జిల్లాల బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా ఆనంద్, జామ్‌నగర్ జిల్లాలను పార్టీకి చెందిన మరో ఇద్దరు జాతీయ ప్రధాన కార్యదర్శులు సీటీ రవి, తరుణ్ చుగ్ కేటాయించారు. మధ్యప్రదేశ్ మంత్రి నరోత్తమ్ మిశ్రాకు బనస్కాంత సీటు, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న స్వతంత్ర దేవ్ సింగ్‌కు కచ్ జిల్లా బాధ్యతలు అప్పగించారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రులు అరవింద్ సింగ్ భడోరియా, ఇందర్ సింగ్ పర్మార్‌లకు వరుసగా భరూచ్, ఖేడా బాధ్యతలు ఇచ్చారు. బీహార్ బీజేపీ నాయకుడు నితిన్ నబిన్‌కు వలస జనాభా గణనీయంగా ఉన్న సూరత్‌కు బాధ్యతలు అప్పగించారు. రాజస్థాన్-గుజరాత్ సరిహద్దులకు ఆనుకుని ఉన్న 46 అసెంబ్లీ నియోజకవర్గాలపై దృష్టి సారించాలని పార్టీ కేంద్ర నాయకత్వం రాజస్థాన్ పార్టీ విభాగానికి చెందిన నేతలను ప్రత్యేకంగా కోరినట్లు ఆ వర్గాలు వివరించాయి. కాగా గుజరాత్‌లో మాధవ్‌సింగ్ సోలంకి నాయకత్వంలో 149 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుని కాంగ్రెస్ రికార్డును బద్దలు కొట్టాలని కాషాయ పార్టీ కన్నేసింది. అయితే 27 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉన్న గుజరాత్ రాష్ట్రంలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఎన్నికల బరిలోకి దిగింది.

మళ్లీ అధికారం మాదే: ఠాకూర్

న్యూదిల్లీ: గత రికార్డులన్నింటినీ బద్దలు కొడుతూ ఈసారి కూడా గుజరాత్‌లో తిరిగి అధికారంలోకి వస్తామని బీజేపీ నేత, కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ ధీమా వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో కేంద్రంలోనూ మళ్లీ నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీ 400లకు పైగా సీట్లు గెలుచుకుంటుందని వ్యాఖ్యానించారు. ఆదివారం ఆయన గుజరాత్‌లోని వల్సాడ్ జిల్లా మాల్వన్‌లో నిర్వహించిన 'బీజేపీ గౌరవ్' యాత్రలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో హిందూ చిహ్నాలకు గౌరవం లభించడమే కాకుండా అయోధ్యలో రామమందిర నిర్మాణం కల సాకారమైందన్నారు. గతంలో ఒక ఇటలీ మహిళ ప్రధాని మోదీని అవమానించారని.. ఇప్పుడు ఒక 'ఇటాలియా' మోదీ తల్లిని అవమానిస్తున్నారంటూ కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, ఆప్ నేత గోపాల్ ఇటాలియాల పేర్లను ప్రస్తావించకుండా పరోక్షంగా మండిపడ్డారు. ఇలాంటి అవమానాలను గుజరాత్ గతంలో అంగీకరించలేదని.. అక్కడి ప్రజలు ఇప్పుడూ ఇలాంటివి ఆమోదించరని.. తగిన సమాధానం చెబుతారని ఠాకూర్ వ్యాఖ్యానించారు.

త్వరలో హిమాచల్ 'ఆప్' అభ్యర్థుల ప్రకటన

సిమ్లా: మరో రెండు మూడు రోజుల్లో హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ఆమ్ ఆద్మీ పార్టీ తన అభ్యర్థులందరినీ ప్రకటిస్తుందని పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ హర్జోత్ సింగ్ బైన్స్ ఆదివారం తెలిపారు. రాష్ట్రంలోని 68 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 12న ఎన్నిక జరగనుండగా, డిసెంబర్ 8న ఓట్ల లెక్కింపు చేపడతారు. ఆప్ ఇప్పటికే నాలుగు స్థానాల్లో తమ అభ్యర్థులను ప్రకటించిందని పంజాబ్ మంత్రి కూడా అయిన బైన్స్ మీడియా ప్రతినిధులకు తెలిపారు.

ఉద్ధవ్‌కు షాక్ ఇచ్చిన నిహార్ ఠాక్రే

ముంబై: మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే మరో షాక్ తగిలింది. శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాకరే మనవడు నిహార్ ఠాక్రే మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. త్వరలో నిర్వహించనున్న అంధేరీ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు ముంబై ఎన్నికల్లో ప్రచారం చేస్తానని చెప్పారు. బాల్ థాకరే పెద్ద కుమారుడు బింధు మాధవ్ థాకరే కుమారుడే ఈ నిహార్ ఠాక్రే. వృత్తి రీత్యా న్యాయవాది అయిన నిహార్ థాకరే అసలు శివసేనపై సుప్రీంకోర్టులో జరుగుతున్న విచారణలో ఏక్ నాథ్ షిండేతో పోరాడుతున్న లీగల్ టీమ్‌లో కూడా ఉన్నారు. ఏక్ నాథ్ షిండే తన తాత ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నారని.. అందుకే మద్దతు ఇచ్చానని నిహార్ థాకరే తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీతో చేతులు కలపబోనని బాలా సాహెబ్ స్పష్టంగా చెప్పారని.. కారణాలు ఏమైనా కాంగ్రెస్, శివసేన, ఎన్సీపీ కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. 2019లో ప్రజలు పాలించమని అధికారం ఇచ్చిన పార్టీలే ఇప్పుడు అధికారంలో ఉన్నాయని నిహార్ థాకరే పేర్కొన్నారు. నవంబర్ 3న జరగనున్న అంధేరీ ఉపఎన్నికల్లో శివసేన ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే పార్టీ నుంచి రుతుజా లట్కేను ఉద్ధవ్ ఠాక్రే బరిలోకి దింపగా, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన వర్గం మద్దతుతో బీజేపీ ముర్జీ పటేల్‌ను రంగంలోకి దింపింది. శివసేనలో చీలక వచ్చిన తర్వాత జరగబోతున్న మొదటి ఎన్నిక ఇదే కావడంతో రెండు వర్గాలు తీవ్రంగా పోటీపడుతున్నాయి.

రాష్ట్రపతికి కంటి శస్త్ర చికిత్స

న్యూదిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము (64) ఆర్మీ ఆస్పత్రిలో చేరారు. ఆదివారం ఉదయం ఎడమ కంటికి కాటరాక్ట్ (శుక్లం) శస్త్ర చికిత్స చేయించుకున్నారని రాష్ట్రపతి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్రపతికి ఆదివాకం కాటరాక్ట్ శస్త్ర చికిత్స జరిగిందని, సర్జరీ విజయవంతమైందని, ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయినట్లు వివరించింది. కొన్ని రోజుల పాటు రాష్ట్రపతికి విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారని పేర్కొంది. ఈ ఏడాది జులై 25న భారత 15వ రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రపతి ఇటీవల అసోంలో రెండు రోజుల పర్యటన చేపట్టిన సంగతి తెలిసిందే. గత శుక్రవారం తిరిగి దిల్లీ చేరుకున్నారు.

జైషే బాంబు బెదిరింపు...భద్రత కట్టుదిట్టం

హరిద్వార్: ఉత్తరాఖండ్‌లోని హిమాలయాల్లో ఉన్న కేదార్‌నాథ్, బద్రీనాథ్‌తో సహా హరిద్వార్‌లోని రైల్వే స్టేషన్లు, మతపరమైన ప్రదేశాలను పేల్చివేస్తామంటూ జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ ఏరియా కమాండర్ పేరిట హరిద్వార్ రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్‌కు బెదిరింపు లేఖ వచ్చింది. ఈ క్రమంలో భద్రతా సంస్థలు, నిఘా వర్గాలు అప్రమత్తమయ్యాయి. భద్రతను కట్టుదిట్టం చేశారు. సాధారణ పోస్ట్ ద్వారా పంపిన ఈ లేఖ అక్టోబర్ 10న హరిద్వార్ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్‌కు అందిందని ప్రభుత్వ రైల్వే పోలీస్ (జీఆర్పీ) అదనపు సూపరింటెండెంట్ అరుణ భారతి ఆదివారం తెలిపారు. లేఖ పంపిన వ్యక్తి తాను జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు 'ఏరియా కమాండర్' జమీర్ అహ్మద్ అని పేర్కొన్నాడు. జమ్ముకశ్మీర్‌లో జిహాదీల హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామని ప్రతిజ్ఞ చేశాడు. అక్టోబర్ 25, 27 తేదీల్లో హరిద్వార్ రైల్వేస్టేషన్‌తో పాటు డెహ్రాడూన్, లక్సర్, రూర్కీ, కత్‌గోడం, నజీబాబాద్, షాహ్‌గంజ్ సహా వివిధ స్టేషన్లను హర్ కీ పైరీ, భారత్ మాతా మందిర్, చండీ దేవి మందిర్, మానసాదేవి మందిర్, బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రిలను పేల్చివేస్తామని బెదిరించాడు. ఉత్తరాఖండ్‌లోని అధికారులకు గతంలోనూ ఇలాంటి బెదిరింపు లేఖలు వచ్చాయని, అయితే దీనికి సంబంధించి మొదటిసారిగా కేసు నమోదు చేసినట్లు భారతి తెలిపారు. బెదిరింపు వాస్తవమా లేదా బూటకమా అనేది నిర్ధారిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది కన్వర్ యాత్ర సందర్భంగా రూర్కీలో అధికారులకు అలాంటి లేఖ అందిందని ఆమె తెలిపారు. ఇదే విధంగా లేఖలు వచ్చిన రాష్ట్రాల్లోని సహచర అధికారులతో సమన్వయం చేస్తున్నామన్నారు. పోలీసులు, నిఘా వర్గాలు అప్రమత్తంగా ఉన్నాయని ఆమె తెలిపారు.

డాలర్ బలపడుతోంది: నిర్మలా సీతారామన్

న్యూదిల్లీ: రూపాయి క్షీణించడం లేదని, డాలర్ బలపడుతోందని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థ, కరెన్సీలతో పోలిస్తే రూపాయి చాలా మెరుగ్గా ఉందన్నారు. ఇటీవల రూపాయి విలువ ఆల్ టైమ్ కనిష్ట స్థాయి 82.69కి పడిపోయిన సంగతి తెలిసిందే. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. రూపాయి విలువ మరింత క్షీణించకుండా చూస్తామని అమెరికా పర్యటనలో ఉన్న ఆమె విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. రూపాయి విలువను స్థిరీకరించడానికి ఆర్‌బీఐ ప్రయత్నిస్తోందన్నారు. భారతీయ కరెన్సీ విలువను నిర్ణయించడానికి మార్కెట్‌లో జోక్యం చేసుకోవడం లేదని అన్నారు. వాస్తవానికి డాలర్ రేటు పెరగడం, డాలర్‌కి అనుకూలంగా మారకం రేటు పెరగడంతో రూపాయి విలువ నిలిచిపోయి ఉండవచ్చని అన్నారు. యుద్ధం నిత్యావసరాల ధరలను పెంచిందని, అభివృద్ధి చెందిన దేశాల్లో ద్రవ్యోల్బణం రికార్డుస్థాయిలో పెరగడానికి దారితీసిందన్నారు.

ఆప్‌ను చిత్తుగా ఓడిస్తాం: నడ్డా

న్యూదిల్లీ: దిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వం అవినీతి కుంభకోణాలకు పర్యాయపదంగా మారిందని, కాంగ్రెస్ నెలకొల్పిన అవినీతి రికార్డులను బద్దలు కొట్టిందని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదివారం ఆరోపించారు దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎమ్‌సీడీ) ఎన్నికలు ఆ తర్వాత దిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఆప్‌ని బీజేప చిత్తుగా ఓడిస్తుందని కూడా నడ్డా పేర్కొన్నారు. 'ఆప్ స్కామ్‌ల పార్టీగా మారింది. అది కాంగ్రెస్ నెలకొల్పిన అవినీతి రికార్డులన్నింటినీ బద్దలుకొట్టింది. అది పోవాలి' అని ఇక్కడి రాంలీలా మైదాన్‌లో జరిగిన 'పాంచ్ పరమేశ్వర్ సమ్మేళనం'లో నడ్డా అన్నారు. ఎంసీడీ ఎన్నికలు డిసెంబర్‌లో జరిగే అవకాశం ఉంది. దిల్లీలో స్వచ్ఛమైన ప్రభుత్వాన్ని అందిస్తామని అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని పార్టీ హామీ ఇచ్చిందని, అయితే ఎక్సైజ్ శాఖలో, డీటీసీ బస్సుల కొనుగోలులో, మరుగుదొడ్ల నిర్మాణంలో, దిల్లీ జల్ బోర్డులో కుంభకోణాలకు పాల్పడిందని నడ్డా ఆరోపించారు. ఆప్‌కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు బెయిల్‌పై ఉన్నారని ఎద్దేవా చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే దిల్లీలో మద్య నిషేధాన్ని అమలు చేస్తానని ముఖ్యమంత్రి కేజ్రీవాల్ చెప్పారని, అయితే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత దిల్లీలో అడుగడుగునా మద్యం దుకాణాలను తెరిచారని నడ్డా చెప్పారు. ఎంసీడీ ఎన్నికల్లోనూ, ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆప్‌ని బీజేపీ మట్టికరిపిస్తుందన్నారు. ఆప్ అవినీతి గురించి ప్రజలకు వివరించమంటూ బీజేపీ కార్యకర్తలకు ఉద్బోధించారు.

యూపీ 'పెట్' తప్పని తిప్పలు

- అభ్యర్థులతో కిక్కిరిసిన బస్టాండ్, రైల్వేస్టేషన్‌లు
- ఎలాంటి సౌకర్యాలు కల్పించని ప్రభుత్వం
- యోగిపై ప్రతిపక్ష నేతల ఆగ్రహం

లక్నో: రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల రిక్రూట్‌మెంట్ పరీక్షకు అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రాలకు వెళ్లి, తిరిగి రావడంతో ఉత్తరప్రదేశ్‌లోని బస్ డిపోలు, రైల్వేస్టేషన్‌లు శుక్ర, శనివారాల్లో కిక్కిరిసిపోయాయి. పీఈటీ అనేది ఉత్తరప్రదేశ్ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ కమిషన్‌కు చెందిన ప్రాథమిక అర్హత పరీక్ష. రాష్ట్రంలోని గ్రూప్-సి ప్రభుత్వ ఉద్యోగాల కోసం భవిష్యత్తులో జరిగే నియామక పరీక్షల్లో అభ్యర్థి స్కోర్‌ను అనుమతించేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. అయితే ఈ పరీక్షకు ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 35 లక్షలమందిపైగా అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. నేటితో ఈ పరీక్ష ముగిసింది. అయితే ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. కనీసం ప్రత్యేక బస్సులు, రైళ్లు కూడా వేయలేదని అనేకమంది అభ్యర్థులు వాపోయారు. కనీసం సమయానికి పరీక్ష కేంద్రాలకు కూడా చేరుకునే అవకాశమే లేదని తమ అసంతృప్తి వ్యక్తం చేశారు. దక్షిణ ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి విపరీతమైన రద్దీ చోటుచేసుకుంది. రైళ్లలో కనీసం నిల్చునేందుకు కూడా ఖాళీ స్థలం కనిపించలేదు. పశ్చిమ యూపీలోని హాపూర్ రైల్వేస్టేషన్‌లో అయితే కదులుతున్న రైళ్లను ఎక్కేందుకు అభ్యర్థులు ప్రయత్నించడం కనబడింది. కాన్పూర్‌లోని చార్‌బాగ్ రైల్వేస్టేషన్‌లో, తమ పరీక్షా కేంద్రాల నుంచి తిరిగి వస్తున్న చాలా మంది అభ్యర్థులు మాట్లాడుతూ, రైళ్లలో, రైల్వే, బస్ స్టేషన్‌లలో రద్దీ కారణంగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందని వాపోయారు. "నేను ప్రయాగ్‌రాజ్ నుంచి తెల్లవారుజామున 1 గంటలకు రైలు ఎక్కి, ఉదయం 6 గంటలకు ఇక్కడికి చేరుకున్నాను. ప్రత్యేక రైళ్లు లేవు, ఏర్పాట్లు లేవు" అని లక్నో పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసిన 22 ఏళ్ల అభ్యర్థి ప్రభాత్ వర్మ తెలిపారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయలేదని అమేథీ నుంచి లక్నోకు వెళ్లిన రవికుమార్ మౌర్య అన్నారు.

అంధేరీ ఉప ఎన్నికలో
పోటీ చేయొద్దు
బీజేపీకి రాజ్‌ఠాక్రే లేఖ

ముంబై: అంధేరీ ఈస్ట్ అసెంబ్లీ నియోజక వర్గంలో ఉప ఎన్నికలో పోటీ నుంచి వైదొలగాలని మహారాష్ట్ర నవనిర్మాణ్ సమితి(ఎంఎన్ఎస్) అధినేత రాజ్‌ఠాక్రే బీజేపీని కోరారు. ఇప్పటివరకు ఈ స్థానానికి ప్రాతినిథ్యం వహించిన దివంగత ఎమ్మెల్యే రమేశ్ లత్కేకి గౌరవసూచికంగా, ఆయన భార్య రుతుజా లత్కేపై అభ్యర్థిని పోటీకి నిలపవద్దని బీజేపీని అభ్యర్థించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాశారు. అయితే దీనిపై ఫడ్నవీస్ స్పందిస్తూ... ఒక సదుద్దేశంతో ఠాక్రే తనకు లేఖ రాశారని, నిర్ణయం తీసుకునే ముందు పార్టీ నాయకత్వంతో చర్చించాల్సి ఉంటుందని చెప్పారు. కాగా ఈ ఉప ఎన్నికలో పోటీచేయబోవడంలేదని ఎంఎన్ఎస్ ఇప్పటికే ప్రకటించింది. సిట్టింగ్ ఎమ్మెల్యే రమేష్ లత్కే మరణంతో అంధేరి ఈస్ట్ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆయన భార్య రుతుజ ఇక్కడి నుంచి నామినేషన్ దాఖలు చేశారు. మరణించిన లత్కేకు నివాళులర్పిస్తూ... దివంగత నేతకు గౌరవసూచకంగా ఎంఎన్ఎస్ ఎన్నికల్లో పోటీ చేయదు' అని ఠాక్రే స్పష్టం చేశారు. అంధేరీ ఈస్ట్ సిట్టింగ్ ఎమ్మెల్యే రమేష్ లత్కే ఈ ఏడాది మేలో గుండెపోటుతో మరణించారు. కాగా శివసేన ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే పార్టీ నుంచి పోటీ చేస్తున్న రుతుజా లత్కేకి మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) ఇప్పటికే నిర్ణయించాయి. రాజ్ ఠాక్రే విజ్ఞప్తిపై శివసేన ముఖ్య అధికార ప్రతినిధి, ఎంపీ అరవింద్ సావంత్ స్పందిస్తూ... 'రాజ్ ఠాక్రే విజ్ఞప్తిని నేను స్వాగతిస్తున్నాను... అయితే ఇది చాలా ఆలస్యంగా జరిగింది. ఇప్పటికే నామినేషన్లు దాఖలయ్యాయి... బీజేపీ కారణంగా ఎన్నికలు వచ్చాయి' అన్నారు. అయితే బీజేపీ ఎమ్మెల్సీ ప్రసాద్ లాడ్ మాట్లాడుతూ... రమేశ్ లత్కే భార్య రుతుజా లత్కే ఎన్నిక ఏకగ్రీవం చేసేలా ఉద్ధవ్ ఠాక్రే లేదా అతని సహచరులు ఎవరూ బీజేపీని సంప్రదించలేదని తెలిపారు. ఉప ఎన్నికలో పోటీ విషయమై నిర్ణయాన్ని నేతలు దేవేంద్ర ఫడ్నవీస్, ముంబై బీజేపీ అధ్యక్షుడు ఆశిష్ షెలార్ తీసుకుంటారని ఆయన చెప్పారు. రుతుజా లట్కే విలేకరులతో మాట్లాడుతూ.. 'ఇది ఏకగ్రీవ ఎన్నిక అవుతుందని ముందుగా అనుకున్నానని, అయితే ఉప ఎన్నికను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని' అన్నారు.

సీపీఐ 24వ జాతీయ మహాసభలు

అక్టోబర్ 14-18, 2022 విజయవాడ

మహాసభ వేదికపై అభివాదం చేస్తున్న విదేశీ కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు

దక్షిణాసియా ప్రజల ఐక్యత అవశ్యం

శ్రీలంక కమ్యూనిస్టు పార్టీ సౌహార్ద్ర ప్రతినిధి డీఎంపీ దిశానాయకే

విశాలాంధ్ర- గురుదాస్ దాస్ గుప్తా నగర్ (విజయవాడ) : సీపీఐ జాతీయ మహాసభలు తమకెప్పుడూ స్ఫూర్తినిస్తాయని శ్రీలంక కమ్యూనిస్టు పార్టీ సౌహార్ద్ర ప్రతినిధి డీఎంపీ దిశానాయకే అన్నారు. ఆదివారం జరిగిన ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడుతూ, దక్షిణాసియా ప్రజల మధ్య మరింత సాన్నిహిత్యం, ఐక్యత అవసరమని నొక్కిచెప్పారు. వామపక్ష ఐక్యతకు శ్రీలంక కమ్యూనిస్టు పార్టీ (సీపీఎస్ఎల్) చేయగలిగినంతా చేస్తున్నట్లు వెల్లడించారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చందన విజేకూన్, పొలిట్ బ్యూరో సభ్యులు ప్రేమదారా దిశానాయకేల తరఫున భారత కమ్యూనిస్టు పార్టీకి అభినందనలు తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ, శ్రీలంక కమ్యూనిస్టు పార్టీల వ్యవస్థాపకుల మధ్య బంధం విద్యార్థి దశ నుంచే ఉన్నదని గుర్తుచేశారు. అంతర్జాతీయ సమస్యలు, కోవిడ్ మహమ్మారి, ఆర్థిక వ్యవస్థ మందగమనం వంటి అంశాలను ప్రస్తావించారు. క్వాడ్, ఆకస్ (ఏయూకేయూఎస్) మధ్య తాజా రాజకీయ-సైనిక కూటములతో హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులను అమెరికా సృష్టించిందని అన్నారు. భారతదేశ ప్రభుత్వాల సహకారంతో ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పగలిగామని అందరికి తెలుసు. ఇందుకోసం శ్రీలంక చేసిన తీర్మానానికి ఐక్యరాజ్య సమితి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ తీర్మానం 1971 నుంచి శాసనంగా ఉంది. ప్రతిపాదిత అంతర్జాతీయ సదస్సు వాస్తవరూపం దాల్చలేదు. ఇందుకు అమెరికా అవరోధాలు సృష్టించడమే కారణం అని దిశానాయకే తెలిపారు. దీని వెనుక అసలు ఉద్దేశం తాజాగా ఇండో-పసిఫిక్ జియోపొలిటికల్ వ్యూహం ద్వారా స్పష్టమైందని అన్నారు. భారతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి శ్రీలంక ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారన్నారు. సీపీఐ 24వ మహాసభలతో స్పష్టమైన వైఖరితో ఉండటం అభినందనీయమని చెప్పారు. భారత కమ్యూనిస్టు పార్టీ, శ్రీలంక కమ్యూనిస్టు పార్టీ, భారతీయ కమ్యూనిస్టు ఉద్యమం వర్ధిల్లాలన్న నినాదాలతో ప్రసంగం ముగించారు.

సోషలిస్టు సమాజ ఆవిర్భావానికి రష్యా మద్దతు

ఆ దేశ కమ్యూనిస్టుపార్టీ నేత రోమన్‌కోనోనెన్‌కో

విశాలాంధ్ర-గురుదాస్ దాస్‌గుప్తా నగర్ (విజయవాడ): రష్యాలో సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలు మరింత పటిష్ఠమవ్వాల్సిన అవసరం ఉందని ఆ దేశ కమ్యూనిస్టుపార్టీ నేత రోమన్‌కోనోనెన్‌కో అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సోషలిస్టు సమాజ ఆవిర్భావానికి రష్యా ప్రజలు ఎల్లవేళలా మద్దతిస్తారన్నారు. ఈ విషయంలో రష్యా కమ్యూనిస్టుపార్టీ ఇతర దేశాలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. సీపీఐ జాతీయ మహాసభల్లో ఆదివారం ఆయన సౌహార్ద్ర సందేశమిస్తూ...సోవియట్ యూనియన్ సంక్షోభంలోకి వెళ్లి పతనమైందన్నారు. లేకుంటే నేడు అది ప్రపంచంలోనే అగ్రరాజ్యంగా వెలుగొందుతుండేదన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న యుద్ధాన్ని సమర్థించారు. ఈ యుద్ధం ద్వారా రష్యాలో ఉక్రెయిన్ విలీనమై సమగ్ర రష్యా ఆవిర్భవించబోతోందన్నారు.

ప్రపంచశాంతి లక్ష్యంగా వర్కర్స్ పార్టీ కృషి

కొరియా పార్టీ నేత చో హుయ్ చోల్

విశాలాంధ్ర-గురుదాస్ దాస్‌గుప్తా నగర్ (విజయవాడ): - ఎస్‌హెచ్ ఫాజిల్

ప్రపంచశాంతి, సౌభ్రాతృత్వాల కోసం కొరియా వర్కర్స్ పార్టీ కృషి చేస్తుందని ఆ దేశ పార్టీ నాయకులు చో హుయ్ చోల్ అన్నారు. సీపీఐ 24వ జాతీయ మహాసభల్లో ఆయన సౌహార్ద్ర సందేశమిస్తూ పేద ప్రజల పక్షాన నిలిచిన భారత కమ్యూనిస్టుపార్టీని అభినందిస్తూ, మహాసభలు జయప్రదం కావాలని ఆకాంక్షించారు. రెండు దేశాల మధ్య స్నేహ సహకారాలకు తమ పార్టీ కృషిని కొనసాగిస్తుందన్నారు. ప్రపంచదేశాల మధ్య శాంతియుత వాతావరణం, స్నేహ బాంధవ్యాలు నెలకొల్పేదిశగా ముందుకు సాగుతామన్నారు.

మహాసభలో మహిళా ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతున్న అనీ రాజా

సామ్రాజ్యవాద అరాచకాలకు ప్రజా పోరాటాలతోనే అడ్డుకట్ట

పలస్తీనా కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి అకీల్ మహమూద్ అహ్మద్ తుగోజ్

విశాలాంధ్ర- గురుదాస్ దాస్ గుప్తా నగర్ (విజయవాడ): - షాయిస్తా ఖానూమ్

ప్రస్తుతం కొనసాగుతున్న సామ్రాజ్యవాద అరాచకాలు, దురాక్రమణలకు ప్రజా పోరాటాలతోనే సమాధానం సాధ్యమని పలస్తీనా కమ్యూనిస్టు పార్టీ సౌహార్ద్ర ప్రతినిధి అకీల్ మహమూద్ అహ్మద్ తుగోజ్ అన్నారు. అమెరికా సామ్రాజ్యవాదం, పశ్చిమ పెట్టుబడిదారీ దేశాల అండతో అంతర్జాతీయ చట్టాలకు అతీతంగా ఇజ్రాయిల్ వ్యవహరిస్తోందని, తమ దేశాన్ని నాశనం చేస్తోందని సీపీఐ జాతీయ మహాసభల సందర్భంగా ఆదివారం నిర్వహించిన ప్రతినిధుల సభలో అకీల్ నొక్కిచెప్పారు. ఎనిమిదేళ్లకు పైగా పలస్తీనా శాంతి ప్రక్రియపై ప్రతిష్ఠంభన కొనసాగుతోందని చెప్పారు. ఇజ్రాయిల్ రెచ్చిపోతోందని, దండయాత్రలు చేస్తోందని, మారణహోమానికి పాల్పడుతోందని; జెరుసలేం, హెబ్రోన్ యువతను సైన్యం చంపేస్తుండటం బాధాకరమని చెప్పారు. ఈ ఏడాది ఇప్పటివరకు 180 మంది పలస్తీనీయన్లు హత్యలకు గురికాగా వారిలో అధికంగా పిల్లలు ఉన్నారని అన్నారు. ఐదువేల మంది జైళ్లలో ఉంటే వందలాది మంది విచారణకు కూడా నోచుకోకుండా అధికారిక నిర్బంధంలో మగ్గుతున్నారని, వారిలో 50 మంది ప్రస్తుతం నిరాహార దీక్షలో ఉన్నారని అకీల్ తెలిపారు. 2007 నుంచి ఇజ్రాయిల్ ఐదుసార్లు పలస్తీనాపై యుద్ధం చేసిందన్నారు. గాజా సర్వనాశనమైందని, వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని, ఇళ్లు, స్కూళ్లు, ఆసుపత్రులు ధ్వంసమయ్యాయని, వాటిలో ఐరాస స్కూళ్లు, కేంద్రాలూ ఉన్నాయని తెలిపారు. ఐరాసతో పాటు అంతర్జాతీయ సమాచారం కూడా ఇజ్రాయిల్ అరాచకాలను ఆపలేకపోవడం దురదృష్టకరమని అకీల్ అన్నారు. మానవ హక్కుల హరణ జరుగుతున్నా అంతర్జాతీయ చట్టాలు ఉల్లంఘనకు గురవుతున్నా అమెరికా, పశ్చిమ పెట్టుబడిదారీ దేశాల అండతో ఇజ్రాయిల్ తమ దేశంపై విరుచుకుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్, అరబ్ దేశాలు కూడా ఇజ్రాయిల్‌తో స్నేహ సంబంధాలను కలిగి ఉన్నాయని చెప్పారు. పలస్తీనా సమస్యకు పరిష్కారానికి వీలు లేకుండా ఇజ్రాయిల్ చేస్తోందని చెప్పారు. ఈ సమస్యకు పరిష్కారం ఉన్నదని తాము బలంగా నమ్ముతున్నట్లు అకీల్ తెలిపారు. సిరియా, ఇరాక్, లిబియా, అఫ్ఘనిస్తాన్, యెమన్ కూడా బాధిత దేశాలని చెప్పారు. ఆధిపత్యం-శాంతి ఒకచోట ఉండటం కుదరనిదని అకీల్ చెప్పారు. ప్రజా ఉద్యమాలు తక్షణావశ్యమని, వాటి ద్వారానే సామ్రాజ్యవాద దురాక్రమణలకు చెక్ పెట్టేందుకు వీలు ఉంటుందని అన్నారు. శాంతి-సుస్థిరత గల, సామాజిక న్యాయం, సామ్యవాద స్థాపన జరిగితే ప్రపంచ మారుతుందని అకీల్ మహమూద్ అహ్మద్ తుగోజ్ ఆకాంక్షించారు. వామపక్ష పార్టీలు వర్ధిల్లాలన్న నినాదంతో తన ప్రసంగాన్ని ముగించారు.

మార్క్సిజం, లెనినిజానికి మార్గదర్శి సీపీఐ

వియత్నాం సౌహార్ద్ర ప్రతినిధి లామ్ వాన్ మాన్

విశాలాంధ్ర- గురుదాస్ దాస్ గుప్తా నగర్ (విజయవాడ): లెనినిజం, మార్క్సిజానికి మార్గదర్శిగా సీపీఐ ఉందని వియత్నాం సౌహార్ద్ర ప్రతినిధి లామ్ వాన్ మాన్ అన్నారు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ సవాళ్లను అధిగమిస్తూ... శ్రామికులకు, రైతాంగానికి అండగా నిలుస్తూ వారి హక్కుల పరిరక్షణకు పాటుపడుతూ లెనినిజం, మార్క్సిజానికి కట్టుబడి దాదాపు వందేళ్లుగా నిస్వార్థ సేవలు అందిస్తున్న సీపీఐకి వియత్నాం ప్రజల తరఫున శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఆయన ఆదివారం విజయవాడ, గురుదాస్ దాస్ గుప్తా నగర్ (ఎస్ఎస్ కన్వెన్షన్)లో జరిగిన సీపీఐ ప్రతినిధుల సభలో మాట్లాడారు. వామపక్ష, ప్రజాస్వామిక, ప్రగతిశీల ఐక్యతకు సీపీఐ కసరత్తు శ్లాఘించదగిందని తెలిపారు. జాతీయ మహాసభల్లో జరిగే తీర్మానాల ద్వారా మరిన్ని గొప్ప విజయాలను సాధించగలరని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. వియత్నాం, భారత కమ్యూనిస్టు పార్టీల మధ్య సంఘీభావం, సహకారం మరింత పెరుగుతాయని కాంక్షిస్తూ తన ప్రసంగాన్ని లామ్ వాన్ మాన్ ముగించారు.

ప్రగతిశీల ప్రభుత్వాలపై దాడులు తగవు

పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ సౌహార్ద్ర ప్రతినిధి పెడ్రో మిగుల్

విశాలాంధ్ర- గురుదాస్ దాస్ గుప్తా నగర్ (విజయవాడ): 'ప్రపంచ దేశాల ప్రజలు, కార్మికులు ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు... పెట్టుబడిదారీవర్గ దోపిడీకి, అణచివేతకు, అరాచకాలకు బాధితులుగా మారుతున్నారు... మానవహక్కుల హరణ సర్వసాధారణమైంది... లక్షలాది మంది కనీస అవసరాలకూ నోచుకోవడం లేదు... ప్రజాస్వామ్యంపై దాడులు పేట్రేగిపోయాయి. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెరిగాయి... పర్యావరణపరంగా సమస్యలు ఎదురవుతున్నాయి. యుద్ధాన్ని ప్రోత్సహించే పరిస్థితులు నెలకొన్నాయి' అంటూ పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ సౌహార్ద్ర ప్రతినిధి పెడ్రో మిగుల్ తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ 24వ జాతీయ మహాసభల క్రమంలో ఆదివారం విజయవాడ, గురుదాస్ దాస్ గుప్తా నగర్‌లో నిర్వహించిన ప్రతినిధుల సభలో మిగుల్ మాట్లాడారు. నాటో, యూరోపియన్ యూనియన్ వ్యూహాత్మక దాడులు, విధానపరమైన బెదిరింపులు, ఆంక్షలకు అడ్డుకట్ట వేయడం తక్షణావశ్యమని అన్నారు. ఆధిపత్యమే అజెండాగా ఆయా సంస్థలు పని చేస్తున్నాయని విమర్శించారు. ఏయూకేయూఎస్, క్వాడ్ భాగస్వామ్యాలు కూడా ఆసియా-పసిఫిక్ ప్రాంతాల్లో సైనికీకరణను ప్రోత్సహించేందుకే అని వ్యాఖ్యానించారు. ప్రపంచంలోని ప్రగతిశీల ప్రభుత్వాలపై దాడులు జరుగుతున్నాయని తెలిపారు. తమ సామాజిక, ఆర్థిక వాస్తవికత పరిస్థితులు ఎలా ఉన్నాగానీ అమెరికా శాశించే ప్రపంచాన్ని అన్ని దేశాలు తిరస్కరిస్తున్నాయని మిగుల్ నొక్కిచెప్పారు. సామ్రాజ్యవాదం ద్వారా దేశాల సార్వభౌమాభివృద్ధిని అడ్డుకోనే ప్రయత్నాలు ప్రస్తుతం స్పష్టమవుతున్నాయని అన్నారు. రష్యాపై యుద్ధానికి ఉక్రెయిన్‌ను అస్త్రంగా అమెరికా మలుచుకుందని, సామ్రాజ్యవాద దేశాలు కూడా అదే బాటను అనుసరిస్తూ చైనాను లక్ష్యంగా చేసుకుంటున్నాయని మిగుల్ అభిప్రాయపడ్డారు. తీవ్రమైన అంతర్జాతీయ పరిస్థితులు ప్రజల ఐక్యత, సంఘీభావాన్ని డిమాండు చేస్తున్నాయన్నారు. ఇందుకోసం పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ కట్టుబడి ఉందని, అంతర్జాతీయ సమాజాన్ని, విప్లవోద్యమాన్ని బలోపేతానికి నిబద్ధతతో ఉన్నదని, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి ఎల్లప్పుడూ సంసిద్ధమేనని, శాంతి-సుస్థిరతలతో మానవాళి సామాజిక పురోగతికి తమ వంతు కృషిచేస్తున్నదని మిగుల్ తెలిపారు.

కేరళ రాష్ట్రం కొల్లం జిల్లాకు చెందిన 13 మంది కళాకారులు కార్పొరేట్ శక్తుల చేతిలో మోదీ కీలుబొమ్మగా మారిన విధానాన్ని మూకాభినయం కళారూపం ద్వారా ప్రతినిధుల సభలో ప్రదర్శించారు.

దళితులపై దాడులను నిరసిస్తూ

5న ఢిల్లీలో సదస్సు

బీకేఎంయూ జాతీయ సమితి వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ, వామపక్ష వ్యవసాయ కార్మిక, దళిత సంఘాల అధ్వర్యంలో నవంబర్ 5న ఢిల్లీలో పెద్ద ఎత్తున సదస్సు నిర్వహించాలని భారతీయ కేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ సమితి నిర్ణయించింది. విజయవాడ గురుదాస్ దాస్ గుప్తా ప్రాంగణం (ఎస్ఎస్ కన్వెన్షన్)లో ఆదివారం బీకేఎంయూ జాతీయ అధ్యక్షుడు పెరియా స్వామి అధ్యక్షతన సమావేశం జరిగింది. వివిధ రాష్ట్రాల నుంచి బీకేఎంయూ పూర్వపు ప్రధాన కార్యదర్శి నాగేంద్రనాథ్ ఓఝా, జాతీయ ప్రధాన కార్యదర్శి గుల్జార్ సింగ్ గోరియా, జాతీయ ఆఫీస్ బేరర్లు జల్లి విల్సన్, రామమూర్తి, జానకి పాస్వాన్, ఫూల్ చంద్ యాదవ్, కృష్ణన్, ఇస్మాయిల్, దరియాసింగ్ తపన్ గంగూలీ, వివిస్ నిర్మల్ హాజరయ్యారు. వివరాలను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లివిల్సన్, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ వెల్లడించారు. మోదీ అధికారంలోకి వచ్చిన ఎనిమిదేళ్లల్లో దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు, పెరిగిపోతున్నాయని, వారికి రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమైందంటూ సమావేశం అభిప్రాయం వ్యక్తం చేసిందన్నారు.

నవంబర్ 5న ఢిల్లీలో జరిగే సదస్సులో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమాన్ని రూపొందించాలని సమితి నిర్ణయించిందని వివరించారు. ఇటీవల ఏపీ ప్రభుత్వం పేదల స్వాధీనంలో ఉన్న అసైన్డ్ భూముల విక్రయానికి మంత్రివర్గంతో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించడాన్ని సమావేశం తీవ్రంగా తప్పు పట్టిందన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.



“అవసరం స్పృహలోకి వచ్చే వరకు గుడ్డిది. స్వేచ్ఛ అనేది అవసరం యొక్క స్పృహ.”

కారల్ మార్క్స్

CPI 24th PARTY CONGRESS 2022 October 14-18 VIJAYAWADA

సీపీఐ 24వ జాతీయ మహాసభలు

అక్టోబర్ 14-18, 2022 విజయవాడ

కళాకారులను అందించిన ఘనత

ప్రజానాట్యమండలిదే

సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ

విశాలాంధ్ర-విజయవాడ: రాబోయే రోజుల్లో దిల్లీ ఎర్రకోటపై ఎర్రజెండా ఎగురుతుందన్న నమ్మకం తనకు ఉందని సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. సీపీఐ 24వ జాతీయ మహాసభల సందర్భంగా నాలుగో రోజైన ఆదివారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. హనుమంతరాయ గ్రంథాలయంలో ఏపీ ప్రజానాట్య మండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తమ్మారెడ్డి మాట్లాడుతూ, అనేక మంది కళాకారులను సినీ రంగానికి అందించిన ఘనత ప్రజానాట్య మండలిదే అన్నారు. కళాకారులను, కళారూపాలను అందించిన ప్రజానాట్య మండలికి కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ సహకారం అందిస్తోందన్నారు. సినీ మాటల రచయిత, నటుడు సంజీవి మాట్లాడుతూ, ‘ఎవడు రా... కూసింది కమ్యూనిజం చచ్చిందని...’ అన్న సినారె గీతం శుక్రవారం జరిగిన మహాప్రదర్శనలో ఎర్ర సముద్రాన్ని చూస్తే తెలుస్తుందన్నారు. ప్రజానాట్య మండలికి ఒక మంచి నాటికను, నాటకాన్ని రచించి అందిస్తానని హామి ఇచ్చారు. తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్ ప్రసంగించారు. ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ఏపీ ప్రజానాట్య మండలి అధ్యక్షుడు చంద్రానాయక్, ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య పాల్గొన్నారు. ఏపీ ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురప్ప వందన సమర్పణ చేశారు.

ఆలోచింపజేసిన కళాప్రదర్శనలు

ప్రజానాట్య మండలి కర్నూలు జిల్లా అధ్యక్షుడు నాగరాజు, డ్యాన్స్ మాస్టర్ కరీముల్లా ఆధ్వర్యంలో కళాకారులు, చిన్నారులు ‘పాడవోయి భారతీయుడా’ పాటకు చేసిన నృత్య ప్రదర్శన అలరించింది. విజయవాడ నగర ప్రజానాట్యమండలి ‘మనుషులంతా ఒక్కటే (మైమ్) ప్రదర్శన ఆలోచింపజేసింది. కుల, మతాలు లేవని, భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ గొప్పతనం అని, అభ్యుదయ సమాజం కోసం అంటూ ఈ ప్రదర్శన సాగింది. లంకా దుర్గారావు దర్శకత్వంలో ప్రదర్శించిన మైమ్ కళారూపంలో కళాకారులు డి.సూరిబాబు, ఎస్కే నజీర్, కేవీ భాస్కరరావు, కాళ్ల చిన్నప్ప, ఎస్.రాము ఉన్నారు. ప్రకాశం జిల్లా ప్రజానాట్య మండలి కళాకారుల ‘రాజకీయ భాగోతం’ నృత్య గేయనాటిక విశేషంగా ఆకట్టుకుంది. సమాజంలోని రాజకీయ పరిస్థితులను కళ్లకుకట్టారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.రామకృష్ణ, అంజయ్య పర్యవేక్షణలో ఈ ప్రదర్శన జరిగింది. గాయకులు చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, వెంకటరాముడు, ఆర్.రామారావు, సి.రవి, మారెళ్ల శ్రీనివాసులు ప్రజా ఉద్యమ గేయాలను ఆలపించారు.

సీపీఐ 24వ మహాసభల సందర్భంగా ఎస్ఎస్.కన్వెన్షన్‌లో జరుగుతున్న ప్రతినిధుల సభా వేదిక వద్ద ప్రదర్శించిన కళా రూపాలు ఆకట్టుకున్నాయి. కేరళ వారిచే కార్పొరేట్ విధానంపై ప్రదర్శించిన నాటకం ఆకట్టుకుంది. తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె.నరసింహా దళం కామ్రేడ్ చంద్రరాజేశ్వరరావు జీవితచిత్ర ఆధారంగా రూపొందించిన ఒగ్గుకథ అలరించింది.

నేటి సాంస్కృతిక కార్యక్రమాలు

హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం తెలంగాణ ప్రజానాట్య మండలి ‘వీర తెలంగాణ’ ఒగ్గు కథ... గుంటూరు జిల్లా అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారిచే ‘ఓం హాం...ఓ హం...’ నాటిక ప్రదర్శించబడుతుంది. రచన వల్లూరు శివప్రసాద్, దర్శకత్వం గంగోత్రి సాయి.

బొమ్మను చేసి.. ప్రాణము పోసి...

విశాలాంధ్ర-గురుదాస్ దాస్‌గుప్తా నగర్ (విజయవాడ): సీపీఐ 24వ జాతీయ మహాసభలు.. కాన్ఫరెన్స్ హాల్ కిటకిటలాడుతోంది. ప్రాంగణం మొదట్లో ఇంతెత్తున పెట్టిన అమరవీరుల స్థూపం, దాని ముందుంచిన నాలుగైదు బొమ్మలు అందర్నీ ఆకట్టుకుంటున్నాయి. తలెత్తి చూసేలా చేస్తున్నాయి. ఈ స్థూపం పెద్ద ఫొటోస్పాట్ అయింది. ప్రతినిధుల ఆట పాటలకు, ఫోటో సెషన్‌కు నెలవైంది. మొత్తం మీద అక్కడ హడావిడి అంతాఇంతా కాకుండా ఉంది.

భారతీయత ఆత్మ- భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకకు అద్దం పట్టేలా ఎన్నెన్నో వేష భాషలు... అందరి చేతుల్లో సాధారణంగా కనిపించే సెల్‌ఫోన్లు... కామ్రేడ్, వీలయితే ఒక్కఫోటో... కాదంటే ఓ సెల్ఫీ.. ఈ బొమ్మల వద్ద పెద్ద నాయకులతో ఫోటోల కోసం ప్రతినిధుల వినతులు.. అడ్డుకునే వారు ఎవరూలేకపోవడంతో ఫోటో సెషన్స్ నిరాటంకంగా సాగిపోతున్నాయి.

ఈ బొమ్మల్ని చేయి తిరిగిన ఆర్టిస్ట్ శ్రీరాం తయారుచేశారు. సీపీఐ మహాసభల్లో 15 అడుగుల ఎత్తున అమరవీరుల స్థూపం, దానిపైన సుత్తీ కొడవలి, ఆపైన ఎగురుతున్న ఎర్రజెండా... పిడికిలి బిగించి సమర శంఖం పూరిస్తూ ఎర్రచొక్కా వేసుకున్న కార్మికుని బొమ్మ మాక్సింగోర్కీ అమ్మ నవల్లోని కార్మికనాయకుడు పావెల్‌ను గుర్తుకుతెస్తుంది. ఓ రైతు నాగలి చేతపట్టి పోరుకు గుడ్లురుముతున్న బొమ్మైతే మరింత ఆకర్షణీయంగా ఉంది. ఇలా ఆయన తయారు చేసిన నాలుగైదు బొమ్మలు దేనికదే సాటనిపించాయి. గతంలో సీపీఎం జాతీయ, రాష్ట్ర మహాసభలకు కూడా ఆయన విగ్రహాలు తయారు చేశారు. శ్రీరాం లాంటి ఆర్టిస్టుల చేతుల్లో మట్టి మాణిక్యం అవుతుంది, అగ్నికిరీటం అవుతుంది, ఎగరేసిన ఎర్రని జెండాగా నిలుస్తుంది. వ్యధార్త జీవిత యధార్థ దృశ్యానికి అద్దం పడుతుంది. అందుకే అంటారు ఒక బొమ్మ వేయి పదాల పెట్టని.. ఆ పనిని శ్రీరాం ఈ మహాసభలో విజయవంతంగా పూర్తి చేశారు.

వర్షంలోనూ మొక్కవోని దీక్ష

సీపీఐ మహాసభల్లో జనసేవాదళ్ నిరంతర సేవ

అమరవీరుల జ్యోతి దగ్గర జోరువానలో తడుస్తూ బాధ్యతలు నిర్వహిస్తున్న కర్నూలు జిల్లా కోడుమూరు ఏఐఎస్ఎఫ్ నాయకుడు చిన మధు, నంద్యాల జిల్లా బనగానపల్లి ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఎర్రి స్వామి

మహాసభ ప్రాంగణంలో జోరువానలో తడుస్తూ అడుగు కదపకుండా విధులు నిర్వహిస్తున్న ప్రకాశం జిల్లా ఏఐఎస్ఎఫ్ నాయకులు సీహెచ్ లక్ష్మారెడ్డి, ఎస్.రామాంజనేయులు

వృద్ధుల సేవలో రెడ్ షర్ట్ వలంటీర్

విశాలాంధ్ర-గురుదాస్ దాస్‌గుప్తా నగర్ (విజయవాడ): ఎండా, వాన, ఆకలి, దప్పిక అన్నీ వారికి అప్పగించిన పనిచేయాలన్న లక్ష్యం ముందు దిగదుడుపే. వృద్ధులకు అవసరమైన సేవలు అందించడం, ప్రతినిధులకు అడిగిన సమాచారం అందజేయడం, ఇబ్బందులు లేకుండా వారు తమ స్థానాలకు వెళ్లి కూర్చోవడం, మందులు అందించడం ఇలా అన్ని రకాల బాధ్యతలు నిర్వర్తించడంలో ఆ యువ కామ్రేడ్‌లు అహోరాత్రులు శ్రమిస్తున్నారు. ఈ కర్తవ్య నిర్వహణలో అన్న పానాదులు కూడా వారికి లెక్కలేదు. ఈ మహత్కార్యంలో తాము భాగస్వాములమయ్యామన్న తృప్తితో వారు కంటిమీద కునుకు లేకుండా శ్రమిస్తున్నారు. ఇక్కడ జరుగుతున్న సీపీఐ 24వ జాతీయ మహాసభలలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా 130 మంది జనసేవాదళ్ కార్యకర్తలు మొక్కవోని దీక్షతో శ్రమిస్తున్నారు. వీరిలో వంద మంది ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన వారు కాగా, 30 మంది తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు. వీరిలో యువతులు కూడా ఉన్నారు. ఏదైనా రాజకీయ పార్టీ ప్రధానమైన సమావేశాలు జరిగి నప్పుడు, జాతీయ, అంతర్జాతీయ నాయకులు వచ్చినప్పుడు పోలీసు బందోబస్తు సాధారణంగా ఉంటుంది. రాకపోకలకు అంతరాయం కలుగుతుం టుంది. కానీ, విజయవాడలో రద్దీగా ఉండే మహాత్మాగాంధీ రోడ్డులో ఉన్న ఎస్ఎస్ కల్యాణ మండపంలో జరుగుతున్న సీపీఐ జాతీయ మహాసభల ప్రాంతంలో ఒక్క పోలీసు కూడా కనిపించరు. నిత్యం తిరిగే వాహనాలతో పాటు పార్టీ నాయకులు, విదేశీ ప్రతినిధులు, కేరళ నుంచి వచ్చిన మంత్రులు, పార్టీ ప్రజాప్రతినిధులు, మహాసభల నిర్వాహణకు వినియోగించే వాహనాలు అధికంగా తిరుగుతున్నా ట్రాఫిక్‌కు ఏమాత్రం అంతరాయం కలగడంలేదు. ఇందుకు జనసేవాదళ్ కార్యకర్తల క్రమశిక్షణాయుత చర్యలేకారణం. మహాసభ జరిగే గురుదాస్ దాంగుప్తా నగర్‌లో వారు అందిస్తున్న సేవలు అద్వితీయం. మెయిన్ గేటు, మీటింగ్ హాల్ వద్ద, అమర వీరుల స్థూపం వద్ద, భోజనశాల వద్ద ఎటువంటి రద్దీలేకుండా అందరినీ క్రమపద్ధతిలో లోపలికి పంపిస్తున్నారు. మహాసభలు జరిగే రోడ్డులో ట్రాఫిక్ మూడు రోజులలో కొన్ని నిమిషాలు కూడా ఆగలేదంటే జనసేవాదళ్ కార్యకర్తల కఠోర శ్రమేనని చెప్పకతప్పదు. మహాసభల ప్రారంభ రోజు నుంచి జోరువాన కురుస్తూ ఆగుతూ ఎండ మండుతూ జనసేవాదళ్ కార్యకర్తల సహనాన్ని పరీక్షిస్తోంది. అయినా వారు తమకు డ్యూటీ వేసిన చోట నుంచి కదలకుండా కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నారు. వృద్ధులకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నారు. భాషతో సమస్య ఉన్న వారికి ఆ ఇబ్బంది తీరుస్తున్నారు. ప్రతినిధులు కుర్చీ నుంచి లేవకుండా మంచినీరు, ఇతరాలు వారి దగ్గరికే తీసుకువచ్చి అందిస్తున్నారు. భోజనం, టిఫిన్ సందర్భంలో ఎటువంటి ఇబ్బందులు, రద్దీ తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. వీరు అందిస్తున్న సేవలను ప్రతినిధులే కాకుండా ఆ మార్గంలో వెళ్లే వారు కూడా ప్రశంసిస్తున్నారు.

ఉద్యమాలు సంతృప్తినిచ్చాయి

సాంస్కృతిక ఉద్యమానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. సాంస్కృతిక రంగంలోని అన్ని ప్రజా సంఘాలు, ప్రజాతంత్ర, ప్రగతిశీల వాదులందరూ ఒకే వేదిక మీదకు వచ్చినట్లయితే, వామపక్ష భావజాలాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్ళి అభివృద్ధి నిరోధకులకు కళ్లెం వేయగలుగుతాము. అందుకోసం కమ్యూనిస్టు పార్టీ, ప్రజానాట్యమండలి విశేష కృషి చేయాలి.

(సీపీఐ సీనియర్ నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థి, యువజన, నిర్మాతల్లో ఒకరు, ఇప్టా ఉపాధ్యక్షులు కందిమళ్ల ప్రతాపరెడ్డితో ఇంటర్వ్యూ)

సీనియర్ జర్నలిస్ట్ ఎస్‌కె.బాబు



ప్రశ్న: కమ్యూనిస్టుపార్టీలోకి ఎప్పుడు వచ్చారు? మీకు స్ఫూర్తి కలిగించింది ఎవరు?

సమాధానం: నేను తొలుత బాల సంఘంలో చేరి పనిచేశాను. మా స్వగ్రామం నల్గొండ తాలూకా జొన్నలగడ్డ. నేను ప్రైవేటు స్కూల్లో 10వ తరగతి వరకూ చదువుకొన్నాను. అయితే టైఫాయిడ్ జ్వరం రావడంతో 10వ తరగతి పరీక్షలు రాయలేకపోయాను. విద్యార్థిగా ఉండగానే రజాకార్లకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచడానికి మా గ్రామాల్లోకి దళాలు వచ్చేవి. వారి స్ఫూర్తితో మా ఊళ్లో ఉన్న ఒక పెద్ద చెట్టెక్కి జాతీయ జెండా కట్టాను. ఆనాడు నల్గొండజిల్లా సీపీఐ కార్యదర్శిగా వున్న కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం నాకు కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం ఇచ్చారు.

ప్రశ్న: తెలంగాణ సాయుధ పోరాటంలో పాత్ర వున్నవారిలో మీరొకరు. ఆ జ్ఞాపకాలు క్లుప్తంగా చెప్పండి

సమాధానం: 1947 సెప్టెంబరు 9న నిజాం రజాకార్లు, దొరల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటానికి పిలుపిచ్చింది. మా గ్రామంలోకి నాలుగు దళాలు వచ్చాయి. మొదటి దళానికి పన్నాల రాంరెడ్డి, రెండవ దళానికి లంకల వెంకటరెడ్డి, మూడవ దళానికి ఎల్లమంద నేతృత్వం వహించారు. నాల్గవది ‘యాక్షన్’ దళం. దళాల సభ్యులకు గ్రామంలోని ప్రతి ఇంటిలో ఒకరిద్దరికి భోజనం ఏర్పాటు చేసేవాళ్ళం. నేనుకూడా దళాలలో చేరడానికి ఉత్సుకత చూపేవాడిని. అయితే, అప్పటికి నాకు 14 యేళ్ళే అవడంతో దళ నాయకులు అందుకు అంగీకరించలేదు. కొరియర్‌గా పనిచేయమని, ఎప్పటికప్పుడు సమాచారం అదించమని వారు చెప్పారు. నల్గొండలో ఒక రూం తీసుకొని 1947 అక్టోబరు, నవంబరు వరకు కొరియర్‌గా పని చేశాను. ప్రత్యక్షంగా సాయుధ పోరాటంలో పాల్గొనలేదు. 1952 నుండి 56 వరకు పార్టీ కార్యాలయమే నా కేరాఫ్ అడ్రసు. కేసులు మోపబడిన బాధిత పార్టీ కార్యకర్తలను పార్టీకి చెందిన న్యాయవాదులతో కలిసి కోర్టుకు తీసుకెళ్ళేవాళ్ళం.

ప్రశ్న: యువజనోద్యమ నిర్మాణంలో మీ అనుభవాలు?

సమాధానం: ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్, మఖ్దూం మొహియుద్దీన్ నేతృత్వంలో కామ్రేడ్స్ అసోసియేషన్ ఉండేవి. మేము లీగ్ ఆఫ్ యూత్ అని ఒక సంస్థను పెట్టాము. 1969 వరకు దానికి నేను కార్యదర్శిగా పనిచేశాను. ఆ సంస్థలన్నీ విద్యార్థి సమాఖ్యకు అనుబంధ సంస్థలుగా మారాయి. 1952 నుండి 57 వరకు విద్యార్థి ఫెడరేషన్, పార్టీ కార్యక్రమాల్లో పనిచేశాను. ఆ తరువాత హైదరాబాద్‌కు వెళ్ళాను. 1962లో విజయవాడలో యువజన సమాఖ్య రాష్ట్ర మహాసభ జరిగింది. తమ్మారెడ్డి సత్యనారాయణ అధ్యక్షుడిగా, జి.వి.నారాయణరావు కార్యదర్శిగా ఎన్నికయ్యారు. నేనూ, కొల్లి నాగేశ్వరరావు సహాయ కార్యదర్శులుగా, చలసాని వెంకటరత్నం ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యాము. 1966లో పుదుచ్చేరిలో విద్యార్థి, యువజన సమాఖ్యల సంయుక్త జాతీయ మహాసభలు జరిగాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి 150మంది ప్రతినిధులం వెళ్ళాము. ఆ మహాసభలో సి.కె.చంద్రప్పన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. నేను కార్యదర్శిగా ఎన్నికయ్యాను. విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడిగా సురవరం సుధాకరరెడ్డి ఎన్నికయ్యారు. అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో 18 సంవత్సరాలకు ఓటింగు హక్కు, రాజభరణాలు రద్దు, బ్యాంకుల జాతీయకరణ డిమాండ్లతో ఉద్యమాలు నిర్వహించారు. ఆ తరువాత ఆ మూడు డిమాండ్లు సాధించబడ్డాయి. యువజన సమాఖ్య దేశంలో బలమైన శక్తిగా కమ్యూనిస్టు పార్టీకి జీవం పోసిందనడం అతిశయోక్తి కాబోదు. అప్పటివరకూ గుంటూరులో ఉన్న యువజన సమాఖ్య రాష్ట్ర కార్యాలయం 1966లో హైదరాబాదుకు మారింది. నేను ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరిం చాను. 1969లో మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకంగా రాష్ట్ర సమైక్యతను కాంక్షిస్తూ 5వేలమందితో విద్యార్థి, యువజన సమాఖ్య ప్రదర్శన జరిపాము. ఆ ప్రదర్శన అనేకమందిని ప్రభావితం చేసింది. 1971లో హైదరాబాద్‌లో రాష్ట్ర యువజన మహాసభ జరిగింది. 1500మంది ప్రతినిధులు హాజరయ్యారు. నల్లూరి వెంకటేశ్వర్లు అధ్యక్షుడిగా, నేను కార్యదర్శిగా ఎన్నికయ్యాము.

ప్రశ్న: ప్రజానాట్యమండలిలో మీది చాలా కీలకపాత్ర. ప్రజానాట్యమండలి సాంస్కృతిక రంగాన్ని ఏ మేరకు ప్రభావితం చేయగలిగింది?

సమాధానం: 1971లో కొచ్చిన్‌లో అఖిల భారత యువజన మహాసభకు పంజాబ్‌లోని వీర కిశోరం భగత్‌సింగ్ సమాధి వద్దనుండి కొచ్చిన్‌కు పార్టీ గేయాలతో ‘ఎర్రజెండా జైత్రయాత్ర’ సాగించాము. ఆ యాత్రకు అన్ని ప్రదేశాల్లో అపూర్వ స్వాగతం పలికారు. అప్పుడే ప్రజానాట్యమండలి ఏర్పాటు ఆలోచన వచ్చింది. 1973లో బెర్లిన్ ప్రపంచ యువజనోత్సవాలు జరిగాయి. ఆ సందర్భంగా అన్ని జిల్లాల్లో కమిటీలు ఏర్పడి యువజనోత్సవాలు నిర్వహించారు. హైదరాబాద్‌లో నాట్య ప్రదర్శనలు ఏర్పాటు చేశాము. ఆ సందర్భంగా చాలామందితో పరిచయాలు ఏర్పడ్డాయి. బెర్లిన్ ప్రపంచ యువజనోత్సవాలకు వెళ్ళిన నేను కొంతకాలం అక్కడే ఉండాల్సి వచ్చింది. హైదరాబాద్‌లో ఉన్న యువజన నాయకుడు పుల్లారెడ్డితో మాట్లాడి, విజయవాడలోని రైల్వే ఇనిస్టిట్యూట్‌లో ప్రజా నాట్యమండలి పునరుద్ధరణ ప్రథమ మహాసభకు ఏర్పాటు చేయించాను. ఆ మహాసభలో నల్లూరి వెంకటేశ్వర్లు కార్యదర్శిగా, సినీ నటుడు సి.నాగభూషణం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ తరువాత ఆగ్రాలో జరిగిన కన్వెన్షన్ ఆధారంగా 1986లో ‘ఇప్టా’ ఏర్పాటు హైదరాబాద్‌లో జరిగింది. మంచి ఉద్యమాలలో పాత్రధారి కావడం నాకు సంతృప్తినిచ్చింది.

ప్రశ్న: ప్రస్తుత సాంస్కృతిక రంగం మీద మీ అంచనా?

సమాధానం: సాంస్కృతిక ఉద్యమానికి చాలా ప్రాధాన్యత ఉన్నది. ప్రజలను అది ఎంతో ప్రభావితం చేస్తుంది. పార్టీ ఉద్యమంలోగానీ, బయటగానీ ఎందరో కళాకారులు ఉన్నారు. వారందరినీ ఒక వేదికమీదకు తీసుకు రాలేకపోవటం వల్ల ప్రగతిశీల భావజాలాన్ని ప్రజలకు చెప్పలేకపోతున్నాము. ప్రజానాట్యమండలిని విస్తృతపర్చి వివిధ కళారూపాలతో ప్రజా బాహుళ్యంలోకి తీసుకువెళ్ళి ప్రజలను చైతన్యపరచాలి.

అమెరికా ఆంక్షలను తిప్పికొడతాం

క్యూబా కమ్యూనిస్టుపార్టీ నేత అలెగ్జాండిరియో సిమాన్‌కాస్ మారిన్

విశాలాంధ్ర-గురుదాస్ దాస్‌గుప్తా నగర్ (విజయవాడ): క్యూబాపై అమెరికా సాగిస్తున్న ఆర్థిక దిగ్బంధాలను, ఆంక్షలను తిప్పికొడతామని క్యూబా కమ్యూనిస్టుపార్టీ నాయకులు అలెగ్జాండిరియో సిమాన్‌కాస్ మారిన్ స్పష్టం చేశారు. ఆర్థిక ఆంక్షలతో అష్టదిగ్బంధం చేసినా అమెరికాకు గుణపాఠం చెప్పేందుకు క్యూబా ప్రజానీకం ఎల్లవేళలా సంసిద్ధంగానే ఉంటుందన్నారు. అమెరికా నేర ప్రవృత్తిని ఎండగట్టడంలో ఏమాత్రం వెనుకాడబోమన్నారు. తమ దేశంపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఐక్యరాజ్యసమితి తమ వంతు పాత్రను పోషించాలన్నారు. సీపీఐ 24వ జాతీయ మహాసభల్లో ఆదివారం ఆయన సౌహార్ద్ర సందేశమిస్తూ ప్రపంచశాంతి కొరకు భారత్ కమ్యూనిస్టుపార్టీ చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. 1959 జూన్ మాసంలోనే భారత్-క్యూబా సంబంధాలు ప్రారంభమయ్యాయని, ఫెడరల్ కాస్ట్రో నేతృత్వంలో ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడ్డాయన్నారు. తమ దేశంపై అమెరికా దమననీతిని ఖండిస్తూ, భారతదేశం సంఘీభావం తెలియజేయడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సోషలిస్టు సమాజ ఆవిర్భావానికి క్యూబా అవిశ్రాంత కృషి చేస్తుందని తెలిపారు. సామ్రాజ్యవాద శక్తులను అణగదొక్కేందుకు ప్రపంచ ప్రజల స్వేచ్ఛా వాయువుల కోసం క్యూబా తనదైన శైలిలో పాటుపడుతుందని అలెగ్జాండిరియో సిమాన్‌కాస్ మారిన్ అన్నారు.

యుద్ధం వద్దు... ప్రపంచ శాంతి ముద్దు

- షాయిస్తా ఖానూమ్

అమెరికా కమ్యూనిస్టు పార్టీ సౌహార్ద్ర ప్రతినిధి హిలే స్కాట్ జోసఫ్

విశాలాంధ్ర- గురుదాస్ దాస్ గుప్తా నగర్ (విజయవాడ): ప్రపంచ శాంతికి రాజకీయ శక్తులు, పార్టీలు ఏకం కావాలని అమెరికా కమ్యూనిస్టు పార్టీ (సీపీయూఎస్ఏ) సౌహార్ద్ర ప్రతినిధి హిలే స్కాట్ జోసఫ్ అన్నారు. గురుదాస్ దాస్ గుప్తా ప్రాంగణంలో ఆదివారం జరిగిన సీపీఐ ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడుతూ, యుద్ధం... ప్రచ్ఛన్నమే అయినాగానీ వ్యతిరేకించాలని సూచించారు. సామ్రాజ్య వాదంపై పోరాడాలని, వాతావరణ సంక్షోభానికి పరిష్కారాన్ని కనుగొనాలని పిలుపు నిచ్చారు. పెట్టుబడిదారీ వర్గం స్వార్థం, లాభాపేక్ష కారణంగానే కోవిడ్ మహమ్మారి చాలా కాలంగా కొనసాగుతోందని చెప్పారు. ప్రపంచ దేశాల్లో అనేకమంది అమాయకులు చనిపోయారని, అందుకోసం వాక్సిన్ సామ్రాజ్యవాదం కూడా కారణమేనన్నారు. ఈ దశలోనే అమెరికాలోని కార్మికవర్గ పోరాటాలు ఉధృతమయ్యాయని, మరిన్ని ఉద్యమాలను నిర్వహించనున్నామని చెప్పారు. 50 ఏళ్లుగా మహిళలకు ఉన్న గర్భవిచ్ఛిత్తి (అబార్షన్) హక్కును రద్దు చేయగా దానిని తిరిగి సాధించేందుకు సీపీయూఎస్ఏ అగ్రభాగన నిలిచి పోరాడుతోందని అన్నారు. తదుపరి ఎన్నికల్లో తమ కోసం పాటుపడే నేతలను ప్రజలు ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. మహిళా హక్కులపై దాడి అంటే అమెరికా జనాభాలో సగం మందిపై దాడి చేయడమే అని అన్నారు. దురదృష్టవశాత్తు అమెరికాలో మారణాయుధాలను సులువుగా పొందవచ్చు అని, తుపాకీ సంస్కృతి పోవాలని, అందుకోసం తమ వంతు కృషి చేస్తున్నామని చెప్పారు. కనీస వేతనాల క్రమంలో పేదరికం కొనసాగుతోందని, రెండు పడకగదుల ఇల్లు అద్దెకు తీసుకునే స్తోమత చాలా మందికి ఉండటం లేదని అన్నారు. విద్యార్థులకు రుణమాఫీని



సాధించగలిగామని, ఇది గొప్ప విజయం అని అన్నారు. సోషలిస్టు ఉద్యమం నుంచి మన రెండు పార్టీలు పుట్టాయని భారత కమ్యూనిస్టు పార్టీని ఉద్దేశించి ఆయనన్నారు. ఫ్యూడల్ వ్యవస్థపై వీరోచిత పోరాటం చేశారని సీపీఐను కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని ప్రస్తావించారు. పోరాటగడ్డ విజయవాడకు సెల్యూట్ చేస్తున్నామన్నారు. తొలి సార్వత్రిక ఎన్నిక నుంచే కేరళలో సీపీఐ మార్కు రాజకీయాలు కనిపించాయన్నారు. పశ్చిమ బెంగాల్, త్రిపురలో వామపక్ష కూటమి రాణించిందని, గొప్ప విజయాలు సాధించిందని గుర్తుచేశారు. పేదలకు భూ హక్కులు, కార్మిక సంఘాల సాధికారత, విద్యాహక్కుల విస్తరణ, సమానత్వం, శ్రామిక వర్గానికి అండదండలు వంటివి శ్లాఘించదగినవిగా వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో అద్భుత విజయం వరిస్తుందని సీపీయూఎస్ఏ ఆకాంక్షిస్తోందని స్కాట్ జోసఫ్ అన్నారు. ప్రగతిశీల, ప్రజాస్వామ్య, లౌకిక, సామాజిక రాజకీయ శక్తులు కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రాల్లో మంచి ఫలితాలు పొందగలవని ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. భూగోళానికి సైనిక-పారిశ్రామికపరమైన ముప్పు పొంచిఉందని, పీల్చే ప్రాణవాయువు అంతరిస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ వర్ధిల్లాలి, అంతర్జాతీయ కమ్యూనిస్టు సౌహార్ద్ర సంబంధాలు వర్ధిల్లాలి అంటూ నినాదాలిస్తూ తన ప్రసంగాన్ని స్కాట్ జోసఫ్ ముగించారు.

'డిఫెండింగ్ డెమోక్రసీ' పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-గురుదాస్ దాస్ గుప్తా ప్రాంగణం (విజయవాడ): దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడటంపై సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా రాసిన అనేక వ్యాసాలను 'డిఫెండింగ్ డెమోక్రసీ' పేరిట పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్ పుస్తక ంగా మలిచింది. ఈ పుస్తకాన్ని మహాసభల వేదికపై డి.రాజా, సీపీఐ జాతీయ కార్యదర్శులు రమేంద్ర కుమార్, బాలచంద్రన్ కాంగ్, సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి కన్నం రాజేంద్రన్ ఆవిష్కరించారు.

సీఆర్ జీవితంపై ఒగ్గుకథ

ప్రతినిధులను ఆకట్టుకున్న కళారూపం

విశాలాంధ్ర బ్యూరో - గురుదాస్‌దాస్ దాస్ గుప్తా నగర్ (విజయవాడ): సీపీఐ జాతీయ మహాసభల సందర్భంగా చంద్ర రాజేశ్వరరావు (సీఆర్) జీవితంపై ఒగ్గు కథను తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారులు ఆదివారం ప్రదర్శించారు. కృష్ణాజిల్లా మంగళా పురంలో పుట్టిన సీఆర్ విద్యాభ్యాసం అనంతరం ఉద్యమాలలో పాల్గొనడం, పార్టీ చీలిక నేపథ్యంలో సీపీఐ పార్టీ నిర్మాణం చేసిన తీరు, చల్లపల్లి భూ పోరాటం, లక్షలాది మంది పేదలకు భూపంపిణీ వంటివి ఒగ్గుకథ రూపంలో కళాకారులు వివరించారు. ఈ కళారూపానికి పల్లె నరసింహ కథకునిగా వ్యవహరించగా, లక్ష్మీనారాయణ, జగన్, మూగ రవి, గణేశ్, శ్రీనివాస్ ప్రదర్శనలో పాల్గొన్నారు. సీఆర్ జీవితంపై కళారూపం ప్రతినిధులను అమితంగా ఆకట్టుకుంది.

మరింత మెరుగ్గా భారత్-చైనా సంబంధాలు

సీపీఐ జాతీయ మహాసభల్లో చైనా ప్రతినిధి వర్గం వెల్లడి

విశాలాంధ్ర-గురుదాస్ దాస్‌గుప్తా నగర్ (విజయవాడ): భారత్‌తో తమ దేశానికి ఉన్న సంబంధాల మెరుగుదలకు చైనా కమ్యూనిస్టుపార్టీ శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని ఆ దేశ కమ్యూనిస్టుపార్టీ ప్రతినిధి వర్గం ప్రకటించింది. ఈ విషయంలో సీపీఐతోపాటు, ఇతర వామపక్ష లౌకిక పార్టీలతో కలిసి ముందుకు సాగుతామని తెలిపింది. ప్రస్తుతం జరుగుతున్న చైనా కమ్యూనిస్టుపార్టీ 20వ జాతీయ మహాసభల అనంతరం ఈ కృషిలో మరింత పటిష్ఠత కనిపిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. అత్యాధునిక సోషలిస్టు దేశంగా పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా (పి.ఆర్.సి) ఆవిర్భవించనున్నదని చైనా కమ్యూనిస్టుపార్టీ ప్రతినిధి వర్గం ప్రకటించింది. సీపీఐ జాతీయ మహాసభల్లో ఆ దేశ కమ్యూనిస్టుపార్టీ తరపున పంపిన లిఖిత పూర్వక సందేశాన్ని సీపీఐ జాతీయ నాయకులు పల్లపుసేన్ గుప్తా చదివి వినిపించారు. కొన్ని అనివార్య పరిస్థితుల కారణంగా ఆ సందేశాన్ని ఆ దేశ ప్రతినిధులు చదవడం లేదని ఆయన తెలిపారు. భారతదేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో సీపీఐ అమోఘ పాత్రను నిర్వహిస్తోందని కొనియాడారు. జాతీయ మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సీపీఐ పోరాటాలకు సంపూర్ణ మద్దతును ప్రకటించారు. చైనా కమ్యూనిస్టుపార్టీ మహాసభలు అతిత్వరలో జరుగనున్నాయని, ఆ మహాసభల్లో అత్యాధునిక సోషలిస్టు దేశంగా ఆవిర్భవించేందుకు ప్రణాళికల రూపకల్పన జరుగుతుందన్నారు. చైనా గణనీయ అభివృద్ధిని సాధించిందని, ప్రపంచ ఆర్థిక రంగంలో కీలకపాత్ర పోషిస్తోందన్నారు. మరే దేశాలకు అందనంత వేగంగా అభివృద్ధి రేటుతో దూసుకుపోతుందన్నారు. భారత్‌పై ప్రత్యేక శ్రద్ధతో చైనా కమ్యూనిస్టుపార్టీ ఎల్లవేళలా పనిచేస్తుందన్నారు.

'కార్పొరేట్ శక్తుల చేతిలో మోదీ కీలుబొమ్మ'

విశాలాంధ్ర బ్యూరో-గురుదాస్ దాస్ గుప్తా ప్రాంగణం: కేరళ రాష్ట్రం కొల్లం జిల్లాకు చెందిన 13 మంది కళాకారులు, దేశంలో కార్పొరేట్ శక్తులు మోదీ ప్రభుత్వాన్ని ఎనిమిదేళ్ల క్రితం ఎలా ప్రభావితం చేశాయో, గద్దెనెక్కిన తర్వాత కార్పొరేట్ శక్తుల చేతిలో మోదీ కీలుబొమ్మగా మారిన వైనాన్ని విధానాన్ని, మోదీ ప్రభుత్వాన్ని ఎలా పరిపాలన చేయాలో శాసిస్తున్న తీరును కళ్లకు కట్టినట్లు కళారూపం, మూకాభినయంను ప్రతినిధుల సభలో ప్రదర్శించారు. ఎన్నికలకు ముందు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని, ప్రతి ఇంటికి 15 లక్షలు నల్లధనాన్ని పంచుతానని, కోట్లాది మందికి ఉద్యోగాలు ఇప్పిస్తానన్న ప్రచారంతో గద్దెనెక్కిన మోదీని కార్పొరేట్ వ్యక్తులు తమ చెప్పుచేతల్లో పెట్టుకుని మూడు రైతు వ్యతిరేక చట్టాలు, కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకురావాలని, కార్పొరేట్‌ల రుణాలు మాఫీ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకం చేపట్టాలని, రైల్వే, ఇన్సూరెన్స్, రక్షణ రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించాలని చెప్పడం... దాన్ని మోదీ అమలు చేయడంతో దేశంలో నెలకొన్న పరిస్థితులు, పెరిగిన పన్నులు, నిరుద్యోగం, ఆకలి చావులపై దేశవ్యాప్తంగా కార్మికులు, రైతులు ఉద్యమిస్తున్న తీరును కళ్లకు కట్టినట్లు కళారూపం ద్వారా వివరించారు. ప్రతినిధులను అవి ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి కన్నం రాజేంద్రన్ ఆ కళాబృందాన్ని అభినందించారు.

పెట్టుబడిదారీ విధానాలపై రాజీలేని పోరు

ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీ నాయకురాలు లీ గౌరీరెక్ మెలిని

విశాలాంధ్ర-గురుదాస్ దాస్‌గుప్తా నగర్ (విజయవాడ): కమ్యూనిస్టులంతా ఐక్యమై ప్రపంచ పెట్టుబడిదారీ విధానాలపైన రాజీలేని పోరాటాలను నిర్వహించాలని ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీ నాయకురాలు లీ గౌరీరెక్ మెలిని మారీ పిలుపునిచ్చారు. పెట్టుబడిదారీ వ్యవస్థ వల్ల అనేక దేశాలు కుదేలవుతున్నాయని, కార్మికులు, పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. సీపీఐ జాతీయ మహాసభల్లో ఆదివారం ఆమె సౌహార్ద్ర సందేశమిస్తూ సీపీఐ మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఫ్రాన్స్, ఐరోపా దేశాల్లో ఆర్థిక దోపిడీ రోజురోజుకూ పెరిగిపోతోందన్నారు. వినాశనానికి పెట్టుబడిదారీ విధానం నిలయంగా మారుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణకు హాని కలగడమే కాకుండా పేదలు, మధ్యతరగతి ప్రజానీకానికి విద్యను, ఆహార భద్రతను దూరం చేస్తోందని విమర్శించారు.

మహాసభలకు మద్దుకూరి అశోక్ లక్ష విరాళం

విశాలాంధ్ర-నరసరావుపేట: నరసరావుపేట పట్టణ పరిధిలోని కోటప్పకొండ రోడ్డులో మద్దుకూరి ఫౌండేషన్ స్థాపించి సమాజ సేవతో పాటు, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయుడు మద్దుకూరి అశోక్ విజయవాడలో జరుగుతున్న సీపీఐ జాతీయ మహాసభల నిర్వహణకు లక్ష రూపాయల విరాళాన్ని అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ ముప్పాళ్ల నాగేశ్వరరావు, పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో అశోక్ కుమార్ లక్ష రూపాయల చెక్కును సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణకు అందజేశారు. జాతీయ మహాసభలకు ఇతోధికంగా విరాళం అందజేసిన అశోక్‌ను సీపీఐ నాయకులు అభినందించారు. అశోక్ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలలో సైంటిస్టుల విగ్రహాలను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో విజ్ఞానాభివృద్ధి ఎంతగానో కృషి చేశారు.

జాతీయ మహాసభల జయప్రదానికి మహారాష్ట్ర నాగపూర్‌కు చెందిన రాధేనాథ్ మిశ్రా, కౌమారాయం దేశ్‌పాండే రూ.50,000/- విరాళం సీపీఐ జాతీయ కార్యదర్శి డా॥ కె.నారాయణకు అందజేస్తున్న దృశ్యం

సామ్యవాదమే ప్రత్యామ్నాయం కావాలి

నేపాల్ కమ్యూనిస్టు పార్టీ ఉపాధ్యక్షుడు యుబా రాజ్

విశాలాంధ్ర-గురుదాస్ దాస్ గుప్తా నగర్ (విజయవాడ): పెట్టుబడిదారీ విధానం అంతానికి కంకణబద్ధులమవ్వాలని, దాని స్థానంలో సామాజిక- ఆర్థిక వ్యవస్థ 'సోషలిజం' స్థాపన జరగాలని నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (యూఎంఎల్) ఉపాధ్యక్షుడు యుబా రాజ్ జ్ఞావలి స్పష్టం చేశారు. సహకారం, శాంతి, ఆర్థికాభివృద్ధి, సామాజిక పురోగతికి మార్గం సుగమం కావాలని, సామ్యవాదం ద్వారానే సమాజంలో ప్రతి వర్గానికి హామీ లభిస్తుందని అన్నారు. కేపిటలిజానికి సోషలిజమే ప్రత్యామ్నాయం కావాలన్నారు. ఆదివారం విజయవాడ, గురుదాస్ దాస్ గుప్తా నగర్‌లో నిర్వహించిన సీపీఐ ప్రతినిధుల సభలో జ్ఞావలి సౌహార్ద్ర సందేశం ఇచ్చారు. దక్షిణాసియాలో శాంతి, సుసంపన్నం, సుస్థిరత, సంతోషానికి యూఎంఎల్, సీపీఐ తమ వంతు కృషి చేస్తున్నాయని, రెండు పార్టీల మధ్య సాన్నిహిత్యం, సహకారం మరింత పెరగాలని ఆకాంక్షించారు. నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (యూఎంఎల్) ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో విజయం సాధించిందని యుబా రాజ్ తెలిపారు. 34శాతం అంటే 6లక్షలకుపైగా ఓట్లు సాధించి రెండో అతిపెద్ద పార్టీగా నిలిచామని, ఈ విజయం ప్రజాస్వామ్యం, దేశ సార్వభౌమత్వం, మానవహక్కులు, శాంతి, ప్రజల ఆకాంక్షల గెలుపని తెలిపారు. మతోన్మాద, అవకాశవాద, క్రోని కేపిటలిస్టులపై విజయంగా అభివర్ణించారు. అన్ని వైపుల నుంచి ప్రతిఘాత శక్తులు ఘెరావ్ చేసినప్పటికీ విజేతలుగా నిలిచామన్నారు. నవంబరు 20 నుంచి జరగనున్న నేపాల్ పార్లమెంటరీ, ప్రావిన్షియల్ స్థాయి ఎన్నికల్లో గెలుపు కమ్యూనిస్టు పార్టీకి అనివార్యమని అన్నారు. సుసంపన్న, సుస్థిర, ప్రశాంత నేపాలే లక్ష్యంగా రాజకీయ, ఆర్థిక, సామాజిక పురోగతిపరంగా నూతన దశ-దిశకు కసరత్తులు చేస్తున్నామని చెప్పారు. పార్టీతో పాటు ప్రజల ఉజ్వల భవితవ్యానికి బాటలు వేస్తున్నామన్నారు. శ్రామికవర్గంపై పెట్టుబడిదారీ, నయాఉదారవాద దాడులు, కోవిడ్ మహమ్మారి క్రమంలో పెరిగిన ఆర్థిక, లింగ, భౌగోళిక అసమానతలు, అసాధారణ సమస్యలను ప్రస్తావించారు. దేశాల్లో విప్లవాలు, ఉద్యమాల ఆవశ్యతకను గుర్తుచేశారు. ది పీపుల్స్ మల్టీ-పార్టీ డెమొక్రసీ (పీడీపీ) సైద్ధాంతిక మార్గదర్శకత్వంలో నేపాలీ కమ్యూనిస్టు ఉద్యమం శాంతియుతంగా సాగుతోందన్నారు. నేపాల్ ప్రాథమిక వాస్తవిక నేపథ్య మార్క్సిజంలో నూతన పరిణామాల రూపమే పీఎండీ అని అన్నారు. మార్పును కోరుతున్న ఉద్యమగళాన్ని వినాలన్నారు. అణగారిన వర్గాలు, శ్రామికులు, మహిళలు, బాలికలు, పేదలపై ప్రత్యక్ష ప్రభావం చూపే విధానాల్లో మార్పులు తక్షణావశ్యమని నొక్కిచెప్పారు.



మతతత్వ శక్తులను తిప్పికొడతాం

బంగ్లాదేశ్ కమ్యూనిస్టునేత షా ఆలం

విశాలాంధ్ర-గురుదాస్ దాస్‌గుప్తా నగర్ (విజయవాడ): ఆసియా ఉపఖండంలో మతతత్వ శక్తుల కుట్రలను విచ్ఛిన్నం చేసేందుకు భారత కమ్యూనిస్టుపార్టీతో పాటు బంగ్లాదేశ్ కమ్యూనిస్టుపార్టీ, బంగ్లాదేశ్ వర్కర్స్ పార్టీ కలిసి పనిచేస్తాయని బంగ్లాదేశ్ కమ్యూనిస్టుపార్టీ అధ్యక్షుడు మహమ్మద్ షా ఆలం వెల్లడించారు. సీపీఐ 24వ జాతీయ మహాసభల్లో ఆదివారం ఉదయం ఆయన సందేశమిస్తూ... గత వందేళ్లుగా భారత కమ్యూనిస్టుపార్టీ నిర్వహించిన, నిర్వహిస్తున్న ప్రజా పోరాటాలను శ్లాఘించారు. కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య వంటి అతిరథ మహారథుల నేతృత్వంలో రాజీలేని పోరాటాలతో కమ్యూనిస్టుపార్టీ పునీతమైందన్నారు. అజరామర చరిత్ర కమ్యూనిస్టులకు ఉందన్నారు.

ఉపఖండంలో ప్రత్యేకించి భారత్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ తదితర దేశాలలో మతతత్వ శక్తులు పెచ్చరిల్లిపోతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. మతతత్వ రాజకీయాలు ఈ ప్రాంత ప్రజల్లో భయాన్ని రేకెత్తిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులు ఐక్యమై మతతత్వ శక్తులను తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. 'లాంగ్ లివ్ ది కమ్యూనిస్టు మూవ్‌మెంట్' అని నినదిస్తూ మహమ్మద్ షా ఆలం తన సందేశాన్ని ముగించారు.

కాస్ట్రో ఆశయ సాధనలో క్యూబా

సంఘీభావ సదస్సులో క్యూబా ప్రతినిధి అలెగ్జాండ్రో మారిన్

పలస్తీనాపై ఆగని ఇజ్రాయిల్ అరాచకాలు : అకీల్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సామ్రాజ్య వాదం వెళ్లనుకొని తమ పెత్తనం చెలాయిస్తున్న తరుణంలో, ప్రపంచ దేశాలు నివ్వెరపోయే విధంగా పోరాడి స్వేచ్ఛ సాధించిన క్యూబా ఇప్పటికీ సామ్యవాద సౌరభాలను గుబాళిస్తూనే ఉన్నదని రిపబ్లిక్ క్యూబా అధికార ప్రతినిధి అలెగ్జాండ్రో సిమాన్సాస్ మారిన్ చెప్పారు. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ మహాసభల సందర్భంగా ఆదివారం సాహిత్య, సాంస్కృతిక వేదిక, సంగమం ఏర్పాటు చేసిన సంఘీభావ సదస్సులో ఆయన మాట్లాడారు. పోరాటయోధుడు, స్వేచ్ఛా ప్రదాత ఫిడెల్ కాస్ట్రో ఆశయ సాధన దిశగా దేశాన్ని నడిపిస్తున్నామన్నారు. మాధ్యమాల దుష్ప్రచారానికి తావివ్వవద్దన్నారు. నెహ్రూ హయాం నుంచే భారత్‌తో క్యూబాకు స్నేహ సంబంధాలు ఉన్నాయని, ఇక్కడి వామపక్ష పార్టీలతోనూ స్నేహం ఉందని చెప్పారు. రాజకీయ, ఆర్థిక సహకారం ఉన్నదన్నారు. 64 ఏళ్లలో ఎంతో అభివృద్ధి సాధించడంతో నిజమైన సామ్యవాద విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు. అందరికీ సమానంగా ఉచిత విద్య, వైద్య సదుపాయాలను కల్పిస్తూ, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. కరోనా వల్ల

అభివృద్ధి వెనుకంజ వేసినా, తిరిగి నిలదొక్కుకుంటున్నామని మారిన్ అన్నారు. కరోనా సమయంలో తమకున్న బలమైన వైద్య రంగ నిపుణుల ద్వారా ఎన్నో దేశాలకు సహకారం అందించామని చెప్పారు. ప్రజల త్యాగాలతో సాధించిన రిపబ్లిక్ క్యూబా ప్రయోజనాలకు ఎక్కడా విఘాతం కలుగనివ్వబోమని, సామ్రాజ్య దేశాల దుష్టమీడియా ప్రచారాలను నమ్మవద్దని కోరారు. ప్రాశ్చాత్య సంస్కృతీ ప్రభావం ఉన్నదని, ఇతర దేశాలతో పోల్చితే, క్యూబాలో చాలా స్వల్పమని ఒక ప్రశ్నకు అయన సమాధానమిచ్చారు. వైద్యరంగంలో శాస్త్రీయ విజ్ఞానంతో పాటు నేచురోపతి, పంచకర్మ వంటి సాంప్రదాయ విధానాలను అవలంభిస్తున్నామని, వాటికోసం ఒక మంత్రిత్వ శాఖ ఉన్నదని మారిన్ చెప్పారు. పలస్తీనా ప్రతినిధి డాక్టర్ అకీల్ తక్విజ్ మాట్లాడుతూ, ఇజ్రాయిల్ ఆగడాలను పలస్తీనా ప్రజలు భరించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 47ఏళ్ల ఐక్యరాజ్య సమితి ఒప్పందాన్ని ఈసమంతైనా పట్టించుకోకుండా, సొంత దేశంలోనే శరణార్థులుగా బతుకులీడుస్తున్న వైనాన్ని తక్విజ్ తెలిపారు. ప్రతి చిన్న సమస్యపైనా స్పందించే అంతర్జాతీయ సమాజం పలస్తీనాపై ఎందుకు వివక్ష చూపుతుందో అవగతం కావడం లేదన్నారు. ఇజ్రాయిల్ గాజాలో రోజూ ఏదో ఒక నెపంతో వందలాది మంది ప్రాణాలు తీస్తోందని, చిన్నారులపై జాలి చూపడం లేదని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీలు బలహీనంగా ఉండటం వల్ల ఇజ్రాయిల్ ఆగడాలను ఎదుర్కొనే పరిస్థితి కరవైందని, వామపక్ష పార్టీల మధ్య చీలికల జాడ్యం తప్పడం లేదని ఆవేదన తెలిపారు. అంతర్జాతీయ సమాజం నుంచి, ముఖ్యంగా భారత్ వంటి ప్రజాస్వామ్య భావాలుగల దేశం నుంచి సానుభూతి, సహకారాన్ని పలస్తీనా ఆశిస్తున్నాదన్నారు. శ్రీలంక, పోర్చుగీస్, బంగ్లాదేశ్, గ్రీస్, దక్షిణాఫ్రికా ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు. డాక్టర్ అంజిరెడ్డి, డాక్టర్ జమిందార్ సంధానకర్తలుగా వ్యవహరించగా, దర్శకులు సి.ఉమామహేశ్వరరావు, పరిమి పాల్గొన్నారు.

స్థిరమైన సైద్ధాంతిక ఐక్యత అవశ్యం

సీపీఐ 24వ మహాసభ ముసాయిదా తీర్మానం

ఆర్ఎస్ఎస్, బీజేపీలకు వ్యతిరేకంగా స్థిరమైన సైద్ధాంతిక ఐక్యత, వామపక్షం వైపు మొగ్గుతో కూడిన వైఖరి అవసరమని, ఈ ఐక్యత సాధించేందుకు వామపక్షం చొరవ తీసుకోవాలని సీపీఐ 24వ మహాసభ ముసాయిదా రాజకీయ తీర్మానం స్పష్టీకరించింది.

బలమైన, సుస్థిరమైన ప్రతిపక్ష ఐక్యత లేకుండా పోవటానికి ప్రధాన సమస్యలు ఆర్థికం, సామాజికం రెండూను. సరళీకరణ ప్రవేశ పెట్టిన తదుపరి కాంగ్రెస్ సైద్ధాంతికంగా పొందికతనం, నిలకడతనం లేనిది అయింది. పీవీ నరసింహారావు ప్రధానమంత్రిత్వంలో బాబ్రీ మసీదు కూల్చివేత తదుపరి దాని లౌకిక అర్హతలు ప్రశ్నార్థకమైనాయి. సెక్యులరిజం సమస్యపై కాంగ్రెస్ వైఖరి స్పష్టంగా లేదు.

దాని నాయకత్వం సెక్యులరిజంపై రాజ్యాంగ వైఖరికి కట్టుబడి నిలబడే బదులు హిందూమతం, హిందూత్వపై చర్చలోకి దిగుతున్నది. ఆర్థిక రంగంలో కాంగ్రెస్, బీజేపీ రెండూ కూడా నయా ఉదారవాద సిద్ధాంతం అనుసరిస్తున్నాయి. దీంతో చర్చ మితవాదం వైపు మరలుతున్నది. ఆర్ఎస్ఎస్ బీజేపీలకు ఏ ప్రత్యామ్నాయ సంకీర్ణమైనా వాటినుండి కొట్టొచ్చినంత భిన్నంగా ఉండాలి. కాంగ్రెస్ పార్టీ దీన్ని గమనంలోకి తీసుకోవాలి. బీజేపీ దుందుడుకు నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ కనీసం నెహ్రూ ఆర్థిక వ్యవస్థ నమూనా, సోషలిస్టు తరహా సమాజం గూర్చి పునరాలోచించాలి. ప్రతిపక్ష పార్టీల మధ్య దృఢమైన అవగాహనకు రావటానికి ఈ సమస్యలను సైద్ధాంతికంగా చర్చించాలి.

బిజెపి జాతీయ ఆధిపత్య ఆకాంక్షలను భగ్నం చేసిన కొన్ని ప్రధానమైన శక్తులు ప్రాంతీయ పార్టీలు. తమిళనాడులో ద్రవిడ మున్నేత్ర కజగం లౌకిక, ప్రజాతంత్ర పార్టీలతో కూటమి పెట్టుకుని బీజేపీ కూటమిని ఓడించింది. బీహార్లో రాష్ట్రీయ జనతాదళ్ నాయకత్వంలోని కూటమి, బీజేపీ కూటమిని దాదాపు ఓడించే స్థితికి వచ్చింది.(ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఇటీవల బీజేపీతో కూటమిని వీడి ఆర్జేడీ కూటమితో కలవడంతో బీజేపీ ఏకాకి అయింది.

పశ్చిమబెంగాల్లో అధికారం కోసం ఎంతో అట్టహాసంగా బీజేపీ చేసిన ప్రయత్నాన్ని తృణమూల్ కాంగ్రెస్ తలకిందులు చేసింది. ఆంధ్రప్రదేశ్‌ను జగన్‌మోహన్‌రెడ్డి, తెలంగాణను కె.చంద్రశేఖరరావు పరిపాలిస్తున్నందున దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ ఉనికి పరిమితంగా ఉంది. బిజూ జనతాదళ్ ఒడిశాపై తనపట్టు బిగించింది. కాగా ప్రధాన ప్రతిపక్షపార్టీగా కాంగ్రెస్‌ను బీజేపీ తొలగించింది. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ప్రధాన ప్రత్యర్థిగా సమాజ్ వాది పార్టీ ఆవిర్భవించింది. ఆమ్‌ఆద్మీ పార్టీ దిల్లీ ఎన్నికల్లో అధికారం నిలుపుకుంది. ఇటీవల పంజాబ్‌ను గెలుచుకుంది. వారు కూడా జాతీయ ఆకాంక్షలు వ్యక్తం చేస్తున్నారు.

అత్యధిక ప్రాంతీయ పార్టీలతో ఉన్న ప్రధాన సమస్య మధ్యే మార్గం నుండి మితవాదంవైపు వాటి మొగ్గుదల, సామాజిక మితవాదం. అత్యధిక ప్రాంతీయ పార్టీలకు నయా ఉదారవాదం పట్ల కచ్చితమైన విమర్శ లేదు. అనేక పార్టీలు ద్రవ్య ఏజెన్సీల ఆదేశాలు పాటిస్తుంటాయి. విధానం, పరిపాలన విషయాల్లో అవి ఆర్థికపెట్టుబడి ప్రవాహంతో పాటు రాజకీయ కాంతిపుంజంపై మితవాదం వైపు మొగ్గుతున్నాయి. అవి నయా ఉదారవాదంపై సైద్ధాంతికంగా ఆధారపడటం... ఆర్థికరంగాన్ని గుత్త పెట్టుబడిదారులకు తెరుస్తున్నది. బీజేపీ ప్రత్యామ్నాయ నమూనాతో ముందుకు రావటానికి ప్రాంతీయ పార్టీలు రాజకీయ కాంతి పుంజం మధ్యస్థానం దిశగా ప్రయాణించాలి.

మత అర్హతలను బహిరంగంగా ప్రదర్శించటం, కుల ప్రాతిపదిక గల గ్రూపులపై ఆధారపడటం, ప్రత్యామ్నాయ అభివృద్ధి మార్గాలతో ముందుకు రావటానికి సంకోచించటం, కార్మిక హక్కులు చేర్చటానికి, భూ సంస్కరణలు చేపట్టేందుకు వెనుకంజ, కులాలమయమైన పిత్రు స్వామిక, దోపిడిదారీ సమాజ చట్రంలో సమూల మార్పులు తెచ్చేందుకు వెనకడుగు, ఆర్ఎస్ఎస్‌ను సామాజికంగా, సాంస్కృతికంగా ఎదుర్కోలేని అసమర్థత ... ఆర్ఎస్ఎస్ ప్రతిపాదిస్తున్న హిందూ ఇంగిత జ్ఞానానికి బలం చేకూర్చుతుంది. ఆర్ఎస్ఎస్ బీజేపీలను ఓడించేందుకు స్థిరమైన సైద్ధాంతిక ఐక్యతను సాధించటానికి ఈ సమస్యలపై దృష్టి సారించటం అత్యవసరం. దురదృష్టవశాత్తు, వామపక్షాలకు ఎన్నికల్లో తగిలిన ఎదురు దెబ్బలు ఆర్థిక మితవాదాన్ని కొన్ని ప్రాంతీయ పార్టీలకు మరింత ఆకర్షణీయం చేశాయి. ఈ ధోరణిని అరి కట్టడానికి, విధానాల రూపకల్పనలో వామపక్షం వైపు మొగ్గు కలిగిన మధ్యే మార్గాన్ని సాధించటానికి సమాజంలో వామపక్షం ఉనికి పెరగాలి, ప్రభావవంతం కావాలి.



సూత్రబద్ధ ప్రతిపక్ష ఐక్యత:

మితవాదం వైపు మొగ్గుతో కూడిన మధ్యే మార్గం, సామాజికంగా మితవాదం ఆర్ఎస్ఎస్, బీజేపీలను ఓడించలేవని నొక్కి చెప్పాలి. ప్రతి పక్ష ఎజెండా ఆర్ఎస్ఎస్ ఆర్థికంగా, సామాజికంగా సాధించటానికి ప్రయత్నిస్తున్న దానికి మౌలికంగా భిన్నంగా ఉండాలి. అందువల్ల ఆర్ఎస్ఎస్, బీజేపీలకు వ్యతిరేకంగా ఐక్యతను పటిష్ఠం చేయటానికి మధ్యేవాదులు వామపక్షం వైపు మొగ్గు చూపటం అవసరం. ఈ ఐక్యత సాధించేందుకు వామపక్షం చొరవ తీసుకోవాలి. ఆ ప్రయత్నం చేస్తూనే, వామపక్షం స్పష్టమైన ఆర్థిక ప్రత్యామ్నాయం, సామాజిక సామరస్యం ఎజెండాతో ఆర్ఎస్ఎస్ ఎజెండాకు వ్యతిరేకంగా శ్రమజీ వుల వద్దకు వెళ్లి వారిని సమీకరించాలి.

వామపక్ష ఐక్యతపై:

మనదేశం, దాని ప్రజల ప్రాథమిక ప్రయోజనాలను రక్షించటంలో వామపక్షం పాత్రపై సీపీఐకి స్పష్టత ఉంది. వర్గదోపిడీ, కుల వివక్ష, లింగ ప్రతిబంధకాలకు వ్యతిరేకంగా పోరాటాలు అంతర్ సంబంధంగలవని, ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా మన సైద్ధాంతిక ప్రతిఘటనకు అవి ప్రాతిపదిక అవుతాయని సీపీఐ విశ్వసిస్తున్నది. ఆర్ఎస్ఎస్ ఫాసిస్టు భావజాలానికి నిబద్ధమై ఉంది. దానికి వ్యతిరేకంగా పోరాడటం, ఓడించటం వామపక్షం చారిత్రక పాత్ర. ఈ స్పష్టమైన దృష్టితో సీపీఐ...వామపక్ష ఐక్యత బ్యానర్ చేపట్టింది. సూత్రబద్ధ ప్రాతిపదికపై భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ ఏకీకరణ భారత రాజకీయ రంగంలో బలమైన, స్వతంత్ర వామపక్ష స్తంభం నిర్మించడం కాలం చేస్తున్న డిమాండ్ అని సీపీఐ విశ్వసిస్తున్నది. ఈ ఐక్యత లౌకిక ప్రజాతంత్ర శక్తుల విశాల సంకీర్ణాన్ని నిర్మించటంలోనేగాక సామాజిక విముక్తి కొరకు పోరాటాలను పటిష్ఠం చేయటంలో కూడా వామపక్షం అంకితభావంతో కూడిన, అర్థవంత పాత్ర నిర్వర్తించేందుకు దానికి సహాయపడుతుంది.

(సీపీఐ 24వ జాతీయ మహాసభల్లో శనివారం ప్రధాన కార్యదర్శి డి.రాజా సమర్పించిన ముసాయిదా రాజకీయ తీర్మానం నుంచి...)

దేశభక్తియుత శక్తుల విశాల ఐక్యత కోసం

బీజేపీ దుష్పరిపాలన దేశాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. మన దేశ ప్రజలపై మతోన్మాద ఫాసిస్టు తరహా దాడులు దేశ లౌకిక ప్రజాతంత్ర వ్యవస్థ ను, స్వేచ్ఛ, ఐక్యతలను తీవ్రంగా బలహీనపరుస్తు న్నాయి. దేశ సార్వభౌమాధికారానికి ముప్పు తెచ్చి పెడుతున్నాయి. ఈ సందర్భంలో బీజేపీ పరిపాలనకు కేంద్రం, రాష్ట్రాలు రెండు స్థాయిల్లోనూ లౌకిక ప్రజాతంత్ర ప్రత్యామ్నాయాన్ని అభివృద్ధి చేసే నిమిత్తం సమీకృత మవడానికి సకల లౌకిక ప్రజాతంత్ర, వామపక్ష శక్తుల సువిశాల కూటమిని నిర్మించటం తక్షణావసరం. ఈ గమ్యాన్ని నెరవేర్చే నిమిత్తం వామపక్ష శక్తు లు సమీకృతం కావటానికి, వాటి ఐక్యత, మిలిటెంట్ ప్రజా ఉద్యమాల విస్తరణకు నిర్ణయాత్మక ప్రాముఖ్యత ఉంది. తమ విషపూరిత ఎజెండాతో సమాజం లోకి చొచ్చుకుపోయేందుకు, అధికారంలో కొనసా గేందుకు ప్రయత్నిస్తున్న మతోన్మాద ఫాసిస్టు శక్తుల పన్నాగాలను ఓడించే నిమిత్తం అటువంటి ప్రత్యామ్నాయం చుట్టూ ప్రజాతంత్ర లౌకిక దేశభక్తి యుత శక్తులను సమీకరించేందుకు ఉద్యమాలు అవసరం.

పూర్వ వైభవానికి కృషి చేస్తాం

బెంగాల్ సీపీఐ నేత శ్యామ్ శ్రీ దాస్

(గురుదాస్ దాస్‌గుప్తా ప్రాంగణం, విజయవాడ నుంచి)

పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష కూటమి పూర్వ వైభవం సాధించడానికి తమ వంతు కృషి చేస్తున్నామని, సీపీఐ రెండవ అతిపెద్ద వామపక్ష పార్టీగా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తోందని ఆ రాష్ట్ర పార్టీ కార్యదర్శివర్గ సభ్యురాలు శ్యామ్ శ్రీ దాస్ చెప్పారు. విజయవాడలో జరుగుతున్న సీపీఐ 24వ జాతీయ మహాసభలకు ప్రతినిధిగా విచ్చేసిన శ్యామ్ శ్రీ దాస్ విశాలాంధ్ర ప్రతినిధి పి.రామకృష్ణకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

గతంలో 30 నుండి 40 మంది ఎమ్మెల్యేలు కలిగిన చరిత్ర సీపీఐకి ఉంది. తృణమూల్ కాంగ్రెస్ గుండాగిరి ప్రదర్శించడంతో కనీసం నామినేషన్ వేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో గత ఎన్నికల్లో కమ్యూనిస్టులుగా తాము ఎక్కువ సీట్లు గెలుచుకోలేకపోయాం. కలకత్తా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 92వ వార్డు కార్పొరేటర్‌గా సీపీఐ అభ్యర్థి విజయం సాధించారు. రానున్న ఎన్నికల్లో తృణమూల్ ఆగడాలకు ఎల్‌డీఎఫ్ కూటమి అడ్డుకట్ట వేస్తుంది. 2023లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. మమతా బెనర్జీ అరాచక పాలనకు ఈ పంచాయతీ ఎన్నికలు గీటురాయిగా మారనున్నాయి. ఈ ఎన్నికల పోరులో వామపక్షాలు గట్టి పోటీ ఇస్తాయి. బీజేపీ బలపడేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ బెంగాల్‌లో ఆ పార్టీ ఉనికి కోల్పోయింది. చట్టసభల్లో స్థానాలు తక్కువ ఉన్నప్పటికీ పోరాటాలలో వామపక్షాలు అగ్రస్థానంలో ఉన్నాయి. బెంగాల్‌లో అతిపెద్ద పోరాటం తేభాగా ఉద్యమం. సాగు చేసే వారికి భూమి ఇవ్వాలని కమ్యూనిస్టుల అధ్వర్యంలో పోరాటం జరిగింది. ఈ పోరాటంలో తృణమూల్ కాంగ్రెస్ గుండాలు సీపీఐ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు.

చాలామంది గాయపడ్డారు. బెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ ప్రైవేటీకరణ విధానాలు అవలంబిస్తున్నాయి. ప్రాంతాల మధ్య, మతాల మధ్య చిచ్చుపెడుతున్నాయి. ఈ విధానాలకు వ్యతిరేకంగా జాతీయ మహాసభలు స్ఫూర్తితో సీపీఐ బెంగాల్‌లో మరిన్ని పోరాటాలకు నాయకత్వం వహిస్తుందని ఆమె తెలిపారు.

పలస్తీనా ప్రజల విముక్తి కోసం పోరాడుతున్నాం

పలస్తీనా పీపుల్స్‌పార్టీ నాయకుడు డాక్టర్ అఖెల్ మహమూద్ అహమ్మద్ తుగోజ్

ప్రపంచ శాంతి సంఘంలో, పలస్తీనా అంతర్జాతీయ సంబంధాల శాఖలో కీలక స్థానంలో ఉన్న పలస్తీనా పీపుల్స్‌పార్టీ నాయకుడు డాక్టర్ అఖెల్ మహమూద్ అహమ్మద్ తుగోజ్‌తో విశాలాంధ్ర ప్రతినిధి ఈడుపుగంటి రోమిల ఇంటర్వ్యూ

ప్ర: పలస్తీనా కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భావం గురించి చెప్పండి?

జ: పలస్తీనా కమ్యూనిస్టు పార్టీ 1919లో ఏర్పడింది. 1993 ఓస్లో ఒప్పందానికి పలస్తీనా కట్టుబడి ఉండాలనేది పలస్తీనా పీపుల్స్‌పార్టీ విధానం. అంటే పలస్తీనా ద్విజాతి సిద్ధాంతం అమలు చేయాలి. జెరూసలేం సమస్యను ఐక్యరాజ్యసమితి పరిష్కరించవలసిన అవసరం ఉంది. పలస్తీనా ప్రజలు ఇప్పటికీ జాతీయ విముక్తి పోరాటాన్ని నిర్వహిస్తూనే ఉన్నారు. తదనంతర విభిన్న పరిస్థితుల్లో పాలస్తీనా పీపుల్స్ పార్టీగా పేరు మార్చారు.

ప్ర : పలస్తీనా రగులుతున్న రావణకాష్ఠమేనా?

జ: పలస్తీనా-ఇజ్రాయిల్ సమస్య దశాబ్దాలుగా రగులుతూనే ఉంది. అయితే ప్రస్తుతం సామ్రాజ్యవాద జోక్యంతో మరింతగా వ్యవహారం ముదిరిందని చెప్పవచ్చు. పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉంది. ప్రజల జీవన సమస్యలు చెప్పనలవికానివిగా ఉన్నాయి. సామ్రాజ్యవాద దురహంకార చర్యలతో ఇజ్రాయిల్ బాంబు దాడులతో ప్రజల మనుగడ సంక్లిష్టంగా ఉంది. పసిపిల్లల శవాలను చూస్తుంటే మనస్సు తరుక్కుపోతుంది. ఇక్కడ అత్యంత దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. ముసలివారు, మహిళలు పరిస్థితి అయితే చెప్పనలవికాదు. దిక్కుతోచని స్థితిలో ఉన్న పలస్తీనా సమస్యకు ప్రధాన కారణం అమెరికా నిరంకుశ వాదమే. ప్రజలు తీవ్ర ఆహార సమస్యను ఎదుర్కొంటున్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య, ఆకలి సమస్య, యుద్ధాలు, బాంబులతో పలస్తీనా ప్రశాంతంగా ఉండే పరిస్థితి కనిపించడంలేదు. 2007 నుండి పలస్తీనాలో ఫతా నేతృత్వంలోని ప్రభుత్వాలు రమల్లా, వెస్ట్‌బ్యాంక్‌లో అధికార దుర్వినియోగానికి తెగబడ్డాయి. హమాస్ నియంత్రణలోని గాజాస్ట్రిప్‌లో ఫతాహ్‌లను తొలగించి దుర్మార్గానికి ఒడిగట్టడం ప్రపంచానికి తెలిసిందే...ఇటువంటి ఎన్నో దుశ్చర్యలతో పలస్తీనా ప్రస్తుతం అమెరికా నియంత్రణతో వణికిపోతోందనుకుంటే పొరపాటే... పలస్తీనా పీపుల్స్‌పార్టీ ఈ దుశ్చర్యలను ఎండగడుతూనే ఉంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నాం. అయినా మా శక్తి సరిపోవడంలేదు. ప్రపంచ దేశాలన్నీ దీనిపై చర్చించి నిర్ణయం తీసుకోవలసిఉంది. ఇది తీవ్రమైన సమసిపోని అంతర్జాతీయ సమస్య. పలస్తీనా జలాల్లో చేపలు కూడా ఈదలేని పరిస్థితి దాపురించింది.

ప్ర: ఇటువంటి పరిస్థితుల్లో మీరేమి చేయాలనుకుంటున్నారు.? ఈ సమస్యకు పరిష్కారం ఏంటి?

జ: అమెరికా నిరంకుశవాదం, సామ్రాజ్యవాదాన్ని నియంత్రించేందుకు ప్రపంచ దేశాలు సమష్టిగా పోరాడాలి. ఐక్యరాజ్యసమితి జోక్యంతో పలస్తీనా సమస్యను పరిష్కరించాలి. పలస్తీనా పీపుల్స్‌పార్టీగా అప్పటివరకు మేం ఉపశమించేదేలేదు. మా రక్తం చివరి బొట్టు వరకు పలస్తీనా ప్రజల విముక్తి కోసం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటాం. ప్రపంచ దేశాలపై అమెరికా దాష్టీకాన్ని, పెత్తనాన్ని నియంత్రిచేందుకుగాను కలసికట్టుగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో పలస్తీనా పీపుల్స్, డెమొక్రటిక్ పార్టీలు దేశంలో ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమానత్వం, సోషలిజాన్ని సమర్థించే ప్రజాస్వామ్య సంస్కరణవాద ఉద్యమంగా పలస్తీనియన్లకు మద్దతు పలుకుతున్నాయి. ఇజ్రాయిల్ దాష్టీకాన్ని నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నాయి. వెస్ట్‌బ్యాంక్‌లో ఎక్కువభాగం ఇజ్రాయిల్ కబంధ హస్తాల్లో ఉంది. ఇందులో 42 శాతం ఫతా నేతృత్వంలో స్వయంప్రతిపత్తిలో ఉంది.

ప్ర: పలస్తీనాలో ఎన్నికలని వింటున్నాం..

జ: అల్జీరియా మధ్యవర్తిత్వంతో నెలరోజుల సుదీర్ఘ చర్చల తర్వాత వచ్చే నెలలో పలస్తీనాలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇది ఎంతవరకు అమలు జరుగుతుందో చూడాలి. ఎన్నికల నేపథ్యంలో తాజాగా అల్జీర్స్‌లో జరిగిన ఒప్పందంపై సంతకాల కార్యక్రమం జరిగింది. 2006లో జరిగిన ఎన్నికల్లో పలస్తీనా వర్గాల మధ్య ఏర్పడిన విభజన, తదుపరి ఎన్నికలకు తావులేకుండా చేసింది. పలస్తీనా సమస్య కేన్సర్ వంటిది. అయితే ఈ ఒప్పందం పలస్తీనియన్లకు సంతోషకరమైన రోజుగా చెప్పవచ్చు. పొరుగున ఉన్న మొరాకోతో కొనసాగుతున్న వివాదం వంటి సమస్యలు దేశాన్ని పట్టిపీడిస్తూనే ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ ప్రధానంగా యూరోపియన్ దేశాలతో పలస్తీనా సంబంధాలు మెరుగుగానే ఉన్నాయి. ఏదిఏమైనప్పటికీ సామ్రాజ్యవాదాన్ని తుదముట్టించేవరకు పలస్తీనా పీపుల్స్‌పార్టీ పోరాడుతూనే ఉంటుంది.

ప్ర: పలస్తీనా పీపుల్స్‌పార్టీ భవిష్యత్తు?

జ: స్వదేశంలో పీపుల్స్ పార్టీ భవిష్యత్తు తీవ్ర అనిశ్చితి పరిస్థితిలో ఉంది. పీపుల్స్ పార్టీ పలస్తీనా ప్రజల హక్కుల కోసం, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మా గళం వినిపిస్తూనే ఉన్నాం.. పోరాడుతూనే ఉన్నాం.

A.P. PROGRESSIVE WRITER'S ASSOCIATION
&
INDIAN PEOPLE'S THEATRE ASSOCIATION - A.P

Cardially invite you to grace the meeting
on 17th October 2022 (Monday) evening 5.00 hrs
at Hanumantharaya Grandhalayam, Vijayawada.

Topic : The need for Literary Cultural Renaissance in the present political context

Speakers :
Sri Sukhdev Singh Sirsa
General Secretary - A.I.P.W.A, Chandigarh
Sri T.V. Balan
Vice President - IPTA, Kerala
Sri Vineet Tiwari
Secretary - A.I P.W.A, Madhya Pradesh
Sri R.V. Rama Rao
President - Telangana State PWA Unit
Sri Chandra Naik
President - Andhra Pradesh state IPTA Unit
Sri Penugonda Lakshminarayana
Secretary - All India PWA
Sri Gani National Secretary - IPTA will also attend
Sri Valluru Sivaprasad Gen. Sec. AP PWA
Sri Chinnam Penchalayya Gen. Sec. AP IPTA
will co-ordinate the meeting

✿ Cultural Programmes follows ✿

పాండ్యన్

జీవితమంతా పోరాటమే...!

ముప్పై ఏళ్లలో అంతర్జాతీయ రాజకీయాల్లో జరిగిన పరిణామాలన్నీ ఇట్టే చెప్పేయగల మేథస్సు సీపీఐ నేత డేవిడ్ పాండ్యన్ (1932 మే 18-2021 ఫిబ్రవరి 26) సొంతం. పాండ్యన్ ఆలోచన ఓ జలపాతం... ప్రసంగం సెలయేరు ప్రవాహం. యువతకు స్ఫూర్తిప్రదాత. తమిళం, ఆంగ్ల భాషల్లో పాండ్యన్ దిట్ట. ఆయన ఎన్నో రచనలు చేశారు. పాండ్యన్ మద్రాసు ప్రెసిడెన్సిలోని కీలవెల్మణిలో సామాన్య కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు ఇద్దరూ క్రిస్టియన్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేశారు. పాండ్యన్ ఎప్పుడూ చిరునవ్వుతో కనిపించేవారు. ఆయన ముఖంలో చిరాకు, విసుగు అనేది కనిపించేదికాదు. ఆయన జీవితమంతా ఒక పోరాటంగానే సాగింది. జీవితంలో ఎదురైన ఆటుపోట్లు అన్నింటిని ఆయన విజయవంతంగా ఎదుర్కొన్నారు. పాండ్యన్ అనర్గళంగా మాట్లాడగలరు.

పాండ్యన్ విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు రాజకీయాలలోకి ప్రవేశించారు. విద్యార్థిగా ఉన్నప్పుడే జాతీయ స్థాయి నాయకుడి స్థాయికి ఎదిగారు. 1953లో సీపీఐలో చేరిన పాండ్యన్ సీపీఐ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యునిగా సుదీర్ఘకాలం పార్టీకి సేవలు అందించారు. ఇండియన్ రైల్వే లేబర్ యూనియన్ అధ్యక్షునిగా పనిచేశారు. మంచి రచయిత, ట్రేడ్ యూనియన్ నేత. రాజకీయాలతో పాటు సాంస్కృతిక కార్యకలాపాల్లోనూ పాండ్యన్ క్రియాశీలంగా వ్యవహరించేవారు. దశాబ్దాల పాటు రాష్ట్ర, జాతీయస్థాయి రాజకీయాల్లో రాణించారు. ఎనిమిది అంతస్తుల సీపీఐ తమిళనాడు రాష్ట్ర కేంద్ర కార్యాలయం 'బలన్ ఇల్లమ్' నిర్మాణానికి మూలం పాండ్యన్. 1968లో మదురైలో జరిగిన యువజన సదస్సులో నిరుద్యోగంపై తొమ్మిది నిమిషాల పాటు పాండ్యన్ చేసిన అనర్గళ ప్రసంగం అందరినీ ఎంతగానో ఆకట్టుకుంది.

పాండ్యన్ ఆరేళ్ల పాటు (2015 వరకు) సీపీఐ తమిళనాడు కార్యదర్శిగా పనిచేశారు. ఆయన ఉత్తర మద్రాసు నియోజకవర్గం నుంచి 1989లో మొదటిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1991లోనూ అదే స్థానం నుంచి గెలిచారు. రెండుసార్లూ యునైటెడ్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (యూసీపీఐ) అభ్యర్థి గా పోటీచేశారు. వయస్సు పైబడటానికి తోటు దీర్ఘకాలిక వ్యాధుల కారణంగా పాండ్యన్ చక్రాల కుర్చీకే పరిమితమైనా జీవితచరమాంకం వరకు పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలంగా వ్యవహరించారు. రాజకీయ సమావేశాలు, సభలు, కార్యక్రమాలకు వెళ్లేవారు. 2021 ఫిబ్రవరి 26న మృతి చెందడానికి ముందు జనవరి 18న మదురైలో సీపీఐ రాజకీయ సదస్సులోనూ ప్రసంగించారు. 'ఈ సదస్సులో పాండ్యన్ మాట్లాడలేదు గర్జించారు... అది విని మేమంతా ఎంతో స్ఫూర్తిపొందాం' అని ఆ సదస్సులో పాల్గొన్న అనేక మంది చెప్పారు. 2020డిసెంబరు 24న చెన్నైలో ద్రవిడ కజగం ఆధ్వర్యంలో పెరియార్ అవార్డును పాండ్యన్ అందుకున్నారు.

- మోదుమూడి మురళీకృష్ణ

అంగారం, శృంగారం మేళవింపు మఖ్దూం

ఒక వేపు రాజకీయ కార్యకలాపాలు, మరో వేపు కార్మికోద్యం మధ్య ఊపిరాడని స్థితిలో ఉన్న మఖ్దూం మదిలో మెదిలే ఆలోచనలు కవిత్వంగా జాలు వారాయి. రాజకీయాలు, సాహిత్యం పెనవేసుకుపోయిన జీవితం మఖ్దూంది. తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపు ఇచ్చిన ముగ్గురు కమ్యూనిస్టు నాయకులలో మఖ్దూం కూడా ఉన్నారు. మిగతా ఇద్దరు రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లా రెడ్డి. మెదక్ జిల్లా అందోల్‌లో 1908లో జన్మించిన మఖ్దూం కొంతకాలం హైదరాబాద్ సిటీ కాలేజీలో ఉర్దూ లెక్చరరుగా పని చేశారు. హైదరాబాద్‌లోనూ, తెలంగాణాలోనూ కార్మిక సంఘాలను నెలకొల్పడంలో ఆయన కృషి అపారమైంది. ఆ తరవాత ప్రముఖ కార్మిక నాయకుడయ్యారు. ఇతరులతో జరిపే సంభాషణలూ మఖ్దూం మనసులో కవిత్వం చిలికేది. ఉదాహరణకు గాయని షకీలా బానో భూపాలి, కవి షాహిద్ సిద్దీఖీతో 1963లో మఖ్దూం సంభాషణల తరవాత మఖ్దూం "ఫిర్ చిడీ రాత్ ఫూలోంకి" కవిత రాశారు. మఖ్దూం సినిమాల కోసం పాటలు రాయలేదు కానీ ఆయన రాసిన కొన్ని పాటలను సినిమాలలో వాడుకున్నారు. "ఫిర్ చిడీ రాత్ ఫూలోంకి" బాజార్ సినిమాలో వినియోగించుకున్నారు. "చమేలీ కె మండ్వే తలే దో బదన్ ప్యార్ కి ఆగ్ మె" అన్న ప్రసిద్ధమైన పాట చా చా చా చిత్రం ద్వారా సినిమా పాట అయిపోయింది. మఖ్దూం కవిత్వంలో రెండు భిన్న పార్శ్వాలు కనిపిస్తాయి. ఒక వేపు ఆక్రోశం మరో వేపు మార్దవం ప్రతిబింబించారు ఆయన. అందుకే మఖ్దూం కవిత్వం అంటే " మల్లె పూల పరిమళం తుపాకీ మందు వాసన" అన్నారు ప్రసిద్ధ రచయిత కేఏ అబ్బాస్. కవిత్వ రచనలో మఖ్దూం అంగారాన్ని, శృంగారాన్ని మేళవించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉర్దూలో ఎం.ఎ.డిగ్రీని పుచ్చుకున్న మఖ్దూం మొహియుద్దీన్ 1940 ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీలో హోల్‌టైమర్‌గా చేరి అధ్యాపక వృత్తిని వదిలివేశారు. ఆంధ్రమహాసభ నాయకత్వంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన ప్రజాందోళనలో అగ్రభాగాన నిలిచారు. విశాలాంధ్ర రాష్ట్రసాధనకు జరిగిన పోరాటంలో ముందున్నారు. 1948 నుండి 1952 వరకు ఐదేళ్లు రహస్య జీవితం గడుపుతూ అరెస్టయ్యారు.

నైజాం సంస్థానంలో రాజకీయ పార్టీ స్థాపనే ఘోర అపరాధంగా పరిగణించిన 1930 కాలంలో రావినారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డిలతో పాటు కమ్యూనిస్టు పార్టీని నెలకొల్పినవారిలో మఖ్దూం మొహియుద్దీన్ ఒకరు. నైజాం రాజ్యంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో వందకు పైగా సంఘాలను స్థాపించి వాటి అధ్యక్ష బాధ్యతలు వహించారు. వాటిలో ముఖ్యమైనవి సింగరేణి కాలరీస్ వర్కర్స్ ఫెడరేషన్, ఆజాంజాహి మిల్ వర్కర్స్ ఫెడరేషన్, ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్, నిజాం స్టేట్ రైల్వే మెన్స్ ఫెడరేషన్. 1952లో నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. 1958లో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఏర్పాటైన నాటి నుంచి 1969 ఆగస్టు 25వ తేదీ రాత్రి గుండెపోటుతో ఆకస్మిక మరణం పొందేవరకు అందులో సభ్యులుగా ఉన్నారు. మఖ్దూం చనిపోయేనాటికి ఏఐటీయూసీ ఉపాధ్యక్షులుగా, సీపీఐ జాతీయ సమితి సభ్యులుగా, రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సభ్యులుగా వున్నారు.

మఖ్దూం మొహియుద్దీన్

-అనన్యవర్మ



పార్టీ కోసం ఆస్తులమ్మిన

మహిళామణి లలితాదేవి

సీపీఐ కార్యాలయానికి విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు తనకు మిగిలిన చిన్నపాటి మంగళసూత్రం గొలుసును సైతం విరాళంగా అందజేసి పార్టీపై తనకున్న విధేయతను చాటుకున్నారు మహిళా ఉద్యమనేత అమరజీవి మోదుమూడి లలితాదేవి. సనాతన సాంప్రదాయ కుటుంబంలో జన్మించి తన భర్త కృష్ణాజిల్లా కమ్యూనిస్టు ఉద్యమ అగ్రగణ్యులు అమరజీవి మోదుమూడి శ్రీహరిరావు ఉద్యమబాటలో అడుగులో అడుగువేస్తూ ఇంటికి వచ్చిన నాయకులు, కార్యకర్తలకు తాను తిన్నా తినకపోయినా తృప్తిగా భోజనం పెట్టే మహాసాధ్వి ఆమె.

కృష్ణాజిల్లాదివి తాలూకా లింగారెడ్డిపాలెం గ్రామంలో సనాతన సాంప్రదాయ కుటుంబంలో జన్మించి మోదుమూడి శివారు రామచంద్రపురం గ్రామానికి చెందిన మేనత్త కొడుకు శ్రీహరిరావుతో వివాహం అయినది మొదలు ఎన్ని కష్టాలనైనా ధైర్యంగా ఎదుర్కొన్న ధీరోదాత్తురాలు లలితాదేవి. భర్త శ్రీహరిరావు చదువుకునే రోజుల్లోనే రెండో ప్రపంచ యుద్ధానికి వ్యతిరేకంగా కరపత్రాలు పంచుతూ అరెస్టయ్యారు.అయితే, అప్పటికి ఆయన మైనర్ అయినందున పోలీసులు విడిచిపెట్టారు. తరువాత కమ్యూనిస్టు పార్టీలో చేరి ననకా బుచ్చికోటయ్య, మందపాకల వెంకటరత్నం, కోటంరాజుతో కలిసి అంటరానితనానికి వ్యతిరేకంగా, ఆనాడు వ్యవసాయ కూలీలకు వేతనం పెంచడంలోనూ, గ్రామీణ ప్రాంతంలో దేవతల సంబరాలకు ఇచ్చు జంతు బలులకు వ్యతిరేకంగా పోరాడడం, కమ్యూనిస్టు పార్టీ, ప్రజాసంఘాల నిర్మాణంలో తలమునకలై ఉన్న సమయంలో భర్త అడుగుజాడల్లో నడుచుకుంటూ విప్లవోద్యమానికి తోడ్పాటు అందించిన వీరవనిత లలితాదేవి.

పార్టీపై నిషేధంతో భర్త రెండు సంవత్సరాలు రహస్య జీవిత గడిపి బయటకు వచ్చిన తరువాత పార్టీ ఆదేశంతో కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నానికి మకాం మార్చడంతో ఇక జీవితాంతం మచిలీపట్నం, పెడన తదితర ప్రాంతాల్లో పార్టీ, మహిళా సమాఖ్య నిర్మాణంలో లలితాదేవి తనదైన ముద్ర వేసుకున్నారు. ఉద్యమాలలో పాల్గొంటూనే గంపెడు పిల్లలు, బంధువుల పిల్లలు చదువుకోసం పట్టణానికి వస్తే వారికి భోజనం, వసతి, పార్టీ కోసం పూర్తి కాలం పనిచేసే నలుగురికి ఇంట్లోనే భోజనం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి భోజనం, వసతి కల్పించి ఎంతోమంది ఉన్నత విద్యకు తోడ్పాటునందించి వారు ప్రతిభావంతులయ్యేందుకు సహకరించిన మాతృమూర్తి లలితాదేవి. పట్టణ ప్రముఖ వైద్యులు, సమతావాది డాక్టరు కుప్పా వెంకట్రామ శాస్త్రి నిర్వహించే కరుణా క్లినిక్ శ్రీహరిరావు ఇంటి సమీపంలోనే ఉండడంతో ఆ ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చే వారికి వసతి, భోజన ఏర్పాట్లు లలితాదేవినే చేసేవారు. ఏ ఎన్నికలు వచ్చినా ఎంత దూరమైనా అనారోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా వెళ్లి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేసేవారు. తనతో పాటు పట్టణం నుంచి కొంత మంది మహిళలను కూడా తీసుకువెళ్లి దళాలుగా ఏర్పడి ప్రచారం చేసేవారు. 1977 దివిసీమ ఉప్పెన వచ్చినప్పుడు బందరు, దివి తాలుకాలలో పర్యటించి మహిళా సంఘాలను ఏర్పర్చి మహిళ జీవనోపాదికి కుట్టుమిషన్లు, పాడిగేదెలను బ్యాంకు రుణాల ద్వారా ఇప్పించారు.

పట్టణంలో పార్టీ కార్యాలయానికి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయడానికి ఇబ్బందులు పడుతుంటే తనకున్న చిన్న మంగళసూత్రం గొలుసును విరాళంగా ఇచ్చి విద్యుత్ సదుపాయం కల్పించారు. కార్యకర్తలను లలితా దేవి అన్ని రకాలుగా ప్రోత్సహించారు. తమ పిల్లలను సైతం పార్టీలో పనిచేసే కార్యకర్తలుగా తీర్చిదిద్దారు. కొన్ని సందర్భాల్లో ఇంట్లో బియ్యం లేకపోయినా మొక్కవోని దీక్షతో వెనుకంజ వేయకుండా ఉద్యమబాటలో నడిచారు. తన తల్లిదండ్రులు ఇచ్చిన 2.50 ఎకరాల ఆస్తిని అమ్మి ఉద్యమానికి ఖర్చుచేసి చివరకు మందులు కొనలేని స్థితిలో అనారోగ్యంతో బాధపడుతున్నా వెరవక తమ పిల్లలలోనూ ఉద్యమస్ఫూర్తి నింపిన ఉద్యమనేత లలితాదేవిని ఆదర్శంగా తీసుకుని పట్టుదలతో నేడు యువతరం ముందుకువెళ్లాలి.

-జొన్నవిత్తుల విజయ్‌స్టాలిన్

నిషేధాలను ఎదిరించి నిలిచిన

కమ్యూనిస్టు ఉద్యమం

ఆంధ్రరాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమం 1934 ప్రాంతంలో వేళ్లూనుకుంది. మూడు మార్గాల ద్వారా రాష్ట్రంలోకి కమ్యూనిస్టు పార్టీ ప్రవేశించింది. జాతీయోద్యమంలో భాగంగా అరెస్టు చేయబడి వివిధ జైళ్లలో శిక్ష అనుభవిస్తున్నవారు ఇతర కమ్యూనిస్టు ఖైదీల వలన స్ఫూర్తి పొంది రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి పూనుకున్నారు. మద్దుకూరి చంద్రశేఖరరావు, ఉద్దరాజు రామం, అల్లూరి సత్యనారాయణరాజు, జొన్నలగడ్డ రామలింగయ్య, చలసాని జగన్నాధరావు, కానూరు బలరామయ్య, తనికెళ్ల చలపతి, కొసరాజు శేషయ్య, గద్దె లింగయ్య, గారపాటి సత్యనారాయణ, కృత్తివెంటి కుటుంబరావు తదితరులు వీరిలో ఉన్నారు.

బెనారస్ కాశీ విద్యాపీఠ్‌లో చదువుకొరకు వెళ్లిన చంద్ర రాజేశ్వరరావు, పొన్నం వీరరాఘవయ్య, తుమ్మల వెంకట్రామయ్య, కాట్రగడ్డ వెంకట నారాయణరావు, పోలేపెద్ది నర్సింహమూర్తి, పులుపుల వెంకటశివయ్య, నండూరి ప్రసాదరావు, యాళ్లబండి పోలిశెట్టి, సోమూరి వెంకట్రామయ్య, చంద్ర రామలింగయ్య, సిఎల్ రాయుడు, కాట్రగడ్డ శ్రీనివాసరావు తదితరులు అక్కడ మార్క్సిస్టు సాహిత్యం అధ్యయనం చేసి కమ్యూనిస్టులుగా మారారు. 50 మంది యంగ్ కమ్యూనిస్ట్ లీగ్‌గా ఏర్పడి మార్క్సిజంను స్టడీ సర్కిల్స్ ద్వారా అధ్యయనం చేశారు. 1934లో వీరు కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు.

మీరట్ కుట్రకేసు ముద్దాయి 'అమీర్ హైదర్ ఖాన్' అరెస్టు నుండి తప్పించుకుని పార్టీ ఆదేశంతో మద్రాసులో రహస్యంగా ఉంటూ దక్షిణ భారతంలో, మద్రాసులో కమ్యూనిస్టు బీజాలు నాటారు. ఈయన యంగ్ వర్కర్సు లీగ్‌ను స్థాపించి కమ్యూనిస్టు ఉద్యమ విస్తరణకు కృషి చేశారు. 1930లోనే హెచ్.డి.రాజా పరిచయంతో కమ్యూనిస్టు భావాలను అధ్యయనం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య, కంభంపాటి సత్యనారాయణలు 1932లో అమీర్ హైదర్ ఖాన్ ద్వారా కమ్యూనిస్టు పార్టీలో చేరారు. 1934 నాటికి మద్రాసులో కమ్యూనిస్టు పార్టీ శాఖను ఏర్పాటు చేశారు.

ఈ మూడు మార్గాలలో ఆంధ్ర రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి పునాదులు ఏర్పడ్డాయి. 1934 సెప్టెంబరులో విజయవాడ పటమటలోని కాట్రగడ్డ నారాయణరావు తోటలో కమ్యూనిస్టుల సమావేశం ఒకటి జరిగింది. దానిలో సుందరయ్య, కార్యదర్శిగా, మద్దుకూరు, పోలేపెద్ది, చలసాని వాసుదేవరావు, తనికెళ్ల వెంకట చలపతి, కొసరాజు శేషయ్య, అల్లూరి సత్యనారాయణరాజు సభ్యులుగా రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పడింది.

1934 జులై 23న రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ నిషేధించబడింది. సెప్టెంబరులో యంగ్ వర్కర్స్ లీగ్‌ను కూడా మద్రాసు ప్రభుత్వం నిషేధించింది. దీనితో కూలి రక్షణ సమితులను స్థాపించి రాష్ట్రంలో కమ్యూనిస్టులు కార్మిక సంఘాల నిర్మాణానికి పూనుకున్నారు. గుంటూరు, బెజవాడ, నెల్లూరు, ఏలూరు, బందరు, తెనాలి, భీమవరం, విశాఖపట్నం, రాజమండ్రిలలో కూలి రక్షణ సమితులతో పాటు కార్మిక సంఘాలను నిర్మించారు. కార్మికుల హక్కుల సాధనకై ఉద్యమాలు నిర్మించారు. దీనితో ప్రభుత్వం నిర్బంధ విధానం అనుసరించి పలువురు నాయకులను జైళ్ళలో పెట్టింది.

1935 ఆగస్టులో గుంటూరులో కూలి రక్షణ సమితి ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఒక రాజకీయ పాఠశాల జరిగింది. 1937 మే నెలలో కొత్తపట్నంలో ఒక రాజకీయ పాఠశాల 180మందితో జరిగింది. 1938లో మంతెన వారి పాలెంలో మరో రాజకీయ పాఠశాల జరిగింది. ఈ పాఠశాలల నిర్వహణపై కూడా ప్రభుత్వం నిర్బంధం విధించింది. కొత్తపట్నంలో లాఠీఛార్జి చేసి అరెస్టులకు పాల్పడ్డారు. ఈ పాఠశాలలు యువకులలో రాజకీయ చైతన్యం కలిగించి గ్రామగ్రామాన కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి తోడ్పడ్డాయి.

1940 ప్రాంతంలో ఆంధ్రరాష్ట్రం తెలంగాణా సరిహద్దులోని మునగాల పరగణాలో జరిగిన జమిందారీ వ్యతిరేక ఉద్యమ ప్రభావం తెలంగాణా గ్రామాలపై పడింది. మునగాల నుండి చంద్ర రాజేశ్వరరావు నేతృత్వంలో ఒక దళం బేతవోలు వెళ్ళి రైతుల సమస్యలపై సత్యాగ్రహం చేసి తెలంగాణాలో ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. 1939 మే నెలలో 23నుండి జూన్ 13 వరకు సరిహద్దు గ్రామం తునికిపాడులో ఒక రాజకీయ పాఠశాల జరిగింది. దీనిలో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల సోదరులు, సర్వదేవ భట్ల రామనాథం, పెరవలి వెంకట రమణయ్య, దేవులపల్లి వెంకటేశ్వరరావు, గంగసాని గోపాలరెడ్డి, చిర్రావూరి లక్ష్మీ నర్సయ్య వంటి 50మంది తెలంగాణా నాయకులు పాల్గొన్నారు. ఈ పాఠశాలపై కూడా ప్రభుత్వం దాడులకు పాల్పడగా మరోచోట పాఠశాల నిర్వహించారు. 1939 చివరలో 'కామ్రేడ్స్ అసోసియేషన్' పేర ఒక యువజన సంఘం స్థాపించారు. రాజబహదూర్‌గౌర్, ముఖ్దూం మొహియుద్దీన్, ఆలం ఖుద్‌మీర్, సయ్యద్ ఇబ్రహీం వంటి వారు ఇందులో ప్రముఖ పాత్ర వహించారు. వీరే ట్రేడ్ యూనియన్ ఉద్యమం నిర్మించటం ద్వారా కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి పూనుకున్నారు. గులాం హైదర్, ముఖ్దూంల నేతృత్వంలో తెలంగాణా ప్రాంతంలో కార్మిక సమ్మెలు జరిగాయి.

కమ్యూనిస్టు పార్టీ, యంగ్ వర్కర్సులీగ్, కామ్రేడ్స్ అసోసియేషన్లను ప్రభుత్వం నిషేధించినా నాయకుల పట్టుదల, కార్యదక్షత వల్ల ఆంధ్ర ప్రాంతంలో, తెలంగాణా ప్రాంతాల్లో కమ్యూనిస్టు పార్టీ ఒక బలమైన శక్తిగా ఆవిర్భవించింది.

- చలసాని వెంకట రామారావు